VISALLANDHRA Phone No. 5308 ఉదయం ★ ★ ★ Regd No. 203

విశాలాంధ్ర

సంపుటి 21 సంచిక 230 | విజయవాడ 17-11-71 బుధవారం | 6 పేజీలు 15 పై.

విశాలాంధ్ర చందా వివరాలు

	ఏజంటు ద్వారా	పోస్టు ద్వారా
నెలకు	రు. 4-62	5-00
3 నెలలకు	13-86	15-00
6 నెలలకు	27-72	30-00
సంవత్సరమునకు	44-30	48-00

దినపత్రిక 10 పైసలు

ఆదివారం సంచిక 18 పైసలు

7 నెలల్లో 566 రైల్వే ప్రమాదాలు

న్యూఢిల్లీ, నవంబరు 16

ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 566 రైలు ప్రమాదాలు సంభవించాయి. ఈ ప్రమాదాలలో 111 మంది చనిపోవటం, 327 మంది గాయపడటం జరిగిందని రైల్వే మంత్రి శ్రీ హనుమంతయ్య నేడు లోక్‌సభలో తెలియజేశారు.

అత్యవసర వస్తువుల ధరల పెరుగుదల పట్ల లోక్‌సభలో తీవ్ర ఆందోళన

గంటపాటు ప్రతిపక్ష సభ్యుల ఆగ్రహావేశాలు

న్యూఢిల్లీ, నవంబరు 16

అత్యవసర వస్తువుల ధరలు యిటీవల విపరీతంగా పెరిగిపోవటం పట్ల లోక్‌సభలో పలువురు సభ్యులు నేడు తీవ్ర ఆందోళనను ప్రకటించారు.

బడ్జెట్‌లో విధించిన పన్నులు కూడా ధరలు పెరగటానికి కొంత కారణమని ఆర్థిక శాఖ స్టేట్ మంత్రి శ్రీ కె ఆర్. గణేష్ ప్రకటించారు

క్రొత్త పంట తరుణంలో వాణిజ్యానికి, దొంగ నిల్వలు చేయడానికి, చట్టా వ్యాపారానికి బ్యాంకుల నుండి లభించే పరపతిపై నిర్బంధాలు విధిస్తామని ఆర్థిక మంత్రి శ్రీ వై. బి. చావన్ చర్చలో జోక్యం చేసుకుంటూ చెప్పారు.

రిజర్వు బ్యాంకు గవర్నరుతో నిన్న ఆయన సుదీర్ఘమైన చర్చలు జరిపారు. వాణిజ్యానికి దొంగ నిల్వలకు పరపతి సౌకర్యాలు కలిగించడంపై చాలా గట్టి అదుపు అమలు జరపాలని నిర్ణయించారు

అత్యవసర వస్తువుల ధరలు యిటీవల విపరీతంగా పెరిగిపోవటంపట్ల ప్రతిపక్ష సభ్యులు ఒక సావధాన తీర్మానాన్ని ప్రతిపాదించారు. సావధాన తీర్మానానికి సమాధానంగా శ్రీ కె ఆర్. గణేష్ ఒక ప్రకటన చేశారు.

ధరలు పెరిగిపోవటంపట్ల శ్రీ గణేష్ కూడా ఆందోళనను ప్రకటించారు.

బంగ్లాదేశ్ శరణార్థులు అపరిమితంగా రావటం, పెక్కు ప్రాంతాలలో వరదలు రావటం, కరువు ఏర్పడటంతోపాటు బడ్జెట్‌లో విధించిన పన్నులు కూడా కారణమని శ్రీ గణేశ్ తమ ప్రకటనలో పేర్కొన్నారు.

1971 మే, అక్టోబరుల మధ్య టోకు ధరల వ్యయసూచి 4.1 శాతం పెరిగింది. వినియోగ ధరలసూచి మేలో 224 వుండగా సెప్టెంబరు నాటికి 238 కు పెరిగింది. అయితే అక్టోబరులో టోకుధరల వ్యయసూచి కొంత తగ్గుముఖం పట్టిందన్నారు

నూనెగింజలు, వంట నూనెల ధరలు పెరిగాయన్నారు. అయితే గత సంవత్సరం పెరిగినంత పెరగలేదని ఆయన సంతృప్తి

(మిగతా 2 వ పేజీలో)

ట్రేడ్ యూనియన్ కార్యకర్తల రాజకీయ పాఠశాల ప్రారంభం

కొత్తగూడెం, నవంబరు 15

ట్రేడ్ యూనియన్ కార్యకర్తల రాజకీయ పాఠశాల యీ రోజు సాయంత్రం ఇక్కడ ప్రారంభమయింది.

సాయంత్రం 6 గంటలకు ఎ. పి. టి. యు. సి. అధ్యక్షులు శ్రీ జోశ్యభట్ల సత్యనారాయణ పతాకాన్ని ఆవిష్కరించటంతో పాఠశాల ప్రారంభమయింది

ఈ సందర్భంగా శ్రీ జోశ్యభట్ల మాట్లాడుతూ కార్మికవర్గంలో రాజకీయ చైతన్యాన్ని కలుగ చేయవలసిన అవసరాన్ని, రాజకీయ పాఠశాల ఆవశ్యకతను వివరించారు. సభకు సింగరేణి కాలరీస్ వర్కర్సు యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ కొమరయ్య అధ్యక్షత వహించారు. రాష్ట్ర సమితి నాయకుడు శ్రీ వై. విజయకుమార్ పాఠాలకు హాజరయ్యారు.

కడప, కర్నూలు, నెల్లూరు, గుంటూరు, ఒంగోలు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల నుండి ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు, విద్యార్థులు పాఠాలకు హాజరయ్యారు. ఇంకా కొంతమంది చేరుకోవలసి వున్నది.

వీరుగాక స్థానిక కార్యకర్తలు 40 మంది పాఠాలకు హాజరవుతున్నారు.

అగర్తలాపై గుండువర్షం

అగర్తలా, నవంబరు 16

గతరాత్రి పాక్ సైనికులు అగర్తలా పట్టణంపై గుండ్లవర్షం కురిపించారు.

కాల్పుల్లో ఒక స్త్రీ మరణించింది మరో ఆరుగురు గాయపడ్డారు. దాదాపు ఒక బుక్ షాపుతోసహా ఆరు గృహాలు ధ్వంసమైనవి.

మన సరిహద్దు దళాలు ఎదురు కాల్పులు జరిపి పాక్ సైనికులను పారద్రోలాయి. ఈ నెలలో పాక్ సైనికులు అగర్తలాపై కాల్పులు జరపటం రెండవసారి.

రు. 1.40 కోట్ల దొంగడబ్బు స్వాధీనం

న్యూఢిల్లీ, నవంబరు 16

1970-71 సంవత్సరంలో కోటి 40 లక్షల రూపాయల దొంగడబ్బును వెలికితీయటం జరిగింది. 1969-70 లో రు. 90 లక్షల దొంగడబ్బును వెలికితీయటం జరిగింది.

ఆర్థిక శాఖ స్టేట్ మంత్రి శ్రీ కె ఆర్. గణేష్ నేడు రాజ్యసభలో శ్రీ పరేశ్ ఘోష్ ప్రశ్నకు సమాధానంగా పై సమాచారాన్ని తెలియజేశారు. పెద్దనోట్ల చలామణిని రద్దు చేయడం అవసరం లేదని ప్రభుత్వం భావిస్తున్నదని చెప్పారు.

హరిజనులపై అగ్రకులాల ఆంక్ష

ఉజ్జయిని, నవంబరు 16

గ్రామంలోగల ఒకే ఒక బావినీరు వాడుకోకుండా అగ్రకులాలవారు తమను నిరోధిస్తున్నారని మూడు వారాలపాటు యిబ్బందులు అనుభవించిన కెల్యాసా హరిజనులు అధికారులకు తెలియజేశారు.

గ్రామంలోని హరిజన స్త్రీలు ప్రతిరోజూ మూడు కిలోమీటర్ల దూరంనుండి నీరు తెచ్చుకోవలసిన దుస్థితి ఏర్పడింది.

కెల్యాసా గ్రామం ఉజ్జయిని జిల్లాలో వుంది. గ్రామ జనాభా 800. ఇందులో 100 మంది హరిజనులు. 50 మంది బ్రాహ్మణులు. 200 మంది రాజపుత్‌లు 150 మంది ధాకడ్‌లు వున్నారు

గత అనేక దశాబ్దాల నుండి గ్రామంలోగల ఈ బావినుండి హరిజనులు నీరు తోడుకుంటున్నారు. దాని నుండి హరిజనులు నీరు తోడినచో ప్రాణాలు దక్కవని అగ్రకులాలవారు బెదిరించారని హరిజన వృద్ధుడు శ్రీ కాశీరామ్ నందాజీవాలె (65 సం॥లు) ఫిర్యాదు చేశారు.

అగ్రకులాలవారు విధించిన ఆంక్షను ఉల్లంఘించడానికి శ్రీమతి జమునాబాయి అనే హరిజన స్త్రీ ప్రయత్నించింది. కాని రాజపుత్‌లు కొందరు ఆమెను బెదిరించి వెళ్ళగొట్టారు.

శ్రీమతి సుహాస్‌బాయి అనే మరో హరిజన స్త్రీ మరో 15 మందితో వెళ్ళి బావినీరు తోడటానికి ప్రయత్నించింది. కాని వారిని కూడా వెళ్ళగొట్టారు. మేము ప్రాణభీతితో పారిపోవలసి వచ్చిందని శ్రీ ఒకరు చెప్పారు.

పోలీసు అధికారులు ప్రశ్నించగా, మేము ఏమీ ఆంక్ష విధించలేదని అగ్రకులాలవారు బాహాటంగా చెప్పుకున్నారు. పోలీసులు కేసు రిజిష్టరు చేయలేదు. హరిజనులు నీటి కొరకు యిబ్బంది పడుతూనే వున్నారు. (యు. ఎన్. ఐ)

బంగ్లాదేశ్ సమస్యకు త్వరలోనే పరిష్కారం

కాంగ్రెస్ పార్లమెంటరీపార్టీ కార్యవర్గ సమావేశంలో ప్రధాని వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 16

బంగ్లాదేశ్ సమస్య ఒకటి, రెండు నెలలు లేదా అంతకన్నా ముందుగానే పరిష్కారమౌతుందని ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ నేడు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యవర్గ సమావేశంలో చెప్పినట్లు తెలియవచ్చింది.

శరణార్థుల సమస్య తాత్కాలికమైనదని, వారు తమతమ స్వగృహాలకు వెళ్ళిపోతారని ప్రధాని అన్నారు

భుట్టో చైనా పర్యటన సఫలం కాలేదు. అయినప్పటికీ పాక్‌కు చైనా ఆయుధాలు కొన్ని అందాయని ఆమె అన్నారు.

షేక్ ముజిబుర్ రహమాన్ ఎక్కడున్నారో తెలియదు. ఆయనను చూడటానికి అమెరికన్లను కూడా పాక్ పాలకులు అనుమతించలేదని శ్రీ కృష్ణకాంత్‌కు ప్రధాని సమాధానమిచ్చారు.

నిక్సన్ నియమించిన ఆరుగురు సభ్యులు గల బృందం బంగ్లాదేశ్ సమస్యను లోతుగా పరిశీలించినచో దాని రాక పట్ల భారత్ ఏవిధమైన అభ్యంతరం చెప్పబోదని ప్రధాని అన్నారు.

పశ్చిమ పాక్ సైనిక పాలకుల హస్తాల నుండి తమ మాతృదేశాన్ని విముక్తి చేసుకోవటానికి గెరిల్లాలు చేస్తున్న ప్రయత్నాన్ని పరిశీలించడం ఈ బృందం ప్రధాన ఉద్దేశం కాకూడదని ప్రధాని అన్నారు.

ఈ బృందం పర్యటనను మనం పూర్తి వ్యతిరేకం కాము. బంగ్లాదేశ్ సంక్షోభానికి మూలకారణాన్ని వారు కనుగొనాలి. సైనిక పాలనలోనే ఎన్నికలు నిర్వహించటం, ఆ ఎన్నికల్లో అవామీలీగ్ ఘనవిజయం సాధించటం, వాస్తవ రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా యాహ్యాఖాన్ వ్యవహరించకుండా బంగ్లాదేశ్ ప్రజలపై దారుణ హింసాకాండను సాగించటం, ఈ సమస్య అన్నిటినీ ఈ బృందం పరిశీలించాలని ప్రధాని అన్నారు.

ఈ బృందం పర్యటన ఉద్దేశమేమిటో ప్రకటించలేదు. ఇది గెరిల్లాల కార్యకలాపాలను పరిశీలించకూడదు, బంగ్లా సమస్యను

(మిగతా 2వ పేజీలో)

భూపోరాటం కేసుల ఉపసంహరణకు డిమాండ్

ముఖ్యమంత్రికి ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి ప్రతినిధివర్గం మెమొరాండం

హైదరాబాద్, నవంబరు 16

భూ పోరాటం సందర్భంగా పెట్టిన కేసులన్నింటిని ఉపసంహరించాలని, భూ పోరాటం సందర్భంగా అరెస్టయిన భూమిలేని పేదలకు భూముల పంపకం చేయరాదంటూ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి ప్రతినిధివర్గం ముఖ్యమంత్రికి మెమొరాండం అందజేసింది.

ఈ నెల 14న ముఖ్యమంత్రి శ్రీ పి. వి. కి మెమొరాండం సమర్పించబడింది.

అన్యాక్రాంతమైన బంజరు భూముల పంపిణీ [illegible] ఆయన [illegible] మెమొ

(మిగతా 2 వ పేజీలో)

కామెకాన్ ద్వారా

సోషలిస్టుదేశాలు, భారత్ ప్రణాళికల సమన్వయం

ఢిల్లీ సదస్సులో పలువురి సూచనలు

న్యూఢిల్లీ, నవంబరు 15

భారత సోషలిస్టు దేశాలమధ్య సమగ్రమైన, మరింత ఫలప్రదమైన సహకారం సిద్ధించటానికి వీలుగా అవసరమైతే కామెకాన్ (సోషలిస్టుదేశాల ఆర్థికవ్యవస్థ)ను ఉపయోగించుకొని, భారత సోషలిస్టుదేశాల అభివృద్ధి ప్రణాళికలమధ్య సమన్వయాన్ని సాధించాలని కేంద్రమంత్రులు, ఇతర వక్తలు నేడిక్కడ ఉద్ఘాటించారు.

భారతదేశం కీలక [illegible], భారీ పరిశ్రమలలో స్వయం పోషక లక్ష్యానికి దగ్గరిగా చేరుకోవటానికి, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దూరదృష్టితో సోషలిస్టు దేశాలతో దృఢమైన ఆర్థిక సంబంధాలకు పునాది వేయటమేనని వారు అన్నారు.

"నెహ్రూ-సోషలిస్టు దేశాలతో ఆర్థిక సహకారం" అనే అంశంపై జరిగిన గోష్ఠిలో వారు ప్రసంగిస్తూ ఈ విధంగా తెలియజేశారు.

నేటిగోష్ఠిలో ప్రసంగించినవారిలో కేంద్ర మంత్రులు శ్రీయుతులు స్వరణ్ సింగ్, మోహన్ కుమారమంగళం, మొయినుల్‌హక్ చౌదరి, కె. వి. రఘునాథ రెడ్డి, సి. పి. ఐ. పార్లమెంట్ సభ్యులు ప్రముఖ ఆర్థికశాస్త్రవేత్త డాక్టర్ వి కె ఆర్ వి. రావు, [illegible] శ్రీ. కె టి లాల్ హంగేరీకి చెందిన ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త శ్రీ యం. సిమాయ్, తూర్పు జర్మనీకి చెందిన ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ కె. న్యూల్లా మొదలగువారు వున్నారు

కేంద్ర న్యాయశాఖ మంత్రి శ్రీ హెచ్. ఆర్. గోఖలే సమావేశానికి అధ్యక్షత వహించారు.

భారతదేశం ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో స్వయం పోషకత్వాన్ని సాధించటం పశ్చిమ దేశాలకు యిష్టంలేదని డాక్టర్ వి. కె. ఆర్. వి. రావు, మరి కొంతమంది వక్తలు పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందటానికి సోవియట్ యూనియన్ పెద్దఎత్తున సహాయం చేయటం ప్రారంభించిన అనంతరమే, కొన్ని పశ్చిమ రాజ్యాలు భారతదేశానికి సహాయం చేయుటానికి ముందుకు వచ్చాయని అన్నారు.

భారత సోషలిస్టు దేశాలమధ్య సమగ్రమైన, మరింత ఫలప్రదమైన సహకారం పెంపొందటానికి వీలుగా అవసరమైతే కామెకాన్ (సోషలిస్టు దేశాల ఆర్థిక వ్యవస్థ)ను ఉపయోగించుకొని భారత సోషలిస్టు దేశాల అభివృద్ధి ప్రణాళికలమధ్య సమన్వయం ఏర్పరచుకోవాలని సూచించారు.

రూపాయల చెల్లింపు పద్ధతి మూలంగా భారత-సోవియట్ దేశాలు తమ వాణిజ్యాన్ని పెంపొందించుకోవటానికి వీలు కలిగిందని వారన్నారు.

భారత సోవియట్‌ల మధ్య మైత్రీ ఒప్పందం కుదిరిన అనంతరం భారత సోవియట్ దేశాల మధ్య పెరుగుతున్న ఆర్థిక సహకారం

(మిగతా 5 వ పేజీలో)



పనామా అభిమాని— పరిచయం

అతనికి భారతీయ వస్తువులంటే ఇష్టం. నిజంగా భారతీయ సువాసన అంటేనే. తారతమ్య వివక్షణతో ఆదేదంచి పొగ త్రాగే వ్యక్తి. అతను కమ్మని, మంచి పనామాతో ఆనందంతో పొంగి పోతాడు. అతనికి బాగా తెలుసు—తన పనామా నిప్పులంచే శ్రేష్ఠమైన వర్జీనియా పొగాకుతో ఎరి చేయబడి, దాని నాణ్యత జాగరూకతతో గర్వకారణంగా కాపాడబడినదని.

అతన్ని కొంచెం కదిపి చూడండి. జాతీయ భావాన్ని ఒలక పోసి మాట్లాడుతాడు; పనామా మన దేశపు బ్రాండు, మనందరి స్వంతం అని వక్కాణిస్తాడు జాతి గౌరవం భంగపరచే విదేశీ యాజమాన్యం గల అంతర్జాతీయ బ్రాండ్ల మోహానికి అతను ఎప్పుడూ దాసిన కాబోడు. తన అభిప్రాయంలో మెచ్చుకో దగ్గ ధైర్యం అతనికి పనామా అంటేనే అభిమానం. దానిని ఎల్లప్పుడూ భారతీయ సిగరెట్టు పరిశ్రమకు తలమానికంగా కొనియాడుతాడు.

Panama 20 CIGARETTES

గోల్డెన్ టొబాకో కంపెనీ లిమిటెడ్, బొంబాయి-56.

పూర్తిగా భారతీయమైనది— యాజమాన్యం • అజమాయిషి నిర్వహణ • సాంకేతిక నైపుణ్యం

GT (P)-704-Tel



రాముడు ఎంత మంది పిల్లల్ని తెచ్చుకున్నా నాకు బాధలేదు, అది ఆయనిష్టం. అక్క కర్మ కాలి ఎదవ చివరికి నా నెత్తిమీదే ఏకాడు కన్నా! ఇంకొన్ని వరంపిస్తే యెలా చెప్పండి!

రామాంజనేయ ఫిలింస్

రామాలయం

దర్శకత్వం కె. బాబూరావు, నిర్మాత కె ఏ ప్రభాకర్

SUVARNA



నేడే చూడండి!

ఎంతటిలోపం ఉన్నా ప్రతిప్రాణికీ ఒక ప్రయోజనం ఉంది ఎవరికీ అక్కర్లేని వాళ్ళు కూడా ఎవరికో ఒకరికి కావలసి వస్తారు. వాళ్ళకోసమైనా బ్రతకాలి, నవ్వాలి

అన్నపూర్ణ కంబైన్స్

తల్లీకూతుళ్ళు

దర్శకత్వం జి రామినీడు

మాటలు కె చటర్జీ నిర్మాతలు టి క్రాంతికుమార్ బి రఘువరావు

అన్నపూర్ణ రిలీజ్

అందాల సుందరి "చిన్నాదేవి" నృత్యగానాలకు ముగ్ధుడైన "శ్రీకృష్ణదేవరాయలు" ఆమెను మనసారా ప్రేమించాడు అంతే కాదు ఆజన్మాంతం నీ చేయి వదలనని బాస చేశాడు దేవదాసియైన చిన్నాదేవిని పట్టమహిషిగా అంగీకరించ జాలం అన్నాడు మహామంత్రి తిమ్మరుసు

వారి మాటకు అడ్డుచెప్పగల ధైర్యం రాయలకు లేదు అట్లని దివిజగంగకంటె పావనమైన చిన్నాదేవి ప్రేమను తిరస్కరించగలడా? అది ఊహించుటకు కూడా వీలులేని విషయం

మరి ఈ క్లిష్ట సమస్యను రాయలు వారు ఎలా పరిష్కరించారు?

సమాధానం

శ్రీకృష్ణదేవరాయలు

చిత్రం చూసి తెలుసుకోండి!

STUDIO Kal



నవంబర్ 19 విడుదల! మ్యాట్నీలతో

అశేషఆంధ్రప్రజలప్రశంసలు పొంది-శతదినోత్సవాలు జరుపుకొని-ఆంధ్రప్రభుత్వంచే బంగారునంది బహుమతి అందుకున్న 'కథానాయకుడు' పలుకేంద్రాలకు మళ్ళీ వస్తున్నాడు!

గోపాలకృష్ణ ప్రొడక్షన్స్

కథానాయకుడు

కె. హేమాంబరధరరావు కె. గోపాలకృష్ణ

పూర్ణా రిలీజ్

NAVRANG



బసంత్ పిక్చర్స్

శ్రీకృష్ణలీల

రంగులలో చూడండి!

దర్శకుడు: హోమీ వాడియా

రేపే విడుదల! మ్యాట్నీలతో ప్రారంభం ఇప్పుడు రంగులలో చూడండి!

కాళీయ మర్దనం! వృషభాసుర సంహారం! గోపికా వస్త్రాపహరణం! గాంధర్వ శాపవిమోచనం! రాధాకృష్ణుల మధుర ప్రణయ [illegible]! ఇంకా ఎన్నో! శ్రీకృష్ణుని చిత్రలీలలు! బ్రహ్మాండమైన పౌరాణిక చిత్రాలను అందించిన బసంత్ పిక్చర్స్‌వారి మహోజ్జ్వల పౌరాణిక చిత్రం

పూర్ణా రిలీజ్

NAVRANG

విదేశాల చే రాజకీయ పరిష్కార ఆవశ్యకత గుర్తింపు

పార్లమెంటులో ప్రధానమంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, నవంబరు 16

తూర్పు బెంగాల్‌లో ఎన్నికయిన ప్రజా ప్రతినిధులతో సంప్రతింపుల ద్వారానే రాజకీయ పరిష్కారాన్ని సాధించాలని తాను పర్యటించిన దేశాలు, యిటువలె గుర్తించినట్లుగా కనపడుతున్నదని ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ నేడు పార్లమెంటులో తెలియజేశారు.

విదేశ పర్యటనపై లోక్‌సభ, రాజ్యసభలలో ప్రకటన చేస్తూ షేక్ ముజిబుర్ రహ్మాన్‌ను విడుదల చేయవలసిందిగా పాకిస్తాన్ సైనిక పాలకులను తాను కోరాలని భావిస్తున్నారని ప్రధాన మంత్రి అన్నారు.

బంగ్లాదేశ్ ఘటనలపై దీర్ఘకాలం మౌనంగా వున్న ప్రపంచ దేశాలు ఇప్పుడు బంగ్లాదేశ్ సమస్యకు పరిష్కారం కనుగొనవలసిన అవసరాన్ని గుర్తించినట్లుగా వున్నదని శ్రీమతి గాంధీ చెప్పారు.

అణచివేత చర్యల ద్వారా కాని భారతదేశంతో సైనిక సంఘర్షణవల్లగాని సమస్య పరిష్కారం కాదని యిప్పటికైనా పాకిస్తాన సైనిక పాలకులు గుర్తిస్తారనే ఆశాభావాన్ని ప్రధానమంత్రి వెలిబుచ్చారు.

ఇప్పటికే ఎన్నికయిన ప్రజా ప్రతినిధులతో చర్చించి, వారి న్యాయమైన అభిప్రాయాల ప్రకారం రాజకీయ పరిష్కారాన్ని కనుగొనవలసిన సమస్య అని, పరిష్కరించటం సాధ్యం కాదని తాను పర్యటించిన అనేక దేశాలు, యింకా ఇతర దేశాలు గుర్తించాయని శ్రీమతి గాంధీ పేర్కొన్నారు.

ఈ సమస్య కేవలం పాకిస్తాన్ అంతరంగిక వ్యవహారమంటూ యింతకాలం మౌనం పాటించిన వారు సమస్యను త్వరితంగా పరిష్కరించవలసిన అవసరాన్ని గుర్తిస్తున్నారు.

ఐక్యరాజ్యసమితి జోక్యం కల్పించుకునే విధంగా చేయటం ద్వారా సమస్యను మరుగుపరిచి ప్రక్కత్రోవ పట్టించాలని, బంగ్లాదేశ్ పోరాటాన్ని భారత్ - పాక్ సంఘర్షణగా మార్పు చెయ్యాలనే పాకిస్తాన ప్రయత్నాలు విఫలం అయ్యాయి.

వాషింగ్టన్‌లో వున్నప్పుడే పాకిస్తాన్‌కు ఆయుధ సరఫరా నిలిపివేయాలనే నిర్ణయాన్ని తెలియజేశారు. బ్రిటన్, ఫ్రాన్సు, పశ్చిమ జర్మనీల నుండి ఆయుధాలు సప్లయి చేయలేదనికూడా తెలియజేశారు అని శ్రీమతి గాంధీ పేర్కొన్నారు.

బంగ్లాదేశ్ పరిస్థితిని సంతృప్తికరంగా పరిష్కరించేవరకు సరిహద్దుల నుండి సైన్యాలను ఉపసంహరించేది లేదని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ పరిస్థితి భారత్ భద్రతకే ముప్పుగా పరిణమించిందన్నారు.

ప్రధాన మంత్రి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, బెల్జియం, ఆస్ట్రియా, పశ్చిమ జర్మనీలలో పర్యటించారు.

తాను పర్యటించిన దేశాల నాయకులు ఉమ్మడిగాను వెంటవెంటనే చేసే ప్రయత్నాలు భారతదేశంతో సాయుధ సంఘర్షణ వలన ఉపయోగం వుండదని పాకిస్తాన్ సైనిక పాలకులు గుర్తించేందుకు దోహదం చేయగలదనే ఆశాభావాన్ని శ్రీమతి గాంధీ వెలిబుచ్చారు.

భారతదేశం తన సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రపంచ దేశాలపై ఆధారపడజాలదన్నారు. ప్రస్తుతంవున్న భారాన్ని భారత దేశం, బంగ్లాదేశ్ ప్రజలే భరించాలని పేర్కొన్నారు.

మన దేశ భద్రత రక్షణకు అనువైన చర్యలను తీసుకునే శక్తి భారతదేశానికి వున్నదన్నారు.

ప్రధానమంత్రి తన ప్రకటనను మొదట లోక్‌సభలోను, తరువాత రాజ్యసభలోను చేశారు.

అంతర్జాతీయ ఘటనపై ముందు ప్రకటన చేయాలని సిండికేట్ నాయకుడు శ్రీ గురుపాదస్వామి పట్టుపట్టడంతో రాజ్యసభలో ప్రకటన చేయటంలో ఆలస్యమయింది.

బంగ్లాదేశ్‌ను గుర్తిస్తున్నామని ముందుగా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ రాజ్యసభ నుండి సోషలిస్టుపార్టీ సభ్యులు శ్రీ రాజ్‌నారాయణ్ వాకౌట్ చేశారు.

ఎంతో సహనాన్ని ప్రదర్శించి విదేశీ బెదిరింపులకు వ్యతిరేకంగా దేశాన్ని ఐక్యంగా వుంచినందుకు ప్రధానమంత్రి రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మన సమస్యల పరిష్కారంకొరకు అంతర్జాతీయ మానవతాపైగాని, తాను పర్యటించిన దేశాలపైగాని మనం ఆధారపడి లేమని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు.

బంగ్లాదేశ్ సమస్యకు సంతృప్తికరమైన రాజకీయ పరిష్కారం సాధించబడేవరకు సరిహద్దులనుండి మన సైన్యాలను ఉపసంహరించబోమని ఆమె అన్నారు.

కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీలో

బంగ్లాదేశ్ సమస్యపై ప్రభుత్వంగాని, కాంగ్రెసుపార్టీ గాని తొందరతో నిర్ణయం తీసుకొనగూడదని కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధానమంత్రి నేడు అన్నారు.

విదేశీ నాయకులతో తాను చర్చించిన వివరాలను కాంగ్రెసు పారలమెంటరీ పార్టీకి తెలిపారు.

ఒక నిర్ణయం తీసుకొనేముందు అన్ని అవకాశాలను పరిశీలించాలని ఆమె అన్నారని తెలుస్తున్నది. ఈ నిర్ణయాన్ని ప్రతిపక్షపార్టీలతో సహా ప్రజలు ఏమేరకు సమర్థిస్తారో ముందుగానే ఆలోచించాలన్నారు.

బంగ్లాదేశ్ ఆవిర్భవించిందని ప్రకటించవో ఏ శక్తి దీనిని కాదనలేదని ఆమె చెప్పినట్లు తెలుస్తున్నది.

బ్రిటన్ యూరప్ ఉమ్మడి మార్కెట్‌లో ప్రవేశించాలని నిర్ణయించటంవలన ఆర్థిక పరిస్థితి కూడా మారుతున్నదన్నారు.

జంతర్ మంతర్ వ్యవహారం

జంతర్ మంతర్ వ్యవహారంపట్ల ప్రధాన మంత్రి విచారాన్ని ప్రకటించారని తెలుస్తున్నది.

రెండు సంవత్సరాలు వేచి యున్న కాంగ్రెస్‌పార్టీ మరికొద్ది కాలంపాటు వేచి యుండవలసిందని చెప్పారని తెలుస్తున్నది.

సివిల్‌కోర్టు మాత్రమే పార్టీ ఆస్తి వ్యవహారంపై తీర్పు యివ్వగలదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినప్పుడు పార్టీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోవాలని కొందరు నాయకులు ప్రయత్నించడం పట్ల ఆమె ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసినట్లు తెలుస్తున్నది.

భూపోరాటం కేసులు

(1వ పేజీ తరువాయి)

కేసి త్వరితం గావించాలనికూడా ప్రతినిధి వర్గం డిమాండ్ చేసింది.

ప్రతినిధివర్గంలో ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి డాక్టర్ రాజ్‌బహదూర్ గౌడ్, ప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ యల్లమందారెడ్డి, న్యాయరక్షణ సహాయ కమిటీ కన్వీనర్ శ్రీ ఎస్. గిరిప్రసాద్‌లు ఉన్నారు.

మెమొరాండంలో ఈ క్రిందివిధంగా పేర్కొనబడింది:

"మన రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల ప్రభుత్వ బంజరు, 5 లక్షల ఎకరాల అటవీ బంజరు భూములున్నాయి. ఎంతో కాలంగా భూమిలేని వ్యవసాయకార్మికులు ఈభూమిని పంపకం చెయ్యాలని, తాము చేసుకుంటున్న ప్రభుత్వ బంజర్లకు తమకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన జరుపుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం యీ భూములను భూమి లేనివారికి పంపకం చేస్తామని హామీ యివ్వటమేగాక యీ భూమిని పంపిణీ చేయటానికి సంబంధించి కొన్ని నిబంధనలను చేసింది.

ప్రభుత్వ భూముల్ని పెద్దఎత్తున ఆక్రమించుకుని కూర్చున్న భూస్వాముల్ని ఆ భూములనుండి ఖాళీ చేయించేందుకు కూడా కొన్ని నిబంధనలను రూపొందించింది.

అయితే యీ నిబంధనలేవీ మొత్తంపై అమలు జరపబడలేదు.

చిరకాలంగా భూమిలేని పేదలకు భూములు లభించలేదుకూడా. న్యాయబద్ధంగా తమకు గిట్టవలసినందుకొరకు భూమిలేని పేదలు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొన్నారు. ఆ భూములను తాము సాగుచేసుకున్నారు. ఇప్పుడు ఆభూములకు పట్టాలు పొందేందుకు వారు హక్కుకలిగి ఉన్నారు.

కాని దురదృష్టవశాత్తు ప్రభుత్వం పట్టాలివ్వక పోవడమేగాక వారిపై తప్పుడు కేసులుపెట్టి వారిని నానాబాధలకు గురిచేస్తున్నది. కాని అక్రమంగా ప్రభుత్వ భూములలో తిష్టవేసుకు కూర్చున్న భూస్వాములెవరిపైనా కేసులులేవు సరిగదా వారిని ఆ భూములనుండి ఖాళీచేయించడం కూడా జరగలేదు.

పైగా భూపోరాటంలో అరెస్టు చేయబడిన భూమిలేని పేదలకు బంజరు భూముల పంపిణీని నిషేధిస్తూ ప్రభుత్వం ఒక ఉత్తర్వు చేసింది. ఇది చాలా దారుణమైనది, చాలా అన్యాయమైంది.

భూపోరాటంలో పాల్గొన్నవారిపై పెట్టిన అన్ని కేసులు ఉపసంహరించాలని, పోరాటం సందర్భంగా అరెస్టయిన వారికి భూముల పంపిణీ నిషేధిస్తూ చేసిన ఉత్తర్వును రద్దు చేయాలని, అన్నిరకాల ప్రభుత్వ బంజర్లను భూమిలేని పేదలకు పంచటాన్ని సత్వరం చేయాలని, వారికి పట్టాలు మంజూరు చేయాలనీ మేం మిమ్మల్ని కోరుతున్నాం". అని మెమొరాండం తెలిపింది.

కేసుల విషయమై తాను పరిశీలించి అవసరమైన చర్యకై ఉత్తర్వు చేస్తానని ముఖ్యమంత్రి సమాధానం చెప్పారు.

కేసుల వివరాలు పంపాల్సిందిగా విజ్ఞప్తి

ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ వి. యల్లమందారెడ్డి ఒక ప్రకటనచేస్తూ భూ పోరాటం సందర్భంలో పెట్టిన కేసుల వివరాలను పంపాల్సిందిగా పార్టీ కార్యకర్తలను కోరారు.

ప్రదేశ్ సమితి కార్యాలయానికి ఈక్రింది వివరాలు పంపాలి:

(1) పెండింగ్‌లో ఉన్న కేసు పేరు (2) ప్రాంతంలో, (3) ముద్దాయిలుగా పేర్కొనబడినవారి పేర్లు, ఇతర వివరాలు.

ఈ వివరాలను పంపాల్సిందిగా పార్టీ కార్యకర్తలకు శ్రీ యల్లమందారెడ్డి విజ్ఞప్తి చేశారు.

సరిహద్దు జిల్లాలో కర్ఫ్యూ విధింపు

కృష్ణనగర్, నవంబర్ 16

నాడియా ముర్షిదాబాద్ జిల్లాలలోని సరిహద్దు ప్రాంతాలలో రాత్రిపూట కర్ఫ్యూను విధించారు.

ఢాకా వద్ద ఇద్దరు దౌత్యాధికార్ల మృతి

మందుపాతర్లు ప్రేలి

ఢాకా, నవంబర్ 16

ఢాకావద్ద యీ వారాంతంలో జరిగిన రెండు ఘటనలలో ఒక అమెరికా మతాధికారి, యిద్దరు పశ్చిమ జర్మనీ కాన్సలర్ అధికారులు చనిపోయినట్లు నేడిక్కడ అధికారులు తెలియజేశారు.

అమెరికా మిషనరీకి చెందిన ఒక అధికారి కాల్పులలో చనిపోయారు. పశ్చిమ జర్మనీ అధికారు లిద్దరు రోడ్డుపైన పెట్టిన మందుపాతర్లు ప్రేలడంవలన చనిపోయారు.

ఢాకాకు 8 కిలో మీటర్ల దూరంలో వున్న నవాబ్‌గంజ్ వద్ద బోటులో ప్రయాణం చేస్తుండగా రెవరెండ్ విలియం ఎవాన్స్ చనిపోయారని రోమన్ కాథలిక్ అధికారులు తెలిపారు. ఈ సంఘటన వివరాలు పూర్తిగా తమకు తెలియవని అధికారులు అన్నారు. అయితే ఇటీవల కాలంలో యీ ప్రాంతంలో పాకిస్తాన్ సైన్యానికి, ముక్తియోధులకు మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి.

పశ్చిమ జర్మని అధికారులు చిన్న ట్రాక్టరులో ప్రయాణం చేస్తుండగా మందు పాతర్లు ప్రేలి చనిపోయారు. వీరిద్దరు లోర్బ్ ఫీలాండ్ (తయారీ యార్ అటాచీ), ఎరిచ్ హోజాన్ (అడ్మినిస్ట్రేటివ్ ఛీఫ్)

ఇక్కడకు 32 కిలో మీటర్ల దూరంలో నారాయణగంజ్ వద్ద బోటుదాటి కారులో ప్రయాణం చేస్తుండగా ప్రేలుడు సంభవించి కారు పూర్తిగా నాశనమయింది

ఫీలాండ్ గత 8 నెలలుగా తూర్పు బెంగాల్‌లో వుంటున్నారని కాన్సల్ ప్రతినిధి తెలిపారు. హోజెన్ మూడు నెలలుగా ఇక్కడ వుంటున్నారు.

ఫాదర్ ఎవాన్స్ 1947 నుండి ఇక్కడ వుంటున్నారు.

ఢాకావద్ద నిన్న రాత్రి జరిగిన కాల్పులలో మరో నలుగురు పశ్చిమ పాకిస్తానీయులు చనిపోయారు. ఈ ఘటనలోనే మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో యిద్దరి పరిస్థితి తీవ్రంగా వున్నది.

డెమొక్రాట్ పార్టీ నాయకుని హతం

పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో పోటీ లేకుండా ఎన్నికయిన పీపుల్సు డెమొక్రటిక్ పార్టీ నాయకుడు మహమ్మద్ యాసిన్‌ను గెరిల్లాలు రాజ్‌షాహీ జిల్లాలో నవంబరు 12 వ తేదీన చంపివేసినట్లు పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాకు అందిన వార్తలు తెలుపుతున్నాయి. ఈ సందర్భంగానే మరో నలుగురు రజాకార్లను కూడ గెరిల్లాలు హతమార్చారు

విద్రోహుల అరెస్టు

పదకొండు మంది పాకిస్తాన్ విద్రోహులను సరిహద్దు భద్రతా దళాలు 24 పరగణాల జిల్లాలో యీరోజు ఉదయం అరెస్టుచేసినట్లు కలకత్తాలోని అధికారవర్గాలు తెలియజేశాయి.

విద్యాసమ్యంగావున్న ప్రాంతంలో దాక్కొని వున్న ముగ్గురు వ్యక్తులను భద్రతా దళాలు పట్టుకున్నారు. జెస్సోరులో పాకిస్తాన్ సైన్యం శిక్షణపొందిన విద్రోహులమేనని వీరు అంగీకరించారు.

ఈ ముగ్గురు విద్రోహులు అందజేసిన సమాచారంతో మరో 8 మంది విద్రోహులను యీ ప్రాంతంలోనే అరెస్టు చేశారు. కీలకమైన వాటిని ధ్వంసం చేయవలసిందిగా ఆదేశించి తమను భారతదేశంలోకి పంపారని విద్రోహులు చెప్పారు.

బషీర్‌హట్-టాకీ రోడ్డులో విదాంపిర్హాట్ వద్ద యీ విద్రోహులు పెట్టిన టాంకు విధ్వంసక మందు పాతర్లను భద్రతా సిబ్బంది కనుగొన్నది

ముందుగా ముజిబ్ విడుదల

అప్పుడే ముజిబ్, యాహ్యాఖాన్ చర్చలు సాధ్యమని ప్రధాని వివరణ

న్యూఢిల్లీ, నవంబరు 16

యాహ్యాఖాన్ - ముజిబుర్ రహ్మాన్‌ల మధ్య చర్చలు జరిగితే, ముజిబుర్ రహ్మాన్‌ను విడుదల చేసిన తర్వాత బంగ్లాదేశ్ పరిస్థితిని ఆయన పూర్తిగా అవగాహన చేసుకున్న తర్వాతే చర్చలు జరగాలని పశ్చిమదేశాల నాయకులకు తాను నచ్చచెప్పానని ప్రధాన మంత్రి ప్రతిపక్ష నాయకులకు చెప్పినట్లు తెలుస్తున్నది

ప్రధాన మంత్రి నేడు ప్రతిపక్ష పార్టీల నాయకులతో చర్చలు జరిపారు

ముజిబుర్ రహ్మాన్ జీవించి వున్నారోలేదో అన్న విషయమై తమకు స్పష్టమైన సమాచారం అందలేదని తెలిపారు

పాకిస్తాన్‌తో యుద్ధం రాకుండా సాధ్యమైనంత వరకు నివారించాలని పశ్చిమదేశాల నాయకులు తమకు సలహా యిచ్చారని తెలిపారు. బంగ్లాదేశ్ రాజకీయపరిష్కారాన్ని సాధించేందుకై యాహ్యాఖాన్‌ను తాము సాధ్యమైనంతవరకు నచ్చచెప్పగలమని వీరు హామీ యిచ్చారని ప్రధాన మంత్రి తెలిపారు

బంగ్లాదేశ్ విషయంపై చర్చలు జరిగితే భారత్‌కూడా తప్పనిసరిగా పాల్గొనాలని స్వతంత్రపార్టీ నాయకుడు శ్రీ పి. కె. దేవ్ సూచించినట్లు తెలుస్తున్నది

బంగ్లాదేశ్‌ను వెంటనే గుర్తించాలని జనసంఘ్ నాయకుడు శ్రీ వాజపాయ్ కోరారు. సరైన సమయంలో గుర్తించగలమని ప్రధానమంత్రి జవాబిచ్చారు

ప్రధానమంత్రి పశ్చిమ దేశాల నాయకులతో జరిపిన చర్చలకు సంబంధించి మరి కొన్ని వివరాలను తెలిపారు

ప్రధాన మంత్రి పూర్తి సమాధానాన్ని అందజేయలేదని సిండికేట్ నాయకుడు శ్రీ యస్. యన్. మిశ్రా అన్నారు. సమావేశానంతరం ఆయన పత్రికావిలేకరులతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి నివేదిక ఏకపక్షంగా వున్నదని, ఆ నివేదికతో తాము సంతృప్తి చెందలేదని అన్నారు.

జంతర్‌మంతర్ రోడ్‌లోని కార్యాలయాన్ని కాంగ్రెసు స్వాధీనం చేసుకొన్న విషయాన్ని ప్రస్తావించేందుకు శ్రీ మిశ్రా ప్రయత్నించారు. ఒక ముఖ్యమైన సమస్యను చర్చించేందుకు యీ సమావేశాన్ని ఏర్పాటు చేసినందున ఆ సమస్యను ప్రస్తావించవలదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ రాజబహదూర్ కోరారు. ఈ సమస్యను చర్చించాలని శ్రీ మిశ్రా కోరితే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేయగలమని శ్రీ రాజబహదూర్ తెలిపారు.

శ్రీ మిశ్రా దీనికి అంగీకరించక సమావేశాన్నుండి వెళ్ళిపోయేందుకు లేచారు. శ్రీ వాజపాయితోపాటు కొందరు నాయకులు శ్రీ మిశ్రాకు నచ్చచెప్పి ఆ ప్రయత్నం నుండి విరమింపజేశారు

పాకిస్తానుకు ఇజ్వెస్తియా సూచన

మాస్కో, నవంబర్ 15

అంతర్జాతీయ భద్రతను, అలాగే పాకిస్తాన్ జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకై భారతదేశంతో స్నేహసంబంధాలు ఏర్పాటు చేసుకునేందుకు మార్గాలను కనుగొనవలసిందిగా సోవియట్ యూనియన్ నేడు పాకిస్తాన్‌ను కోరింది.

భారత ఉపఖండంలో పరిస్థితిపై [illegible] ఇజ్వెస్తియా ఒక వ్యాసాన్ని ప్రచురిస్తూ పరిష్కారాన్ని సాధించేందుకై చర్యలను తీసుకుంటున్నామంటూ పాకిస్తాన్ యిస్తున్న హామీలకు అనుగుణంగా పరిస్థితి లేదని పేర్కొన్నారు

తూర్పు బెంగాల్ నుండి పెద్ద సంఖ్యలో వచ్చిన శరణార్థులు భారత్‌పై పెద్ద భారంగా వున్నారు. ఇటువంటి ఘటన యిటీవలి చరిత్రలో ఎన్నడూ జరగలేదు

ఎటువంటి శాంతియుత పరిష్కారానికైనా అనుకూలమైన రాజకీయ వాతావరణం అవసరం. అయితే పాకిస్తాన్ జాతీయ దురహంకార పత్రికలు భారత వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రతరం చేశాయని ఇజ్వెస్తియా పేర్కొన్నది

సరిహద్దుల్లో పాక్ కాల్పులు: 359 మంది మృతి

న్యూఢిల్లీ, నవంబరు 16

మార్చి 25, నవంబరు ఒకటవ తేదీల మధ్య పాకిస్తాన్ జరిపిన కాల్పులలో 359 మంది మరణించారని, 865 మంది గాయపడ్డారని నేడు రాజ్యసభలో రక్షణశాఖ స్టేట్ మంత్రి శ్రీ విద్యాచరణ్ శుక్లా తెలియజేశారు.

సరిహద్దు పరిస్థితిపై ప్రవేశపెట్టబడిన ఒక వాయిదా తీర్మానానికి సమాధానంగా మంత్రి పై విషయం చెప్పారు

వీరుకాక సరిహద్దు రక్షణ దళాలకు, వాయుసేనదళాలకు చెందినవారు, సరిహద్దు గ్రామాల ప్రజలు మరో 41 మందిని ఎత్తుకు పోవటం జరిగిందని ఆయనన్నారు.

మరణించిన వారిలో ఒక ఆఫీసరు, గురు జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లు, మరో 78 మంది సైనికులు వున్నారన్నారు

సరిహద్దు రక్షణ దళాలకు, సాయుధ దళాలకు చెందిన వారితో సహా మరో 34 మంది జాడ తెలియటం లేదు

జవానులను, ప్రజలను రక్షించే ఆత్మస్థైర్యం ప్రభుత్వానికి లేదని జనసంఘ్ సభ్యులు శ్రీ యాదవ్ చేసిన ఆరోపణను ఆయన తిరస్కరించారు

భారత గగనతల పరిధిని పాక్ విమానాలు తరచుగా ఉల్లంఘించడానికి సంబంధించి ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, ఎట్టి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత వైమానికదళం సంసిద్ధంగా వుందని ఆయన హామీ యిచ్చారు

ఈ నెల 14 వ తేదీ వరకు పాకిస్తాన్ విమానాలు భారత గగనతలాన్ని 93 సార్లు అతిక్రమించాయని శ్రీ శుక్లా తెలిపారు

బంగ్లాదేశ్ నుండి వచ్చిన శరణార్థులు 6 నెలలలోనే తిరిగి స్వదేశానికి వెళతారని గతంలో ప్రభుత్వమిచ్చిన హామీని ప్రస్తావిస్తూ ఇందుకుగాను ప్రభుత్వం తీసుకున్న చర్య లేమిటని శ్రీ మాధవ్ ప్రశ్నించారు

స్వేచ్ఛగానూ, నిర్భయంగాను శరణార్థులు తమ స్వగృహాలకు వెళ్ళే కాల పరిమితిని నిర్ణయించటం సాధ్యంకాదని శ్రీ శుక్లా చెప్పారు

అమెరికా నుండి వస్తున్న ఒత్తిడుల దృష్ట్యా బంగ్లాదేశ్‌ను గుర్తించటంలో ప్రభుత్వం జాప్యం చేస్తున్నదన్న మార్క్సిస్టు సభ్యులు శ్రీ నిరేన్ ఘోష్ ఆరోపణను ప్రస్తావిస్తూ, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని గుర్తింపు విషయమును పరిశీలించటం జరుగుతున్నదని శ్రీ శుక్లా అన్నారు

బంగ్లాదేశ్ గుర్తింపు విషయంలో ఒక నిర్ణయం తీసుకుంటే అది మనం స్వయంగానే తీసుకుంటాము. ఇతరుల సలహాపై ఆధారపడి వుండదని ఆయన చెప్పారు

బంగ్లాదేశ్ గెరిల్లాలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని శ్రీ యస్. జి. సర్దేశాయ్ (కమ్యూ) సభ్యులు చేసిన విమర్శను శ్రీ శుక్లా తోసిపుచ్చారు

బంగ్లాదేశ్ పోరాటానికి సహాయం చేయాలని పార్లమెంటు చేసిన తీర్మానాన్ని అమలు జరిపేందుకు ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటుందని శ్రీ సర్దేశాయ్‌కి మంత్రి హామీ యిచ్చారు

బంగ్లాదేశ్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసే జాతీయ వ్యతిరేక శక్తుల పనిచేయుట యంత్రాంగం వున్నదని కమ్యూనిస్టు నాయకులు శ్రీ భూపేష్‌గుప్తా ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు

ఏడు అభివృద్ధి నిరోధక పార్టీల కూటమి ఏర్పాటు

లాహోర్, నవంబరు 15

పాకిస్తాన్‌లోని ఏడు అభివృద్ధి నిరోధక పార్టీలు నూరుల్ అమీన్ నాయకత్వాన ఒక సమైక్య పార్టీగా ఏర్పడ్డాయి

నూరుల్ అమీన్ మితవాదపార్టీ అయిన డెమొక్రాటిక్ పార్టీ నాయకుడు. ఎలాగైనా అధికారాన్ని పదిలపర్చుకుని పౌరపాలన పేరుతో యాహ్యాఖాన్ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయటం వారి ధ్యేయం.

జాతీయ అసెంబ్లీలో తమ ఉమ్మడి ధ్యేయాల సాధనకై సంయుక్త పార్టీగా పనిచేయాలని తాము నిర్ణయించుకున్నట్లు వారొక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. డిసెంబరు 23 న ప్రజాప్రతినిధులుగా తాను ఎన్నుకున్న వారికి అధికారాన్ని బదిలీచేస్తానని యాహ్యాఖాన్ ఒక హామీ యిచ్చారు.

ఈ అభివృద్ధి నిరోధక కూటమికి నాయకుడైన నూరుల్ అమీన్ తూర్పు పాకిస్తాన్‌కు ఒకప్పుడు ముఖ్యమంత్రిగా పని చేశారు.

ముస్లింలీగ్‌ను మూడు గ్రూపులు, జమాత్ ఎ ఇస్లామి, జామియత్ ఉల్ ఉలేమా ఎ పాకిస్తాన్, జమాయత్ ఉల్ ఉలేమా ఎ ఇస్లాం, (ఈ పార్టీని నిజాం ఎ ఇస్లాం అంటారు) పాకిస్తాన్ డెమొక్రటిక్ పార్టీలు కలిసి ఈ కూటమిగా ఏర్పడ్డాయి

తూర్పు పాకిస్తాన్‌కు చెందిన వ్యక్తినే ప్రధాన మంత్రిని చెయ్యాలని, అలా అయితేనే పాకిస్తాన్‌ను రక్షించవచ్చని నూరుల్ అమీన్ కోరుతున్నారు.

జాతీయ అసెంబ్లీలో ఈ ఏడు పార్టీలకు మొన్న జరిగిన ఎన్నికల నాటకం అనంతరం 100 స్థానాలు ఉంటాయని రాయిటర్ చెబుతుంది, భుట్టోకు 94 స్థానాలున్నాయి

7పార్టీల కూటమి ఏర్పాటువల్ల భుట్టోకి కొంత నష్టం కలిగిందని పాకిస్తాన్ రాజకీయపరిశీలకుల వ్యాఖ్యానం

దేశంలో పూర్తిగా ఇస్లాం రాజ్యం ఏర్పరచడమే అంతిమ ధ్యేయమని ఏడుపార్టీల కూటమి నాయకుడు చెప్పినట్లు యు. పి. ఐ రాస్తున్నది

సైన్సు సాంకేతిక రంగాల కీలకపాత్ర

రాష్ట్రపతి అభిభాషణ

న్యూఢిల్లీ, నవంబరు 16

సైన్సు, సాంకేతిక విషయాలపై జాతీయ కమిటీకి రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి నేడు ప్రారంభోత్సవం చేశారు. 10 మంది సభ్యులుండే ఈ కమిటీకి కేంద్ర మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం తాత్కాలిక అధ్యక్షులుగా కొనసాగుతారు.

జాతీయాభివృద్ధికి సైన్సు, సాంకేతిక రంగాలలో కృషిని గురించి ఈ కమిటీ పరిశీలిస్తుంది

రాష్ట్రపతి ఈ కమిటీకి ప్రారంభోత్సవం చేస్తూ ఆదాయాలు అతి తక్కువగా ఉండి నిరుద్యోగం విపరీతంగా ఉండి నిరక్షరాస్యత కొనసాగుతున్న భారతదేశంలో శాస్త్ర విజ్ఞాన అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం వున్నదన్నారు

కోకాకోలా ఉత్పత్తిలో 4.5 శాతం మండి పదార్థం దిగుమతి

న్యూఢిల్లీ, నవంబరు 16

4.5 శాతం కోకాకోలా పదార్థాన్ని దిగుమతి చేసుకోటానికి కోకాకోలా ఎగుమతి కార్పొరేషన్‌ను అనుమతి ఇవ్వాలని విదేశ వాణిజ్య మంత్రిత్వ శాఖ నియమించిన కమిటీ సూచించింది.

శ్రీయుతులు ఎ. కె. ఎం. ఇస్హాక్, విక్రమ్ చౌదరి ప్రశ్నలకు లిఖిత పూర్వకంగా సమాధానమిస్తూ విదేశ వాణిజ్య మంత్రి శ్రీ ఎల్. ఎన్. మిశ్రా పై విషయం తెలియజేశారు.

సినీతారల నుండి పన్ను బకాయిలు

న్యూఢిల్లీ, నవంబరు 16

సినిమా తారలనుండి, ఇతర కళాకారుల నుండి 1 కోటి 70 లక్షల రూపాయలమేరకు ఆదాయపు పన్ను బకాయీలున్నాయని లిఖిత పూర్వక సమాధానంలో నేడు రాజ్యసభలో మంత్రి శ్రీ గణేశ్ తెలిపారు.

మొత్తం 144 మంది సినీతారలు, ఇతరులు పన్ను బకాయి పడ్డారు. వారందరిలో అతి హెచ్చు మొత్తం బకాయిపడ్డవారు తమిళ నటుడు ఎం. జి. రామచంద్రన్. ఆయన 13 లక్షల 59 వేల 132 రూపాయల పన్ను బకాయి, మరో 1 లక్ష 39 వేల 910 రూపాయల డిపాజిటు కట్టాల్సి ఉంది

తరువాత నర్గీస్‌ఖాన్ ఆయన 1 లక్షల 4 వేలు బకాయికట్టాలి. రాజకపూర్ 9 లక్షల 30 వేలు, కిశోర్‌కుమార్ 8 లక్షల 20 వేలు, ఎం. ఆర్. రాధా 7 లక్షల 70 వేలు, శివాజీగణేశన్ 8 లక్షల 60 వేలు, జానీవాకర్ 6 లక్షల 50 వేలు, దిలీప్‌కుమార్ 6 లక్షల 60 వేలు కట్టాల్సివుంది

25 పైసల నాణేల ముద్రణ

డిసెంబరు 1 నుండి 25 పైసల నాణేలు ముద్రించబడతాయని శ్రీ కె. ఆర్. గణేశ్ ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఇవి కుప్రోనికెల్ అల్యూమినియంలో ముద్రించబడతాయి. ఆ తరువాత 20 పైసల నాణేలను ముద్రించడం మానేస్తారు.

కుప్రోనికెల్‌లో 50 పైసల నాణేలు కూడా ముద్రించే విషయం ఆలోచిస్తున్నారు.

ఆవు-దూడ గుర్తుకే కాంగ్రెసే సుముఖత

([illegible])

న్యూఢిల్లీ, నవంబరు 16

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కాడి జోడెద్దుల ఎన్నికల గుర్తు తమకు లభించిన పక్షంలో కూడా కాంగ్రెసుపార్టీ ఆవు-దూడ గుర్తునే ఉంచుకోగలదని తెలుస్తున్నది

కాడి-జోడెద్దుల గుర్తును స్వీకరించవద్దని పెక్కు రాష్ట్ర పార్టీలు, పెక్కుమంది పార్లమెంటు సభ్యులు అధిష్టాన వర్గాన్ని కోరినట్లు తెలుస్తున్నది.

ఆవు-దూడ గుర్తుకు మంచి ప్రచారం లభించినది, దానినే పార్టీ గుర్తుగా వుంచుకోవాలని అధిష్టాన వర్గం భావిస్తున్నదని తెలుస్తున్నది.

ఆడిటర్ జనరల్, కంట్రోలర్ల బిల్లు ఆమోదం

లోక్ సభలో

న్యూఢిల్లీ, నవంబరు 15

ఆడిటర్ జనరల్ కంట్రోలర్ల పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలుగానూ, సుప్రీం కోర్టు న్యాయమూర్తులకిచ్చే వేతనాలను వీరికి వర్తింపచేస్తూనూ నేడు లోక్‌సభ ఒక బిల్లును స్వల్పచర్చ అనంతరం అంగీకరించింది

కంట్రోలర్ ఆడిటర్ జనరల్‌ల పదవీ విరమణ వయో పరిమితి విధించటం ఇది మొదటిసారి. వీరి వేతనాలను సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వేతనాలకు సమానంగా వుండేట్లు చేయటంవల్ల వెంటనే వీరి వేతనాలలో మార్పు వుండబోదు. వీరికి ప్రస్తుతం నెలకు 4 వేల రూపాయల వేతనం వుంది. అయితే సుప్రీం కోర్టు న్యాయమూర్తుల వేతనాలు పునర్వ్యవస్థీకరించబడితే వీరి వేతనాలు కూడా పునర్వ్యవస్థీకరించబడతాయి

కాంగ్రెసు ఎన్నికల కమిటీ సమావేశం

న్యూఢిల్లీ, నవంబరు 14

రాబోయే రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికకు సంబంధించిన నిబంధనావళిని రూపొందించేందుకై కాంగ్రెసు ఎన్నికల కమిటీ నవంబర్ 22 వ తేదీన సమావేశమవుతుంది.

ఈ విషయమై కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు నిర్ణయించింది. అన్ని రాష్ట్రాలలో అభ్యర్థుల ఎన్నిక డిసెంబరు 25 నాటికి పూర్తి కావాలని కూడ పారలమెంటరీ బోర్డు నిర్ణయించింది.

పశ్చిమ బెంగాల్ ఎన్నికలు

ప్రభుత్వం ఇంకా నిర్ణయాన్ని తీసుకోని స్థితి

న్యూఢిల్లీ, నవంబరు 16

పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల తేదీ విషయమై ప్రభుత్వం యింతవరకు ఒక నిర్ణయం తీసుకొనలేదు

న్యాయశాఖ స్టేట్ మంత్రి శ్రీ ఎన్. యస్. చౌదరి లోక్‌సభలో నేడీ విషయాన్ని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు

లోక్‌సభ మధ్యంతర ఎన్నికలకు రు. 9.16 కోట్లు వ్యయమయిందన్నారు.

వయో పరిమితిని తగ్గించాలని పెక్కుమంది డిమాండ్ చేశారని, ప్రభుత్వం యీ విషయాన్ని పరిశీలిస్తున్నదని తెలిపారు.

న్యూఢిల్లీ, నవంబర్ 15

సోషలిస్టుపార్టీ సభ్యులు శ్రీ సమర్‌గుహ యీరోజు లోక్‌సభలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించలేదు. అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించేందుకు శ్రీ గుహ నోటీసు యిచ్చారు

వరదల నిరోధానికి సమగ్ర పథకం

శ్రీ చావన్ వివరణ

న్యూఢిల్లీ, నవంబరు 16

దేశంలో వరదల నిరోధానికి, దశలవారీగా అమలుజరిపే నిమిత్తం, ప్రభుత్వం సమగ్ర పథకాన్ని రూపొందించవలసి వున్నదని ఆర్థిక శాఖ మంత్రి శ్రీ వై. బి. చావన్ నేడు రాజ్యసభలో తెలియజేశారు.

దేశంలో ఇటీవల సంభవించిన వరదలు, వరదల నిరోధానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై శ్రీయుతులు వై. పి. యాదవ్, జె. పి. మాథుర్ తదితరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఆయన పై విషయాన్ని తెలియజేశారు

దేశంలో ఈ సంవత్సరం కనీవినీ ఎరుగనంతటి వరదలు, తుఫానులు సంభవించాయని, దీనివల్ల ప్రభుత్వ బడ్జెట్ పై తీవ్రమైన భారం పడిందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల పరిహార నిమిత్తం 1971-72 బడ్జెట్‌లో రు. 150 కోట్లు మాత్రమే కేటాయించటం జరిగిందని చెప్పారు.

ఉత్తర ప్రదేశ్, బీహార్, బెంగాల్ రాష్ట్రాలలో సంభవించిన వరదలు, ఒరిస్సాలో సంభవించిన తుఫాను, ఆంధ్రప్రదేశ్, మైసూరు రాష్ట్రాలలో ఏర్పడిన కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ కేటాయింపులు ఏమాత్రం సరిపోవని అన్నారు

కేంద్రప్రభుత్వం అందజేస్తున్న సహాయము సక్రమంగా వినియోగింపబడటంలేదన్న ఫిర్యాదులున్నప్పటికీ వివిధ రాష్ట్రాలలో వరద సహాయక చర్యలను కేంద్రమే చేపట్టాలని శ్రీ జె. పి. మాథుర్ చేసిన సూచనను శ్రీ చావన్ తిరస్కరించారు. పరిపాలనరీత్యా ఈ సూచన సాధ్యం కాదని అన్నారు, రాజకీయంగా కూడా మంచిది కాదని అన్నారు.

దేశంలోని పెద్ద పెద్ద నదుల వరదల నిరోధించటానికి చాలా పెట్టుబడి అవసరమని తెలిపారు. ప్రణాళికా సంఘం, జల విద్యుత్ శాఖ రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి, వరదల నిరోధానికి, దశలవారీగా అమలుపరిచే నిమిత్తం సమగ్ర పథకాన్ని రూపొందించవలసి వున్నదని చెప్పారు.

గంగానది వరదల నిరోధానికి రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి కేంద్ర జల విద్యుత్ శాఖ ఇప్పటికే ఒక పథకాన్ని రూపొందించిందని అన్నారు.

1970 నుండి బీహారు ప్రభుత్వానికి కేంద్రం రు. 40 కోట్లు మంజూరు చేసిందని శ్రీ వై. పి. యాదవ్‌కు సమాధానంగా తెలిపారు.

ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మైసూరు రాష్ట్రాలలో కరువుపరిస్థితులను ఇటీవల పరిశీలించి వచ్చిన కేంద్ర కమిటీ సిఫారసుల మేరకు ఆయా రాష్ట్రాలలో కరువు నివారణ చర్యలను ప్రారంభించే నిమిత్తం ఆంధ్ర ప్రదేశ్‌కు రు. 18.50 కోట్లు, మహారాష్ట్రకు రు. 27.35 కోట్లు, మైసూరుకు రు. 5.40 కోట్లు కేటాయించటం జరిగిందని శ్రీ చావన్ తెలియజేశారు.

కార్మికులకు న్యాయ సహాయం

ప్రభుత్వంచే రు. 20 వేలు కేటాయింపు

హైదరాబాదు, నవంబరు 14

మన రాష్ట్రంలో కార్మికులకు న్యాయ సహాయం అందచేసే నిబంధన ఈ నెల 11 నుండి అమలులోకి వచ్చింది

ఏదోఒక పరిశ్రమలో పనిచేసే కార్మికుడిని పనినుండి తొలగింపబడితే లేబర్ కోర్టులో కేసును దాఖలు చేసుకునే స్తోమత కార్మికునికి ఉండదు. పారిశ్రామిక ట్రిబ్యునల్ లేబరుకోర్టులు యిచ్చిన తీర్పును సవాల్ చేస్తూ మేనేజిమెంటు, సుప్రీంకోర్టులో రిట్ పెట్టుకున్నచో సుప్రీంకోర్టులో వాదించుకునే శక్తి కార్మికునికి ఉండదు.

ఇటువంటి విషయాల్లో కార్మికునికి ప్రభుత్వం న్యాయసహాయం చేస్తుంది. నెలకు రు. 600 కన్నాతక్కువ వేతనంగల కార్మికులకుమాత్రమే ఈ సాయం లభిస్తుంది.

న్యాయ సాయంకొరకు కార్మికులు లేబర్ కమిషనరుకు దరఖాస్తు పెట్టుకోవాలి

1971-72 సంవత్సరానికి ప్రభుత్వం న్యాయ సహాయంక్రింద రు. 20 వేలు కేటాయించింది. రిజిస్టరైన యూనియన్లకు న్యాయ సహాయం యివ్వబడదు

పాక్‌కు రుమేనియా ఆయుధాల వార్తపై ఖండన

న్యూఢిల్లీ, నవంబరు 16

ఆయుధాలు కొనుగోలుకై ఒక పాకిస్తాన్ నౌక రుమేనియా బయలుదేరిందని కొన్ని పత్రికలలో వెలువడిన వార్తలు నిరాధారాలని, రుమేనియా రాయబార కార్యాలయంవారు నేడు ఖండించారు.

ఇండియా - రుమేనియా స్నేహ సంబంధాలను దెబ్బతీసేందుకై ఇటువంటి పుకారు ఉద్దేశించబడ్డాయని వారు తెలియజేశారు.

చిత్తూరు జిల్లాలో రక్షిత నీటి పథకం

హైదరాబాదు, నవంబరు 15

చిత్తూరు జిల్లాలో పదకొండు రక్షిత నీటి సరఫరా పథకాలు అమలు పెట్టబడ్డాయి

ఈ పథకాలకు గ్రామీణ అభివృద్ధి బోర్డు గ్రాంటు లభించింది.

వెంకటగిరికోట, నగరి శాంతి, నగరి కొత్తపేట, ఎరుకువేను, పీలేరు, కార్వేటినగర్, పుత్తూరు, తిరువెంగళరాజ కండ్రిగ, నేద్రవరం, వెంకటరాజా కండ్రికలో పథకాలు అమలు పెట్టబడ్డాయి

ధరల పెరుగుదల

1 వ పేజీ తరువాయి

చెందాయి. బెల్లం ధరకూడా బాగా పెరిగిందన్నారు.

1971-72 లో ఉత్పత్తి తగ్గిపోయే అవకాశం పూర్వంమున చక్కెర ధర పెరిగిందని చెప్పారు.

ఇతర వినిమయ వస్తువుల ధరలు పెరగటానికి ముడి సరుకు కొరత కారణమన్నారు. ప్రత్తి పంట గత సంవత్సరం కన్నా అధికముంటున్నప్పటికి దేశ అవసరాలు పూర్తిగా తీరవన్నారు.

కంట్రోలు వస్త్రాల ఉత్పత్తిని పెంచవలసిందని జౌళి మిల్లు యజమానులను ప్రభుత్వం కోరిందని శ్రీ గణేష్ వెల్లడించారు.

కంట్రోలువస్త్రాలు అధిక ధరలకు అమ్మకుండా వుండేందుకై ప్రతి మిల్లువద్ద ధరలను ముద్రించాలని ప్రభుత్వం కోరిందన్నారు. ప్రత్తి ధరను అదుపులో పెట్టేందుకై ఎగుమతులను అధికం చేయుచున్నారు. ఖాద్య తైలాలను కొన్నిరకాల తమ్ములను దిగుమతి చేసుకుంటున్నామన్నారు.

ప్రభుత్వ రంగంలో ఆహార ధాన్యాలను ఇంకా పెద్దఎత్తున అమ్మించాలని ప్రభుత్వం రాష్ట్రాలను కోరిందన్నారు.

సామాన్య మానవుని నడుం విరగ్గొట్టిన ధరలు

పెరిగిపోయిన ధరలు సామాన్య మానవుని నడుం విరగ్గొట్టాయని ప్రతిపక్ష-సభ్యులు తీవ్రంగా విమర్శించారు.

వివిధ ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు దాదాపు గంటసేపు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహావేశాలను వ్యక్తం చేశారు.

కమ్యూనిస్టుపక్ష నాయకుడు శ్రీ ఇంద్రజిత్ గుప్తా, శ్రీ ఎస్. ఎం. బెనర్జీలు ధరలు పెరిగిపోవటాన్ని తీవ్రంగా విమర్శించారు. ద్రవ్యోల్బణాన్ని అరికట్టేందుకు వారు కొన్ని సూచనలు చేశారు.

టోకు వ్యాపారాన్ని జాతీయంచేయాలని శ్రీ ఎస్. ఎం. బెనర్జీ సూచించారు. అత్యవసర చర్యలు తీసుకోనిదే ద్రవ్యోల్బణాన్ని అరికట్టలేము శ్రీ ఇంద్రజిత్ గుప్తా అన్నారు.

జనసంఘ నాయకుడు శ్రీ వాజ్‌పాయ్, డాక్టర్ లక్ష్మీనారాయణపాండే, శ్రీ జగన్నాథరావుజోషీలు కూడా చర్చలో పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ సమస్య

(1 వ పేజీ తరువాయి)

మూల కారణమేమిటో పరిశీలించినచో మన అభ్యంతరం ఏమీ వుండబోదని ప్రధాని అన్నారు.

12 మందికి సభ్యత్వం

కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ కార్యవర్గం నేడు 12 మంది పార్లమెంటు సభ్యులకు కాంగ్రెస్ సభ్యత్వం యిచ్చింది.

వీరిలో 9 మంది తెలంగాణా ప్రజాసమితి టికెట్‌పై ఎన్నికయినవారున్నారు.

మిగతావారు ఇండిపెండెంట్లు, లేదా గతంలో సిండికేట్‌కు చెందినవారు. ఈ క్రింది వారికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సభ్యత్వమిచ్చింది,

శ్రీయుతులు జి. ఎస్. మెల్కోటే, జి. వెంకటస్వామి, యం. యం. హాషిం, జె. రామేశ్వరరావు, కె. రామకృష్ణారెడ్డి, యం. భీష్మదేవ్, మల్లికార్జున్, వి. తులసీరామ్ (వీరంతా లోక్‌సభ సభ్యులు) వి. బి. రాజు, జె. ఎ. నాగిరెడ్డి, కె. పి. మల్లికార్జునుడు, సంగా నారాయణప్ప (వీరంతా రాజ్య సభ సభ్యులు.)

వాగ్వివాదం

కొత్తగా 12 మంది సభ్యులకు సభ్యత్వం ఇవ్వడంపై నేడు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యవర్గంలో వాగ్వివాదం జరిగింది,

కొత్తవారిని చేర్చుకోవడానికి ఖచ్చితమైన నిబంధనలు అవసరంలేదని కొందరు అన్నారు, అవకాశవాదులు పదవీ వ్యామోహపరులను చేరకుండా ఉంచేందుకు దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలని ఒక వర్గం వారు వాదించారు.

పార్టీ విధానాలను గతంలో వ్యతిరేకించిన నాయకులను కొంత కాలం ప్రొబేషన్‌లో ఉంచాలని వారు సూచించారు, ఇంతలో కొందరు కాంగ్రెస్ సోషలిస్టు ఫోరంపై విమర్శ చేశారు. అయితే పార్టీ విధానాలకు కార్యక్రమాలకు వ్యతిరేకమయిన చర్యలను సోషలిస్టుఫోరం జరుపబోదని మరికొందరు సమాధానం చెప్పారు

పార్టీ సోషలిస్టు విధానాలను సోషలిస్టు ఫోరం ప్రచారం చేస్తున్నదని శ్రీమతి గాంధీ అన్నారు, అయితే ఫోరం పని విధానం గురించి తను విన్నట్టియున్న వార్తలు అందాయన్నారు.

కొన్ని సూత్రాలను నిర్వహించి, ఖచ్చితమైన నిబంధనలు పెట్టడం కష్టమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ రాజ్‌బహదూర్ అన్నారు

అయితే వ్యవహారంలో తనకూడిన సహాయమిలకూ విచక్షణా పూర్వకమైన వైఖరి ఉండాలని పార్లమెంటరీ వ్యవహారాల డిప్యూటీమంత్రి శ్రీ ఓంమెహతా అన్నారు.

"ప్రతిపక్ష చరిత్ర" ఉన్న వారిని ప్రొబేషన్‌లో ఉంచాలనీ, పార్టీలో చేరేందుకు వచ్చిన దరఖాస్తులను సరిగా పరిశీలించాలనీ పార్టీ కార్యదర్శి శ్రీ ఎల్. కె. సిన్హా సూచించారు.

96.25 లక్షల బంగ్లా శరణార్థులు

కలకత్తా, నవంబరు 16

ఈ నెల 14 వ తేదీ వరకు బంగ్లాదేశ్ నుండి మన దేశానికి 96.25 లక్షల శరణార్థులు వచ్చారని అధికార వర్గాలు ప్రకటించాయి.

మున్సిపల్ స్థలం కలప వ్యాపారికి ధారాదత్తం

అనంతపురం మున్సిపల్ కౌన్సిల్ చే

(విశాలాంధ్ర విలేకరి)

అనంతపురం, నవంబరు 16

అనంతపురంలో శ్రీకంఠం రోడ్డులో మరవ వంక చప్పిడికి ఆనుకొనివున్న మున్సిపల్ స్థలంలో కొంత భాగాన్ని ఒక ధనికుడైన కలప వ్యాపారికి కౌన్సిల్ ధారదత్తం చేస్తూ వుంది ఈ విషయంలో మున్సిపల్ డైరెక్టర్ ఉత్తర్వులు కూడా ఖాతరు చేయలేదు.

అనంతపురంలో శ్రీ కంఠంరోడ్డులో మరవవంక చప్పిడికి ఆనుకొనివున్న సర్వే నెంబరు 1910 లో రెండు ఎకరాల ఏడు సెంట్లు మున్సిపల్ భూమిని స్థానిక కలప వ్యాపారస్తుడు, సామిల్లు యజమాని శ్రీ మల్లయ్య ఆక్రమించి యిల్లు కట్టుకొని వంటలు ఎండించుకుంటూ కొన్ని ఏండ్లుగా అనుభవిస్తున్నాడు. మున్సిపాల్టీకి కౌలుగాని గుత్తకాని యివ్వటంలేదు.

ఇది చాలా అక్రమమని కొంతమంది ఆందోళన చేయగా వెంటనే అతన్ని ఆ భూమి నుండి తొలగించి భూమిని స్వాధీనం చేసుకోమని మున్సిపల్ డైరెక్టరు నుండి మున్సిపాల్టీకి ఉత్తర్వులు వచ్చాయి అయితే ఆ ఉత్తర్వు ఖాతరు చేయబడలేదు.

చాలా కాలం తర్వాత 1970 జూలై 7వ తేదీ ఈ భూమిలో 68 సెంట్లు శ్రీ మల్లయ్యకు 70 సెంట్లు జనియా [illegible] పీసు ముకద్దికి యివ్వాలని మున్సిపాలిటి తీర్మానం చేసింది

ఏడాది తర్వాత 1971 ఆగస్టు 30 వ తేదీ డైరెక్టర్ తిరిగి ఆ భూమిని స్వాధీనం చేసుకొని ప్రజోపయోగం కోసం వినియోగించాలని ఉత్తర్వులు పంపారు 1971 అక్టోబరు 31 వ తేదీ అనంతపురం మున్సిపల్‌కౌన్సిల్ తిరిగి సమావేశమై పాత తీర్మానాన్నే ఆమోదించింది. అయితే కొంతమంది కౌన్సిలర్లు వ్యతిరేకించారు

ఈ భూమి కనీసం రు. 5 లక్షలు ఖరీదు చేస్తుంది. మెయిన్‌రోడ్డును ఆనుకుని చాల ముఖ్యమైన ప్రదేశంగావుంది

స్కూళ్ళు, కాన్పుల ఆసుపత్రి, లైబ్రరీ లేదా మార్కెట్ కట్టడానికి చాలా ఉపయోగంగా వుంటుంది. కాని మున్సిపల్ కౌన్సిల్ మెజారిటీ సభ్యులకు ఈ భూమి ఆక్రమణదారుతో అనేక లావాదేవీలు వుండటంచే అధికారుల ఉత్తర్వులు పాటించకుండా యీ విధంగా ధారాదత్తం చేస్తున్నారు.

ప్రభుత్వం రెండుమార్లు ఉత్తర్వులు పంపినా ఖాతరు చేయలేదు కాన ప్రభుత్వం వెంటనే ఆ భూమినుండి ఆక్రమణదారుని తొలగించే ఏర్పాటు చేయాల్సి వుంది.

[illegible]లో పాకలు వేసుకుంటే పోలీసులచేత తొలగించి పాకలు వేయించిన ఘటనలు వున్నాయి కాని ధనికులపట్ల యీ పక్షపాతం చూపుతున్నారు. ఈ విధంగా అనేకముఖ్యమైన మున్సిపల్ స్థలాలను ధనికులు ఆక్రమించిన ఘటనలు ఎన్నో వున్నాయి

కాబట్టి ప్రభుత్వం వీటి మీద తగు చర్య వెంటనే తీసుకోవాలని పైగా ఎవరెవరు యీ విధంగా మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించినారో విచారణ జరిపి వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ సదాశివన్ ఒక ప్రకటనలో కోరారు.

గొల్లప్రోలులో రైసు ఆయిల్, జట్లు కార్మికుల సమావేశం

గొల్లప్రోలు, నవంబరు 14

తూర్పుగోదావరిజిల్లా పిఠాపురం తాలూకా గొల్లప్రోలులో రైసు, ఆయిల్, జిన్నింగు అండ్ ఫ్లోర్ మిల్లు స్టాఫ్ అండ్ వర్కర్సు యూనియన్ సమావేశం ఇటీవల జరిగింది శ్రీ మొగిలి సూర్యారావు అధ్యక్షత వహించారు

11 మిల్లులలో పని చేసే కార్మికులు, బజారులో పనిచేసే జట్టు కార్మికులు హాజరైనారు.

గొల్లప్రోలులోవున్న అన్ని మిల్లులలో వున్న కార్మికులకు ప్రావిడెంటు ఫండు, న్యాయమైన జీతాలు, జట్ల కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా రేటు, కార్మికులకు బోనసు వగైరా న్యాయంగా సాధించుకోవాలంటే సంఘం ఆవశ్యకత వుందని శ్రీ సూర్యారావు చెప్పారు.

తాపేశ్వరం చౌక డిపోలో మంచి బియ్యం గల్లంతు

అలమూరు, నవంబరు 14

తూర్పుగోదావరిజిల్లా అలమూరు తాలూకా తాపేశ్వరంలో గల చౌకడిపోకు గత నెల 25, 26 తేదీలలో 21 బస్తాలు ఆహార కార్పొరేషన్ పాత బియ్యం కోటా వేసినట్లు తహసిల్దారు తెలియచేశారు

కాని ఆ రెండు రోజుల్లో ఆ డిపో కొంతమంది మిల్లు బియ్యం కొని ఇదివరలో ఆ డీలరు ద్వారా పంచిపెట్టి వున్నాడు.

ఇదే అదనుగా డీలరు అప్పుడు వచ్చిన కార్పొరేషన్ మంచి బియ్యం 21 బస్తాలు స్వాహా చేసినట్లు ప్రజలు అనుమానిస్తున్నారు. ఈ విషయమై తహసిల్దారుకు పిటిషన్ పెట్టగా తక్షణ విచారణ జరిపి తగు చర్య తీసుకుంటానని తహసిల్దారు హామీ యిచ్చి వున్నారు.

రు. 22 లక్షల ఖర్చుతో వ్యవసాయ వివరాల సేకరణ

పశ్చిమ గోదావరిజిల్లాలో

ఏలూరు, నవంబరు 15

పశ్చిమగోదావరి జిల్లాలో రు. 22 లక్షల వ్యయంతో వ్యవసాయానికి సంబంధించిన వివరాలను సేకరించే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు భారత ప్రభుత్వ వ్యవసాయ పరిగణన కమిషనర్ శ్రీ బి జె నాయుడు ఇక్కడ తెలియజేశారు.

వ్యవసాయాభివృద్ధికై రూపొందించిన ఈ కొత్త పథకాన్ని అనుసరించి గ్రామాలలో గల వ్యవసాయక కమతాల వివరాలను స్పష్టంగా సేకరించాలి. ఇందుకు సంబంధించిన పథకాలను అమలు చేయటానికి ఈ లెక్కలు అవసరమని ఆయన తెలియచేశారు

ఈ కార్యక్రమాన్ని డిసెంబరులో పూర్తి చేయటానికి నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టరు, యితర రెవెన్యూ అధికారులతో శ్రీ నాయుడు, పై కార్యక్రమాన్ని గురించి చర్చించారు

దేశంలో ఐదు లక్షల గ్రామాలలోని ఏడుకోట్ల కమతాలలో, వ్యవసాయానికి సంబంధించిన లెక్కలు సేకరించడం జరుగుతున్నదని చెప్పారు

1950, 1960 సంవత్సరాలలో సేకరించిన వివరాలు నమూనా సర్వే పద్ధతిపైన జరిగినవని, అందుచేత వాటి ప్రయోజనం పరిమితంగానే వున్నదని అన్నారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో పౌష్టికాహార పథకాల అమలు

ఏలూరు నవంబరు 15

పశ్చిమ గోదావరిజిల్లాలో పౌష్టికాహార పథకాలు అమలు జరుగుతున్న తీరుపట్ల డా. వి. విభుదు సంతృప్తి ప్రకటించారు.

పౌష్టికాహార పథకాలు అమలు జరుగుతున్న భీమడోలు, పోడూరు మొగల్తూరు సమితులలో డా. వి. విభుదు ఇటీవల పర్యటించారు

ఈ కార్యక్రమాల అమలుకోసం స్థానిక మహిళలు చేస్తున్న కృషిని వారు అభినందించారు.

అమలాపురం ఇస్కస్ కార్యవర్గ సమావేశం

అంబాజీపేట, నవంబరు 15

అమలాపురం ఇస్కస్ కార్యవర్గ శాఖ సమావేశం ఈ నెల 5 వ తేదీన కొల్లూరివారి సత్రంలో అధ్యక్షుడు శ్రీ వి వి ఎస్ సూర్యనారాయణరాజు అధ్యక్షతన జరిగింది కృశ్చేవ్ నార్ల చిరంజీవిల మృతికి సంతాపాన్ని వ్యక్తంచేస్తూ తీర్మానించారు

సోవియట్ యూనియన్ అక్టోబరు మహా విప్లవ 54వ వార్షికోత్సవానికి సమావేశం తన అభినందనలు తెలిపింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీ రాజా తేనీటి విందు చేశారు.

ఏడేళ్ మహాసభకు ఈ శాఖ నుండి 10 మంది ప్రతినిధులను పంపాలని తీర్మానించింది. (వి. వి.)

అధికారి ఉత్తర్వు లెక్కచేయని మిల్లర్లు

దివి తాలూకాలో

పెదమోడు, నవంబరు 16

దివితాలూకా పెదమోడు లాకు చౌక డిపోకు తాలూకా అసిస్టెంట్ గ్రెయిన్ ఎక్వైరింగ్ ఆఫీసరు మిల్లర్లకు పర్మిట్లు వేస్తే, మిల్లర్లు ఖాతరుచేయకుండా బియ్యం యివ్వటంలేదు. డిపోలో బియ్యం లేక నెలకు 20 రోజులు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మంత్రి శ్రీ సుబ్బారాయుడు కిలో బియ్యం 10 పైసలు తగ్గిందని చెబుతూ వుంటే యిప్పుడు కిలోకి 10 పైసలు పెరిగింది.

మిల్లర్లు తన పర్మిట్ ఖాతరు చేయనందున తిరిగి అత్యవసర నోటీసు జారీ చేశారు ఆ ఉత్తర్వుకు కూడా మిల్లర్లు బియ్యం యివ్వలేదు ఈ విధంగా బియ్యం సరఫరా లేనందున గ్రామాల్లో చౌకడిపోలు నెలకొల్పినా ఆ చౌక డిపోలు అంతకూనే మిగిలిపోయాయి

కృష్ణాజిల్లా కలెక్టరు మెతకవైఖరివల్లనే యిలా జరుగుతున్నదని భావించబడుతూ వుంది.

భారత - సోవియట్ ఒప్పందం

ఆర్థిక రంగంలో ఇతోధిక సహకారం

భారత సోవియట్ దేశాల మధ్య గల ఆర్థిక, శాస్త్రీయ, సాంకేతిక సహకార రంగాలను మైత్రి ఒప్పందం ఒక కొత్త స్వరూపాన్ని యిచ్చింది

ఈ ఒప్పందంలో నిర్దిష్టంగా పేర్కొన్న ప్రకారం పరస్పరం లాభదాయకమైన సమగ్ర సహకారం విస్తరించడం సుస్థిరం గావటము వాణిజ్యం, రవాణా, కమ్యూనికేషన్లను మరింత విస్తృతం చేస్తాయి. సమానత్వం, పరస్పర లాభదాయకం, మన దేశంపట్ల అత్యంత సానుకూల వైఖరి ప్రదర్శించే పాతిపదికపై యిది జరుగుతుంది

సోవియట్ సహకారంతో అన్ని రాష్ట్రాలలో ఏదో ఒక పరిశ్రమ నిర్మించబడింది. కొన్ని రాష్ట్రాలలో నిర్మాణదశలో వున్నాయి ఈ విధమైన 65 ప్రాజెక్టులలో 40 ప్రాజెక్టులు పనిచేస్తున్నాయి భారత్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందటానికి సుస్థిరమైన ప్రాతిపదిక ఏర్పరేందుకు యివి దోహదం చేస్తున్నాయి సాంకేతిక ప్రగతికి చెందిన అన్ని శాఖలలో యీ పరిశ్రమలు వున్నాయి

విదేశ మారక ద్రవ్యం ద్వారా వేయి కోట్ల రూపాయలు మిగిలేందుకు యివి యిప్పటికే సహాయపడ్డాయి. నిపుణులైన దాదాపు 1 65000 వేల మందికి ఉపాధి కల్పించాయి సోవియట్ యూనియన్‌లో యిప్పటికే దాదాపు పదివేలమంది సాంకేతిక శిక్షణ పొందారు.

భారత విదేశీవాణిజ్యంలో చాలా ఎక్కువగా సోవియట్ యిప్పటికే కొనుగోలుచేస్తున్నది. 1970-71 మొదటి తొమ్మిది నెలలలో సోవియట్ యూనియన్‌కు మన ఎగుమతులు రు.27.24 కోట్ల మేరకు అదనంగా పెరిగాయి 1969-70 లో రు. 130 17 కోట్ల విలువ గల వస్తువులు ఎగుమతి కాగా, 1970-71 నాటికి యీ ఎగుమతులు రు. 157.81 కోట్ల మేరకు పెరిగాయి

పరస్పర వాణిజ్య విషయంలో కూడా భారత్‌తో వాణిజ్యం జరుపుతున్న దేశాలలో సోవియట్ యూనియన్ రెండవ స్థానాన్ని ఆక్రమించింది 1970 లో భారత సోవియట్‌ల మధ్య రు 326.9 కోట్ల విలువగల వాణిజ్యం జరిగింది 1953 లో యీ వాణిజ్యం రు. 1.3 కోట్లు మాత్రమే

వాణిజ్యంలోనేగాక యితర రంగాలలో కూడా మరింత అభివృద్ధిని సాధించేందుకు భారత-సోవియట్ ఒప్పందం ప్రత్యేకమైన అవకాశాన్ని కల్పించింది

ఉపయోగించబడకుండా వున్న భారత పారిశ్రామిక ఉత్పత్తిని వినియోగించేందుకు యిది వీలు కల్పిస్తుంది. ఒకదానికొకటి సహాయ పడే ఉత్పత్తి ఏర్పాట్లను యింకా పలు నూతన పద్ధతిలో కల్పించుకోవచ్చు.

150 నుండి 200 వేల టన్నులతయారైన ఉక్కు పరికరాలతోపాటు అన్నిరకాల ఇంజనీరింగ్ ఉత్పత్తులు భారత్‌నుండి సోవియట్‌కు పంపబడతాయి. సోవియట్ యూనియన్ భారత్‌కు 1.10 000 బేళ్ళ ముడిపత్తి సరఫరా చేస్తోంది

భారత్ దీనిని బట్ట వస్త్రాలుగా తయారు చేసి సోవియట్‌కు తిరిగి ఎగుమతి చేస్తుంది.

సోవియట్ నౌకలు, టాంకర్లు, ముడి రాగి లోహం భారత్‌కు మొట్టమొదటిసారిగా సరఫరా అవుతాయి. రు. 30 కోట్ల విలువగల ఏడు నౌకలను సరఫరా చేయవలసిందని భారత షిప్పింగ్ కార్పొరేషన్ సోవియట్‌ను కోరింది. మిశ్రమ లోహాలు, సిలికాన్ ఉక్కు రేకులు, ఉక్కు-పూతకు ఉపయోగించే మరికొన్ని మిశ్రమ లోహాలను సోవియట్ సరఫరా చేస్తుంది.

ఉభయదేశాల నిపుణులు సంయుక్తంగా పలువిధమైన చర్చలు ప్రారంభించారు. ఉభయ దేశాలు సహకరించుకొనేందుకుగల నూతన మార్గాలను వీరు అన్వేషించారు మరికొన్ని రోజులలో భారత అణుశాస్త్ర నిపుణులు సోవియట్‌లో పర్యటించనున్నారు శాంతి ప్రయోజనాలకు గాను అణుశక్తిని ఉపయోగించే విషయమై ఈ నిపుణులు చర్చలు జరుపుతారు.

సోవియట్ సహకారంతో భారతదేశంలో స్థాపించబడిన పరిశ్రమల ఉత్పత్తులను సాధ్యమైనంతవరకు కేవలం తన ఉపయోగానికే గాక మూడవ దేశంలో కమ్మడి మార్కెట్ ద్వారా అమ్మేందుకు సోవియట్ యూనియన్ కొనుగోలు చేస్తుంది

సామ్రాజ్యవాద ఆర్థిక సంక్షోభంనుండి విడివడేందుకు, విదేశ వాణిజ్య ఆర్థిక వ్యవస్థను సరిగా నిర్ణయించుకొనేందుకు భారత్‌కు మంచి అవకాశం లభించింది,

తన ఆర్థిక ప్రగతికి సామ్రాజ్యవాద దేశాల యిష్టాయిష్టాలపై భారతదేశం యింకా ఎంతో కాలం ఆధారపడనక్కరలేదు

భారత-సోవియట్ ఒప్పందంలోని ప్రధాన అంశాలలో యిది ఒకటి మనజాతీయ ఆర్థిక వ్యవస్థకు దాని ప్రాధాన్యత యిస్తున్నది

అక్టోబరు విప్లవ వార్షికోత్సవ సభలు

చంద్రగూడెం, గణపవరంలలో

చంద్రగూడెం, నవంబరు 15

అక్టోబరు విప్లవవార్షికోత్సవం సందర్భంగా కృష్ణాజిల్లా చంద్రగూడెం గ్రామంలో ఈనెల 11 వ తేదీన రాత్రి బహిరంగసభ జరిగింది. సభకు శ్రీ కేశం శివారామిరెడ్డి అధ్యక్షత వహించారు,

సభలో రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ దాసరి నాగభూషణరావు అక్టోబరు విప్లవ ప్రాముఖ్యతను భారత్, సోవియట్ మైత్రి ఒప్పందం విశిష్టతను వివరించారు ధరలు పెరిగి ప్రజలు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నా పట్టించుకోకుండా పెట్టుబడిదారుల దోపిడీకి తోడ్పాటునిస్తున్న యీ ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా విమర్శించారు. జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావు ప్రసంగిస్తూ నేటి దేశ పరిస్థితులలో పేద రైతులు, వ్యవసాయ కార్మికులు సమైక్య పోరాటాలద్వారానే వీటిని సాధించగలరన్నారు.

తర్వాత మైలవరం బ్లాకు కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ మల్నీడు కోటయ్య స్థానిక సమస్యలపై వివరించారు.

గణపవరంలో

కృష్ణాజిల్లా గణపవరంలో ఈనెల 10 వ తేదీన శ్రీ గుంటక వెంకట రామిరెడ్డి అధ్యక్షతన బహిరంగసభ జరిగింది.

సభలో జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ మాతెంపాటి బాలభాస్కరరావు ప్రసంగిస్తూ రాష్ట్రంలో బియ్యం ధరలు పెరగటానికి మిల్లర్లు, మంత్రుల లాలూచీయే కారణమన్నారు.

ప్రజా సమస్యలపై తీవ్రమైన పోరాటాలు జరగాల్సిన అవసరమెంతైనా వుందని నొక్కి చెప్పారు.

జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ కొల్లి నాగేశ్వరరావు అక్టోబరు విప్లవం ఆదర్శంగా మన దేశంలో సోషలిజం స్థాపనకు ప్రజలు సంసిద్ధం కావాలన్నారు. మైలవరం బ్లాకు కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ మల్నీడు కోటయ్య కమ్యూనిస్టుపార్టీ పిలుపు ననుసరించి ప్రజలు పోరాటాలు జరపాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

"నెహ్రూపై వక్తృత్వ పోటీలు

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, నవంబరు 14

నెహ్రూ 82 వ జన్మదినోత్సవ జయంతి సందర్భంగా గాంధీనగరంలోని శ్రీ శ్రీనివాస బాలవిద్యాలయంలో బాలదినోత్సవం జరిగింది.

ఈ సందర్భంగా బాల బాలికలకు 'చిట్టి బాలలు, చాచానెహ్రూ' అన్న అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు

పోటీలో 21 మంది బాల బాలికలు పాల్గొన్నారు. పోటీలకు శ్రీయుతులు రెంటాల గోపాలకృష్ణ డి. ఎస్. రామచంద్రమూర్తి, శ్రీమతి ఎస్. సీతారామమ్మ న్యాయనిర్ణేతలుగా పనిచేశారు

సాయంత్రం జరిగిన బహిరంగ సభకు విద్యాలయ కమిటీ అధ్యక్షులు శ్రీ కోట వీరభద్రరావు అధ్యక్షత వహించారు.

సభలో శ్రీయుతులు పి. వెంకట్రావు కిలారు శ్రీమన్నారాయణ, జ్యోతిరామమందిర ప్రిన్సిపాల్ శ్రీమతి ఎ. జయలక్ష్మి ప్రభృతులు నెహ్రూ జీవిత విశేషాలను తెలుపుతూ ప్రసంగించారు.

పోటీలలో ప్రథమ బహుమతి చిరంజీవి సి హెచ్. కాంత, ద్వితీయ బహుమతి చి॥ ఎస్. వెంకట్రావు తృతీయ బహుమతి చిరంజీవి జగన్‌నాథంకు లభించాయి. ప్రొఫెసర్ పి. వెంకటరావు బహుమతులు పంచిపెట్టారు.

విద్యాలయం కోశాధికారి శ్రీ బి యస్ రామశాస్త్రి ప్రసంగించిన పిదప, బాలబాలికల సాంస్కృతిక ప్రదర్శనతో సభ ముగిసింది.

కమ్యూనిస్టులపై కాంగ్రెసు కిరాయి గూండాల దాడి

నలగొండ తాలూకా గడంవారి ఎడవెల్లి గ్రామంలో

నల్లగొండ నవంబరు 16

నల్లగొండ తాలూకా గడంవారి ఎడవెల్లి గ్రామంలో గత కొద్దిమాసాలుగా కాంగ్రెసు మద్దతుతో గూండాల అరాచక చర్యలుదౌర్జన్యాలు అధికమౌతున్నాయి

ఈ గ్రామం కమ్యూనిస్టులకు బలమైన కేంద్రం. గ్రామంలో కమ్యూనిస్టుపార్టీ కున్న పలుకుబడిని నాశనం చేయాలనే దుర్బుద్ధితో పార్టీ కార్యకర్తల సానుభూతి పరులపై దాడి చేయటం, వారి ఆస్తులను నష్టపర్చటం చేస్తున్నారు. తమ చెప్పుచేతల్లో వుండే పోలీసు సబ్ ఇనస్పెక్టర్లను ఆసరా చేసుకొని యీ ఆగడాలు సాగిస్తున్నారు.

ఈ దౌర్జన్య ఘటనలపై ఎన్ని రిపోర్టులు పంపుకున్నా ఉండూరు పోలీసు సబ్ ఇనస్పెక్టరు ఎటువంటి చర్య తీసుకోలేదు. సబ్‌ఇనస్పెక్టర్ కాంగ్రెసు గూండాలకు పరోక్షంగా ప్రోత్సాహం యిస్తున్నారు

ఇప్పటికైనా జిల్లా పోలీసు అధికారులు జోక్యంచేసుకొని గ్రామంలో శాంతిభద్రతలు కాపాడవలసినదిగా తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ యం. పుల్లయ్య ఒక ప్రకటనలో కోరారు.

రాయచోటి సమితి బి. డి. ఓ. కు మెమొరాండం

రాయచోటి. నవంబరు 16

కడప జిల్లా రాయచోటి సమితి ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ (రిజిస్టర్డు) ఆధ్వర్యాన ఒక ప్రతినిధివర్గం బ్లాక్ డెవలెప్‌మెంటు ఆఫీసర్ను కలుసుకొని ఇటీవల మెమొరాండం సమర్పించింది.

ఈ ప్రతినిధివర్గానికి శ్రీ [illegible]శ్వరయ్య నాయకత్వం వహించారు. సమితిలో అపరిష్కృతంగావున్న సమస్యలు వెంటనే పరిష్కరించవలసినదిగా ఆ మెమొరాండంలో కోరారు.

ఘనపూర్ లో చౌకడిపోలులేక ప్రజల అవస్థలు

వరంగల్, నవంబర్ 15

కమ్యూనిస్టుపార్టీ తదితర వామపక్షాలు ఆందోళన చేసిన ఫలితంగా వరంగల్ జిల్లాలో కొన్ని గ్రామాలలో మాత్రమే చౌకడిపోలను ఏర్పాటు చేశారు. 5 వేల జనాభాగల ఘనపూర్ గ్రామంలో నేటివరకు ఒక చౌకడిపో కూడా తెరవలేదు

చౌక డిపోలు లేనందున పేద ప్రజలు ఆహార ధాన్యాలను బ్లాక్ మార్కెట్‌లో కొనలేక అవస్థలు పడుతున్నారు.

చౌక డిపోలను తెరిపించటానికి గ్రామ సర్పంచ్ శ్రద్ధ వహించటంలేదు

నీటి ఎద్దడి

ఘనపూర్ సమితిలోని 60 గ్రామాలకుగాను 40 గ్రామాలలో తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడింది, ఘనపూర్ గ్రామంలో నీటి ఎద్దడి మరీ తీవ్రంగా ఉంది.

చేసుకోడానికి పనిలేక, తిండిగింజలు కొనగల ఆర్థిక స్తోమతులేక పేదప్రజలు అల్లాడిపోతున్నారు. రోజుల తరబడి పస్తులుండలేక ప్రక్క ప్రాంతాలకు వలస పోవడానికి సిద్ధమవుతున్నారు.

ఆహారధాన్యం కొరతవల్ల, పశుగ్రాసం కొరతవల్ల రైతులు కూడా అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

కాబట్టి ప్రభుత్వం తక్షణమే కదిలి ఈ ప్రాంతంలో చౌక డిపోలను ఏర్పాటు చేయాలని, నీటికొరత సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మంత్రికి 13 గ్రామాల ప్రజల అర్జీలు

తాడిపత్రిలో

తాడిపత్రి, నవంబరు 15

ఆహార శాఖ మంత్రి శ్రీ తల్లా సుబ్బరాయుడు ఈ నెల 8 న అనంతపురం జిల్లా తాడిపత్రికి వచ్చిన సందర్భంలో 13 గ్రామాల నుండి 250 మంది ప్రజలు తరలి చౌకడిపోల కొరకు, ఇండ్ల స్థలాల కొరకు అర్జీలు యిచ్చారు.

కోనుప్పలపాడు హరిజనులు గత రెండు సంవత్సరాలుగా ఫారెస్టు బంజరుభూమిని సాగు చేసిన కృషిని, ప్రభుత్వం కేసులు పెట్టి శిక్షించటాన్ని మంత్రి దృష్టికి తెచ్చారు

పట్టణంలో ప్రస్తుతం చేస్తున్న పంపిణీ విధానంలో యిబ్బందులను తాలూకా కమ్యూనిస్టు సమితి మంత్రి దృష్టికి తెచ్చింది పట్టణంలో ప్రతివార్డుకొక చౌకడిపో పెట్టాలని, బియ్యం కిలో 85 పైసలకు అమ్మించాలని, జొన్నలు, రాగులు తదితర ముతక ధాన్యం రూపాయికి 2 కిలోలు యిప్పించాలని కోరారు. పట్టణంలో కార్డు పద్ధతి ప్రవేశ పెట్టాల్సిందిగా డిమాండ్ చేశారు.

కార్డు పద్ధతి పెట్టటానికి ప్రయత్నిస్తామని మంత్రి సమాధానం మిచ్చారు. ధాన్యం ఎంత వున్నదో విచారించి డిపోలకు ఎక్కువ ధాన్యం యివ్వటం జరుగుతుందని చెప్పారు. బియ్యం కి. 8. పైసలకు అమ్మించలేమని, అలాగే జొన్నలు, రాగులు నష్టం చేయలేమని చెప్పారు

ఈ రాయబార వర్గంలో జిల్లా కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ సి. వెంగమ నాయుడు తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ సి అశ్వర్థ నారాయణరెడ్డితో పాటు తాలూకా కమిటీ సభ్యులంతా పాల్గొన్నారు

తదనంతరం రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలలో ప్రజలుచేరి ప్రజా సంఘాలను బలపర్చటం చేసుకోవాలని. వాటిద్వారా పోరాటం నడపాల్సిన అవసరం ఎంతైనా వుందని శ్రీ వెంగమనాయుడు ఉద్బోధించారు.

మొవ్వ సమితిలో టీచర్ల అక్రమబదిలీలు

నిడుమోలు, నవంబరు 16

కృష్ణాజిల్లా మొవ్వ పంచాయతీ సమితి స్కూళ్ళ ఉపాధ్యాయులను యీ నెల మొదటివారంలో మూకుమ్మడిగా సంవత్సరం మధ్యలో బదిలీలు చేయటం జరిగింది.

ఈ విధంగా సంవత్సరం మధ్య బదిలీలు చేయుట వలన తమ చదువులకు తీవ్రమైన నష్టమని, యీ నెల 3 వ తేదీ నిడుమోలు అప్పర్ ప్రైమరీ స్కూలు విద్యార్థులు స్కూలుకు వెళ్ళకుండా సమ్మె చేశారు.

ఆ రోజు[illegible] టీచర్లు హాజరు వేశారు. సమితి అధ్యక్షులు నిర్లక్ష్యంగా చేసిన యీ బదిలీలను నిరసించుచూ పిల్లలు ఊరేగింపు జరిపారు, వెంటనే బదిలీలను ఆపుచేయవలసినదిగా కోరారు.

ఎంతమంది విజ్ఞప్తి చేసినా ఖాతరు చేయక సమితి అధ్యక్షులు యీ బదిలీలు చేశారు. ముఖ్యంగా యీ బదిలీలు రాజకీయ కక్షలతో చేసినట్లు కనబడుతున్నది.

కాన ప్రజాస్వామ్య వాదులందరూ యీ అక్రమ బదిలీలను నిలుపుదల చేయుటకు కృషి చేయవలసినదిగా ఉపాధ్యాయులు కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే కలుగజేసుకొని యీ అక్రమ బదిలీలను ఆపు చేయాల్సి వుంది.

మందులధరవరలలో సాగుతున్న మోసం

4వ పేజీ తరువాయి

ఖరీదులు తగ్గించారు ఇంజెక్షన్లకంటే సులువుగా బిళ్ళలు ఉపయోగపడటమే యిందుకు కారణం.

అభివృద్ధి ఖర్చులను తగ్గించారు. కొద్దిపాటి అడ్వర్టైజుమెంటు కొద్దిశాంపుల్సుతో ఉత్పత్తిదారుల లాభాలు కాపాడబడ్డాయి. అంతేకాదు. చిల్లర వ్యాపారస్తులు ధరలు తగ్గించబడిన మందుల కోటాలుతీసుకోడానికి గాను ధరలు హెచ్చించబడిన మందులను కూడా నిర్బంధంగా తీసుకోవలసివుంది

ప్రభుత్వ వాణిజ్య కార్పొరేషన్ ద్వారా 12 మందులను రసాయనాలను దిగుమతి చేసుకోవాలని 1970 ఏప్రిల్‌లో ప్రభుత్వం ఉత్తరువు చేసింది. దిగుమతి చేసుకొనబడిన మందుల ధరలు దేశీయ వస్తువులకంటే చౌక, కావున స్థానిక వస్తువులకు, దిగుమతి చేసుకొంటున్న వస్తువులకు కలిపి ఒకే ధరలు నిర్ణయించబడ్డాయి ఈవిధంగా ధరలు నిర్ణయించబడిన మందులలో అధిక భాగం ఇండియన్‌డ్రగ్స్‌ఫార్మస్యూటికల్స్‌లిమిటెడ్ ఉత్పత్తి చేస్తోంది. ఈ పద్ధతివల్ల మందుల ధరలు తగ్గేందుకు అవకాశంవున్నది. దీనిని వెదిచూడవలసివుంది.

ఒక పరిశీలక కమిటీని నియమించి, ఈ సమస్యపై సమగ్ర పరిశీలన జరపవలసిన ఆవశ్యకత ఎంతోవుంది. అంతే కాదు. మందుల ఉత్పత్తి మార్కెటింగు నిమిత్తం ప్రభుత్వరంగ సంస్థను నియమించడంద్వారా యీ సమస్య పరిష్కారానికి పూనుకోవాలి

రోచ్ కంపెనీకి చెందిన విటమిన్ 20 బిళ్ళల పాకెట్టు టోకు ధర కంట్రోలుకు పూర్వం రు. 2.09 లు వుండగా, చిల్లర ధర రు. 2.62 లు వుండేది. ధరలు తగ్గించిన తర్వాత 20 బిళ్ళల పాకెట్టు టోకు ధర రు. 2.00 లు, చిల్లర ధర రు 2.21 లు తగ్గించబడింది 500 బిళ్ళలపాకెట్టు టోకుధర రు. 34.40 వుండగా, చిల్లరధర రు 43 లు వుండేది. తగ్గింపుధర (టోకు) రు. 19.00లు కాగా చిల్లర ధర రు 21 85 లు వుంది ఫోర్టు 20 బిళ్ళలపాకెట్టు టోకుధర రు.4.10లు కాగా, చిల్లర ధర రు. 5.12 లు వుండేది. తర్వాత దాని టోకు ధర రు4.23కు పెంచి, చిల్లరధర మాత్రం రు. 4.67 కి తగ్గించారు. ఫోర్టు 1000బిళ్ళల పాకెట్టు టోకు ధర రు. 85.00 లు వుండగా చిల్లర ధర రు 107.00లు. ధరలు తగ్గిన తర్వాత టోకు ధర రు. 76.00 లకు చిల్లర ధర రు 83.91 లకు తగ్గించారు ఇంజెక్షన్ (50x) టోకు ధర రు. 28 80 లు, చిల్లర ధర రు. 36 00 లు వుండగా, ధరల తగ్గింపు తర్వాత వాటి టోకు ధర రు. 39.12 లకు పెంచి, చిల్లర ధర మాత్రం రు. 32.84 లకు తగ్గించారు సిరప్ (1/0) టోకు ధర రు.4.00లు చిల్లర ధర రు. 5.00 లు వుండగా, వాటి టోకు ధర రు 4.73 లకు చిల్లర ధర రు 5.21 లకు పెంచారు ఈ విధంగానే వివిధ కంపెనీలు తమ మందుల ధరలను తగ్గించటం, హెచ్చించటం జరిగింది

(న్యూఏజ్. అక్టోబరు 17)

పిడుగురాళ్ళలో ఈనెల 12న హర్తాళ్

అధిక ధరలకు నిరసనగా

పిడుగురాళ్ళ, నవంబరు 16

గుంటూరు జిల్లా పల్నాడు తాలూకా పిడుగురాళ్ళ గ్రామంలో అధిక ధరలకు నిరసనగా ఈనెల 12 వ తేదీ హర్తాళ్ జరిగింది. వివిధ పక్షాలు ఇచ్చిన పిలుపు ననుసరించి ఈ హర్తాళ్ జరిగింది.

రాత్రి బహిరంగసభ జరిగింది. శ్రీ నందిపాటి గురవారెడ్డి సభకు అధ్యక్షత వహించారు. ఈ సభలో తాలూకా కమ్యూనిస్టు పార్టీ నాయకులు శ్రీ షేక్ ఖాసింపీరా, శ్రీ వనమ పూర్ణచంద్రరావు శ్రీ ప్రసాదరావు (యువజనసంఘం) తదితరులు మాట్లాడారు.

హుజూర్‌నగర్‌లో 40 మంది రిమాండ్

ఆహారాందోళన సందర్భంగా

హుజూర్‌నగర్, నవంబరు 15

నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ తహసీల్దారు కార్యాలయంయందు ఈనెల 10 వ తేదీ పికెటింగు చేసిన వారిని పోలీసులు అరెస్టు చేసి కేసు పెట్టారు.

హుజూర్‌నగర్ మేజిస్ట్రేట్ వారికి 15 రోజులు రిమాండ్ ఇచ్చారు. రిమాండ్ యిచ్చిన 40 మందిని నల్గొండ జైలుకు పంపారు

ఆహార విధానంపై ఎన్. జి. వో నాయకుని విమర్శ

విజయవాడ, నవంబరు 16

రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న అవకతవకల వలన ఆహార ధాన్యాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని కృష్ణాజిల్లా ఎన్. జి ఓ నాయకుడు శ్రీ దాలిరాయుడు ఒక ప్రకటనలో విమర్శించారు.

కాన ప్రభుత్వం వెంటనే తీవ్ర పరిస్థితిని గురించి ప్రస్తుత విధానాన్ని మార్చుకొని గిడ్డంగులలోని బియ్యాన్ని విరివిగా చౌకడిపోలద్వారా తక్షణమే అమ్మించాలని ఆయన కోరారు.

నంద్యాలలో టీచర్సు గిల్డు సమావేశం

నంద్యాల, నవంబరు 16

ఆంధ్రప్రదేశ్ టీచర్సుయూనియన్ నంద్యాల పట్టణ గిల్డు సమావేశం యిటీవల జరిగింది శ్రీ పి. శ్రీరాములు అధ్యక్షత వహించారు. ఎ. పి. టి యు ఉపాధ్యక్షులు శ్రీ అబ్దుల్ సలాంఖాన్, జిల్లా టీచర్సు గిల్డు కార్యదర్శి శ్రీ రామిరెడ్డి సమావేశంలో ప్రసంగించారు. శ్రీ ఎస్. ఎ. అజీజ్ రిపోర్టు, జమ ఖర్చులు ప్రవేశ పెట్టారు. చర్చల అనంతరం యివి ఆమోదించబడినవి

శ్రీ యస్ గోపాలకృష్ణ అధ్యక్షులుగా, శ్రీ కె ఎం రూప్ ఉపాధ్యక్షులుగా, శ్రీ ఎస్. ఎ. అజీజ్ కార్యదర్శిగా, శ్రీ సుబ్బన్న జాయింట్ కార్యదర్శిగా ఎన్నికైనారు.

రాజస్థాన్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం

జైపూర్, నవంబరు 15

రాజస్థాన్ ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఈ రోజు శాసనసభ స్పీకర్ అనుమతించారు.

ఇండిపెండెంట్ సభ్యుడు శ్రీ మెహతా ప్రతిపాదించిన తీర్మానాన్ని స్వతంత్ర, జన సంఘ్ ఎస్ ఎస్.పి సభ్యులు బలపరచారు.

ముఖాముఖి

(4 వ పేజీ తరువాయి)

అది త్యాగంగా ప్రస్తుతించారు కాని నేటిసామాజిక నిజం ఇంకా ఏ స్వరూపంలో ఎంత కఠోరంగా వ్యక్తమవుతుందో చెప్పుమంటారా?

నిజాన్ని చాటడానికి. మామూలు త్యాగం కాదు. అనేకమంది నేడు ప్రాణత్యాగం చేస్తున్నారు. నిజం నిరూపించడానికి ప్రాణాలనే ధారపోస్తున్నారు కావంటారా?

అవి [illegible]చావులు: అవి అగ్రవర్ణాల అహంకారానికి గురైన చావులు: భూస్వాముల దౌర్జన్యాలకు, అక్రమాలకు బలియైన చావులు, కూలికోసం, గుడ్డకోసం సామాజిక న్యాయం కావాలని ఎలుగెత్తినందుకు దోపిడీవర్గాల కిరాయిగూండాల హంతకుల చేతుల్లో చావులు: ఇవన్నీ నిజాలు కావంటారా?

అందుచే నేటి సమాజంలో నిజమైన - నిజం - మాటలతోకాదు - ప్రాణాంతో - అమూల్య జీవిత త్యాగాలతోనే చాటిచెప్పడం జరుగుతుంది. కవీ! నీవు నిర్భీతిగా ఈ నిజాన్ని అంగీకరించి, ఆమోదించే త్యాగం మంత్రి వర్యులు ప్రదర్శిస్తారా? ముందు ఆ మాట చెప్పండి?

రేడియో

గురువారం నవంబరు 18

శక 1893 ॥ కార్తీక 27

విజయవాడ

357.1 మీ. [840 కిలోసై.]

ఉదయం : 6.00 వందేమాతరం, [illegible] ప్రసారవిశేషాలు: 6.10 భక్తిరంజని: నామావళి. 6.40 సూక్తి ముక్తావళి: 6.45 పొలంపనులు: 6.55 గోటు వాద్యం: 7.02 ఆం. వా: 7.04 కార్యక్రమ విశేషాలు 7.05 తె. వా. 7.15 సంగీత శిక్షణ - సీనియర్లకు: 7.30 సంస్కృతపాఠం: 7.45 శుద్ధ సంగీతము: 8.00 హిం. వా: 8.10 ఆం. వా: 8.20 క్లారినెట్: 9.00 హిం. వా: 9.02 ఆం. వా: 9.04 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం : 11.45 మాధ్యమిక పాఠశాలలకు: 12.05 చిత్ర తరంగిణి: 12.30 తె. వా: 12.40 కార్మికుల కార్యక్రమము: 1.10 పసిడి పంటలు: 1.20 క్లారినెట్: 1.30 చిత్ర తరంగిణి: 1.59 వాతావరణ సూచన: 2.00 ఆం. వా: 2.10 గాత్రం: 2.30 ప్రసార సమాప్తి.

సాయంత్రం : 5.30 హైదరాబాద్ వలె: 5.55 స్థానిక ప్రకటనలు: 6.00 ఆం. వా: 6.05 ప్రాం. వా: 6.15 గ్రామలక్ష్మి: 6.25 వ్యవసాయదారులకు: 6.30 నవరస - ఉర్దూ కార్యక్రమం: 6.45 చిత్ర తరంగిణి: 7.02 ఆం. వా: 7.04 కార్యక్రమ విశేషాలు: 7.05 తె. వా: 7.15 [illegible]: 7.45 యువభారతి: 8.45 హిం. వా: 9.00 ఆం. వా. 9.15 లలిత సంగీతం: 9.30 రసమంజరి 10.00 గాత్రం: 10.30 జన గణ మన - ప్రసార సమాప్తి.

హైదరాబాద్ - (ఎ)

405.4 మీ [740. కిలోసై]

ఉదయం : 6.00 వందేమాతరం, 6.02 ఆం. వా: 6.04 మంగళధ్వని, కార్యక్రమ వివరణ, 6.10 భక్తిరంజని: 6.40 సూక్తిముక్తావళి: 6.45 క్లారినెట్: 7.02 ఆం. వా: 7.04 కార్యక్రమ వివరణ 7.05 తె. వా: 7.15 సంగీత శిక్షణ: 7.30 సంస్కృత పాఠము: 7.45 లలిత సంగీతం: 8.00 హిం. వా: 8.10 ఆం. వా: 8.20 విజయవాడరిలే: 9.00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి

మధ్యాహ్నం : 11.45 మాధ్యమిక పాఠశాలలకు: 12.05 చిత్రగీతి: 12.20 హిందీ పాఠము: 12.30 తె. వా: 12.40 కార్మికుల కార్యక్రమము: 1.10 క్లారినెట్: 1.30 గాత్రం: 1.59 వాతావరణ సూచన: 2.00 ఆం. వా: 2.10 చిత్రగీతి: 2.30 సమాప్తి.

సాయంత్రం : 5.30 వయొలిన్: 5.55 ప్రసార విశేషాలు: 6.00 ఆం. వా: 6.05 ప్రాం. వా: 6.15 ఉ. వా: 6.25 వ్యవసాయదారులకు: 6.30 గ్రామలక్ష్మి: 7.00 అనగ - అనగ. కథలు: 7.05 తె. వా: 7.15 ఇల్లూ - వాకిలి: 7.30 మీరు కోరిన పాటలు: 8 00 విశ్వరచయితలు - పి.గో కవులు - ప్రసంగం: 8.15 లలితసంగీతం: 8. 0 కుటుంబ నియంత్రణా కార్యక్రమం: 8.45 జానపదగేయాలు 8.45 హిం. వా: 9.00 ఆం. వా: 9.15 ఆంగ్ల ప్రసంగం: 9.30 వి. రిలే: 10.00 క్లారినెట్: 10.30 వాతావరణ సూచన, జన గణ మన, ప్రసార సమాప్తి.

హైదరాబాద్ - (బి)

217.4 మీ. [1380 కిలో సై]

ఉదయం : 6.30 వందేమాతరం, 6.40 ఈశ్వర అల్లా తేరేనాం: 7.00 హిం. వా: 7.02 విరామ సంగీతం: 7.05 విద్యార్థులకు (ఉర్దూ): 7.30 నేటి కార్యక్రమం: 7.35 సుగమ సంగీత్: 7.50 ఉర్దూ కార్యక్రమం: 8.00 పాశ్చాత్య సంగీతం: 8.20 ఫిల్మిగానే: 8.50 ఉ. వా: 9.00 ఖయాల్: 9.30 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం : 2.00 వయొలిన్: 2.10 హిం.వా: 2.20 ఫిల్మిగానే: 2.30 ఉన్నత ప్రాథమిక పాఠశాలలకు (ఉర్దూ): 2.50 సుగమసంగీత్: 3.00 హిం. వా. 3.02 ప్రసార సమాప్తి.

విశాలాంధ్ర పాఠకులకు సదవకాశం

తగ్గింపు రేటు

30-11-1971 వరకు పొడిగించబడినది

సంవత్సర చందా ఒకేసారి చెల్లించువారికి

దినపత్రిక	తగ్గింపు రేటు	ప్రస్తుత రేటు
ఏజెంటుద్వారా	రు. 44-35	(55-44)
పోస్టుద్వారా	రు. 48-00	(60-00)
వారపత్రిక		
ఏజెంటుద్వారా పోస్టుద్వారా	రు. 9-60	రు. 12-00

పార్టీ శాఖలు, కార్మిక, రైతు, యువజన, మహిళా సంఘాలు, గ్రామ పర్యంచ్‌లు, అభిమానులు, ఈ సదవకాశాన్ని తప్పక వినియోగించుకో గోరుచున్నాం.

మేనేజరు 'విశాలాంధ్ర'

విజయవాడ-4.

విశాలాంధ్ర

1971 నవంబరు 17 బుధవారం

బంగ్లాదేశ్ గుర్తింపులో ఇక జాప్యం తగదు

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి తన విదేశ పర్యటనానుభవాలను ముందుగా పార్లమెంటు ప్రతిపక్ష నాయకుల సమావేశంలోను, తిరువాత పార్లమెంటులోను వివరించుతూ తాను పర్యటించిన దేశాలు బంగ్లాదేశ్ సంక్షోభ తీవ్రతను గుర్తించడంతోబాటు భారత్ భద్రతకు ఏర్పడ్డ ముప్పును కూడా అవగాహన చేసుకున్నాయని తెలియజేశారు. షేక్ ముజిబుర్ రహమాన్ నాయకత్వాన ఎన్నికైన ప్రతినిధులకు ఆమోదయోగ్యంగా బంగ్లాదేశ్ సమస్యను రాజకీయంగా పరిష్కరించవలసిన ఆవశ్యకతను కూడా ఈ దేశాలు గుర్తించాయని ప్రధాని అన్నారు.

బంగ్లాదేశ్ సమస్యపై అంతర్జాతీయ ప్రజాభిప్రాయాన్ని సమీకరించడంలో గత ఏడు నెలలుగా జరగవలసిన కృషి అంతా జరిగిన తరువాత బంగ్లాదేశ్ రాజకీయ పరిష్కారానికి ఇక చొరవ తీసుకోవలసింది భారతదేశమే తప్ప మరొకరెవరూ కాదు. బంగ్లాదేశ్‌ను భారత దేశం గుర్తించడమే బంగ్లాదేశ్ రాజకీయ పరిష్కార మార్గంలో తొలిమెట్టు. ఈ విషయాన్నే పార్లమెంటు ప్రతిపక్ష నాయకులు ఏకగ్రీవంగా ప్రధాని ముందు ప్రతిపాదించారు. బంగ్లాదేశ్‌ను వెంటనే గుర్తించి బంగ్లా ముక్తివాహినికి సత్వర సహాయం అందడానికి తగు పరిస్థితులు కల్పించాలని వారు సూచించారు. ఇక ఈ విషయం ఎంత మాత్రం జాగుచేయరాదని హెచ్చరించారు.

బంగ్లాదేశ్ గుర్తింపుకు నేడు జాతీయ అంతర్జాతీయ పరిస్థితులన్నీ పరిపక్వమైనవనడంలో ఎట్టి సందేహం లేదు.

సోషలిస్టు శిబిరం ఏనాడో బంగ్లాదేశ్ ప్రజల న్యాయమైన కోర్కెను గుర్తించింది. భారత దేశం బంగ్లాదేశ్‌ను గుర్తిస్తే ఆ సాకుతో పాకిస్తాన్ భారతదేశంపై సైనిక సంఘర్షణకు దిగే పక్షంలో తమ పూర్తి సహాయ సహకారాలుంటాయని సోవియట్ విస్పష్టంగా ప్రకటించింది. భారత-సోవియట్ ఒప్పందం భారత దేశానికి ఒక నమ్మకమైన హామీగా ఉండగలదని ఆచరణలో రుజువైంది.

బంగ్లాదేశ్‌ను భారత్ గుర్తించిన ఫలితంగా ఒకవేళ భారత్‌పై పాక్ సైనిక సంఘర్షణ ప్రారంభమైతే చైనా తన అంతరంగిక పరిస్థితుల దృష్ట్యా ప్రత్యక్షంగా యుద్ధరంగంలోకి దిగే విషయమే సందిగ్ధంలో పడింది.

బంగ్లాదేశ్ అసలు సమస్యను వక్రీకరించి ఇది భారత-పాక్ మధ్య సమస్యగా ఇన్నాళ్ళు చిత్రించి పశ్చిమదేశాల ప్రజాభిప్రాయాన్ని తప్పుదోవ పట్టించాలని పాకిస్తాన్ చేసిన ప్రయత్నం నెరవేరలేదు. నిక్సన్‌తో శ్రీమతి ఇందిరాగాంధి చర్చలు అమెరికా సామ్రాజ్యవాదుల దురాక్రమణ వ్యూహంలో మార్పు తెచ్చాయని ఎవరూ ఊహించ నక్కరలేదు. అమెరికా అనేక మార్గాల ద్వారా పాకిస్తాన్‌కు ఆయుధ సహాయం అందజేస్తూనే ఉంది. ఐనప్పటికీ ప్రపంచ ప్రజాభిప్రాయం బంగ్లాదేశ్‌కే అనుకూలంగానే ఉందితప్ప పాకిస్తాన్‌కు, అమెరికా సామ్రాజ్యవాదుల వైఖరికి అనుకూలంగా లేదు.

బంగ్లాదేశ్ గుర్తింపునకు అంతర్జాతీయంగా ఇంత అనుకూల పరిస్థితులేర్పడటంతోబాటు బంగ్లాదేశ్ విముక్తి సేనలు అనుకున్న దానికంటే ఉధృతంగా నేడు తమ పోరాటాన్ని సాగిస్తుండటంతో పాక్ నియంతల అంచనాలు తల్లక్రిందులవుతున్నాయి. తూర్పు బెంగాల్ ప్రజలు కూడా ఈ ప్రతిఘటనోద్యమానికి సర్వసన్నద్ధమవుతున్నారు. అందుచేత బంగ్లాదేశ్ అంతర్గత పరిస్థితులు కూడా బంగ్లాదేశ్ గుర్తింపునకు మునుపెన్నడూ లేనంత అనుకూలంగా మారాయి.

బంగ్లాదేశ్ విముక్తి పోరాటానికి అవసరమైన సహాయం అంతా అందించవలసిన సమయం ఆసన్నమైనప్పుడు అట్టి సహాయం అందే పరిస్థితులు కల్పించకపోతే ఆ పోరాటానికి తీరని అపకారం చేయడమే కాగలదు.

బంగ్లాదేశ్ ప్రభుత్వానికి, భారత ప్రభుత్వానికి మధ్య దౌత్యపరమైన సంబంధాలు ఏర్పడినప్పుడే అట్టి సహాయం అందించడానికి మార్గం ఏర్పడుతుంది. తనకు కావలసిన సహాయం అంతా బంగ్లాదేశ్ ప్రభుత్వం భారతదేశాన్నే కాక ఇతర దేశాలను కూడా అడగడానికి వీలవుతుంది.

బంగ్లాదేశ్‌ను గుర్తించినందువల్ల భారత్‌పై పాక్ యుద్ధం దగ్గరపడితే ఈ దురాక్రమణను తిప్పికొట్టడానికి భారత రక్షణ బలగాలు భారత ప్రజలందరూ సర్వసన్నద్ధంగా వున్నారు. బంగ్లాదేశ్‌ను గుర్తించడానికి అవసరమైన రక్షణ సన్నాహాలన్నీ చేయడంతోబాటు దేశంలోని గుత్తపెట్టుబడిదారులు, అధిక లాభార్జనపరులు, చట్టా వ్యాపారులు, భూస్వాములు నిరంకుశోద్యోగులు తమ స్వార్థ ప్రయోజనాలకు దేశ అత్యవసర పరిస్థితులను వినియోగించుకోకుండా తగు చర్యలు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితుల పేరుతో సామాజిక ఆర్థిక సంస్కరణలను వాయిదా వేయాలని కార్మికులపై అదనపు భారాలు మోపాలనీ వీరు చేసే ప్రయత్నాలను వమ్ముచేయాలి.

బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని గుర్తించి, ఆ ప్రభుత్వంతో రక్షణ ఒడంబడిక చేసుకోవడమే భారత ప్రభుత్వ తక్షణ కర్తవ్యం. ఆలస్యం అమృతం విషం!

మందుల ధరవరలలో కొనసాగుతున్న మోసాలు

[మందుల ధరల తగ్గింపుకై మందకొడిగా నైనప్పటికీ కేంద్ర ప్రభుత్వం కృషి ప్రారంభించినదిలగాయతు యిప్పటి వరకు ఉత్పత్తిదారులు మందుల ధరలను మూడు దఫాలుగా పెంచివేశారు. కొన్ని మందులు బ్లాక్ మార్కెట్ లోకి పోయాయి.

విదేశీ పరిశ్రమల పెత్తనంక్రిందవున్న భారీ పరిశ్రమలదే యిందుకు ప్రధాన బాధ్యత. మందుల పరిశ్రమలో పెద్ద యెత్తున జరుగుతున్న యీ మోసాలను బహిర్గతం చేసే ఉద్దేశంతోనే యీ వ్యాసాన్ని ప్రచురిస్తున్నాం. సం.]

ప్రాణ రక్షణకు వినియోగపడే అనేక రకాల మందులు మార్కెటు నుండి అదృశ్యమై పోయాయి. వాటిలో కొన్ని మాత్రం బ్లాక్ మార్కెటు ధరలకు లభ్యమౌతున్నాయి. పర్యవసానంగా సామాన్య పౌరుని మందుల బడ్జెట్ విపరీతంగా పెరిగిపోయింది.

మందుల ధరల తగ్గింపుకై ప్రభుత్వం ప్రారంభించిన కృషిలో భాగంగా 1970 మే నెల నుండి అనేక అధికార ప్రకటనలు, ఉత్తరువులు జారీ చేయబడ్డాయి. పర్యవసానంగా వినియోగదారులకు అత్యవసర మందులు లభించకుండా పోయాయి. అంతేకాదు, తమ వ్యాపారం సగానికి తగిపోయిందని మందుల షాపుల యజమానులు ఫిర్యాదు చేస్తున్నారు. కొన్ని మందుల ధరలుకూడా బాగా పెరిగిపోయాయి.

—అమెరికాలోని శక్తివంతమైన మందుల ఉత్పత్తి కంపెనీలు తప్పుడు పద్ధతులు అవలంబించింది. పేటెంటు చట్టాలను వినియోగించుకుని, బీద దేశాలను ఏ విధంగా దోపిడీ చేస్తున్నదీ అమెరికాలోని కెఫావర్ కమిటీ తన నివేదికలో ప్రకటించిన అంశాలను జనరల్ ఎస్. ఎస్. సోఖే కొన్ని సంవత్సరాల క్రితమే రాసిన కొన్ని వ్యాసాలలో బట్టబయలు చేశారు. ఏ యితర దేశంలో కంటే భారతదేశంలో మందుల ధరలు చాల ఎక్కువగా వున్నాయనికూడా ఆ నివేదికలో తెలియజేయబడింది.

విదేశీ గుత్తపెట్టుబడిసంస్థల పెత్తనం

భారత మందుల పరిశ్రమపై విదేశీ గుత్త పరిశ్రమల పెత్తనం విపరీతంగావుంది. దేశంలోని 97 భారీ, మధ్యరకం మందుల పరిశ్రమలలో 42 పరిశ్రమలపైన, 2300 చిన్న తరహా యూనిట్లలో 22 పరిశ్రమలపైన విదేశీ పెత్తనం, పర్యవేక్షణ కొనసాగుతోంది. పైన పేర్కొన్న పరిశ్రమలు మనదేశ మందుల పరిశ్రమలో కీలక స్థానం ఆక్రమిస్తున్నాయి. ఎందుచేత నంటే దేశంలో కొనసాగుతున్న మందుల వ్యాపారంలో 70 శాతం వ్యాపారాన్ని ఆ పరిశ్రమలే నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ రంగంలోని భారత మందుల పరిశ్రమలలో మందుల ఉత్పత్తి యింకా తక్కువ స్థాయిలో నామ మాత్రంగానే వుంది.

అంతేకాదు. విపరీతమైన మందుల ధరలతో పేద ప్రజానీకాన్ని విచ్చలవిడిగా దోపిడీ చేసేందుకు మన దేశంలోని పేటెంటు చట్టాలు అనుమతిస్తున్నాయి. ఒకే మందును వివిధ కంపెనీలు తమ స్వంత పేరుతో అమ్మవచ్చును. రెండు అంతకు మించిన మిశ్రమ మందులను పేటెంటు మందులుగా రిజిష్టరు చేయించుకొని, కొన్ని మిశ్రమాలను అవసరంగా చేర్చి, కొన్నింటిని తొలగించి, వేరు పేర్లతో అమ్మవచ్చును. ఆయా కంపెనీలకు గల పేరు ప్రఖ్యాతులు, వాటిని అమ్ముకొనేదానికి ఆయా కంపెనీలకు గల శక్తిని బట్టి, ఆయా మందుల ధరలు స్వభావ సిద్ధంగానే మారుతుంటాయి.

విదేశీ పెత్తనం క్రింద గల భారీపరిశ్రమలు ఉత్పత్తి చేసిన మందులకు విపరీతమైన ధరలు వసూలుచేస్తారు. తరవాతనే మధ్యతరహా, చిన్నరకం పరిశ్రమల ఉత్పత్తుల ధరలు వుంటాయి. చిన్నతరహా పరిశ్రమల ఉత్పత్తుల ధరలు తక్కువగానే వుంటాయి.

మందకొడి కృషి

గత పది సంవత్సరాలుగా, మందుల ధరలపై కంట్రోల్సు విధించేందుకు జరిగిన యత్నం చాలా మందకొడిగానే జరిగింది.

1962 లో జారీచేసిన ఉత్తరువు మేరకు మందుల షాపులలో ధరల జాబితాలు కట్టారు. 1963 ఏప్రిల్ 1వ తేదీనుండి ధరలను స్థిరీకరిస్తూ ఉత్తరువు జారీచేయబడింది. 1964 లో మందుల ధరల జాబితా ప్రకటన, ధరల కంట్రోలు ఉత్తరువు జారీచేయబడింది. తర్వాత ప్రభుత్వ అనుమతితోనే మందుల ధరలు పెరిగిపోయాయి. అదే సందర్భంగా 18 అత్యవసర మందుల ధరల విషయం టారిఫ్ కమిషన్‌కు నివేదించబడింది. 1966 ఉత్తరువుకు 1968 లో తిరిగి సవరణ ప్రకటించబడింది. ఈ సవరణ ఉత్తరువు మేరకు, కొత్తగా పరిశోధనలు జరిపి ఉత్పత్తిచేసిన పేటెంటు మందులకు, మందుల ధరల కంట్రోలు వుండదనే మినహాయింపు యివ్వబడింది. తిరిగి 1970 మే లో మందుల ధరల కంట్రోలు ఉత్తరువు ప్రకటించి, 22 అత్యవసర మందుల ధరలపై కంట్రోలు విధించారు. కాని మొత్తంపైన మందుల ధరలు పెరిగిపోయాయి.

1970 మే లోపు ప్రకటించిన కంట్రోలు ఉత్తరువు 1970 ఆగస్టులో సవరణ ఉత్తరువు ప్రకటించారు. ఈ ఉత్తరువు ద్వారా మే ధరల స్థాయికి ధరలను స్థిరీకరించారు.

1970 మే ఉత్తరువుకు కొత్త సవరణ ప్రకటించారు. ఈ సవరణమేరకు ధరల హెచ్చింపుకు, కొత్త మందులు మార్కెట్‌లో ప్రవేశపెట్టేందుకు, కొత్త రకాలు మార్కెటులో ప్రవేశపెట్టేందుకు ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవలసివుంది. చిల్లర వ్యాపారస్తుల కమిషన్ 10 నుండి 14 శాతం వరకు నిర్ణయించబడింది. ధరపట్టీలను షాపులలో పెట్టేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు.

మార్కెట్‌నుండి మందులమాయం

1963-61లో ఉత్తరువులు జారీచేసిన వెంటనే మార్కెటు నుండి మందులు మాయమై పోయాయి. బ్లాక్ మార్కెట్ ధరలకు ఎటువంటి మందులు కొనుక్కోవలసి వచ్చింది. ముడిసరుకుల ధరలు పెరిగి పోతున్న దృష్ట్యా మందుల పరిశ్రమ అభ్యర్థన మేరకు మందుల ధరలు పెంచడానికి ప్రభుత్వం అనుమతించింది. ఫార్మకోపియా మందులు, పరిశోధనలు జరిపి కొత్తగా ఉత్పత్తి చేసే మందులు విషయంలో మినహాయింపులు యివ్వబడ్డాయి. ధరల హెచ్చింపును అనుమతించినా విదేశీ పెత్తనం క్రింద, విదేశీయాజమాన్యం క్రిందగల కొన్ని కంపెనీలు మందుల పెరుగుదలను సవరించిన అభ్యంతరాలను ప్రకటించి, 1963 స్థాయికి ధరలను స్థిరీకరించేందుకు అంగీకరించాయి. 1967-69 సంవత్సరాల్లో ధరల పెంపకానికి అనుమతించవలసిందిగా 520 దరఖాస్తులు రాగా, ప్రభుత్వం అనుమతించింది.

ప్రభుత్వ అనుమతితో ధరల హెచ్చింపు

ఆ విధంగా దరఖాస్తు పెట్టిన 124 కంపెనీలకు 10 శాతం లోపుగాను, 105 కంపెనీలకు 10 నుండి 19 శాతం వరకు, 107 కంపెనీలకు 20 నుండి 29 శాతం వరకు, 41 కంపెనీలకు 30 నుండి 39 శాతం వరకు, 44 కంపెనీలకు 40 శాతం, అంతకంటె ఎక్కువగాను ధరలు హెచ్చించేందుకు అనుమతించడమైంది.

1970 లో టారిఫ్ కమిషన్ నివేదిక ప్రాతిపదికపై, పెద్ద యెత్తున ఉత్పత్తి చేయబడే అత్యవసర మందుల ధరలను తగ్గించవలసిందిగా ప్రభుత్వం ఉత్తరువు చేసింది. కాని పెద్ద యెత్తున ఉత్పత్తి చేయబడే యితర మందుల ధరలు, మార్కెటు రేట్ల మేరకు స్థిరీకరించబడ్డాయి; దీనితో అన్ని మందుల ధరలు పెరిగిపోయాయి. మందుల ధరల తగ్గింపుకు, కంట్రోలు విధింపుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించినది మొదలు యిప్పటివరకు మూడుసార్లు మందులధరలు పెంచివేయబడ్డాయి.

పరిస్థితిని అదుపులో పెట్టడంలో విఫలమైన ప్రభుత్వం చర్చల నిమిత్తం 76 ప్రధాన మందుల ఉత్పత్తిదార్లను, 43 చిన్నతరహా పరిశ్రమలను ఆహ్వానించడం, వారు 1970 ఆగస్టు-సెప్టెంబరు నెలలో వున్న నిర్ణయించబడిన ధరల జాబితాలను ప్రభుత్వానికి అందజేయడం జరిగింది. 1971 జనవరిలో ప్రభుత్వం జారీచేసిన ఉత్తరువు ద్వారా ఆ ధరలనే అమలు జరపడం జరిగింది. ప్రభుత్వం జారీచేసిన యీ ప్రకటన ద్వారా ధరలు తగ్గాయనీ సుమారు రు. 223 కోట్ల వ్యాపారంలో ప్రజలకు రు. 10 కోట్లు లభిస్తాయనీ ప్రభుత్వ ప్రతినిధి అప్పుడు ప్రకటించారు. ప్రధానమైన మందులధరలతగ్గింపు 3శాతం నుండి 82 శాతం వరకు వుంది. కాని యితర మందుల ధరలను విపరీతంగా పెంచివేయడంతో పైన పేర్కొన్న ధరల తగ్గింపువలన ప్రయోజనం లేకుండానే పోయింది.

విదేశీ సంస్థలతో సంబంధాలు కల మందుల కంపెనీలు ప్రకటించిన ధరల తగ్గింపులోని రహస్యం యీ క్రింది అంశాలను పరిశీలిస్తే విశదం అవుతుంది. ఆ కంపెనీలు ప్రభుత్వ ఉత్తరువులో అనుమతించిన మేరకు, చిల్లర వ్యాపారస్తుల కమిషన్‌ను కనీస స్థాయికి తగ్గించివేశాయి. దీనితో చిల్లర వ్యాపారస్తులు తమ లాభాలను ఇతర రూపాలలో ప్రజలనుండే రాబట్టుకోసాగారు. ఢిల్లీలోని కెమిస్టులు రాత్రి షాపులను మూసివేశారు. మందుల చిల్లరధరలు యథాతథంగానే వున్నా, టోకు ధరలు పెంచివేశారు. దీనివల్ల మందుల ఉత్పత్తిదారుల లాభాలు పెరిగిపోయాయి. ప్రత్యేకించి ఆసుపత్రులలో జరిపే అన్నిరకాల మందుల అమ్మకాలద్వారా ఉత్పత్తిదారులకు 20 శాతం వరకు లాభిస్తుంది.

కొత్త పాకెట్లు పద్ధతిని ప్రవేశపెట్టారు. చిన్నరకం పాకెట్లకు ప్రాధాన్యత యిచ్చిన దృష్ట్యా, ధరలతగ్గింపు నామ మాత్రంగా వుంటుంది. కొత్తపాకెట్లలో మందుల ఖరీదు మరింతగా పెంచివేశారు.

ధరల తగ్గింపులో గుట్టు

అంతేకాదు, పెద్ద స్థాయిలో త్వరగా అమ్ముడుపోయే, ఎక్కువ వ్యాపారం కల మందుల ధరలను హెచ్చించింది, తక్కువగా అమ్ముడుపోయే మందుల ధరలను తగ్గించారు.

బిళ్ళల రూపంలో వుండే కొన్ని మందుల ధరలు హెచ్చించి, ఇంజక్షన్ల రూపంలో వున్న అవే మందుల

(మిగతా 3 వ పేజీలో)

సోవియట్ ప్రతినిధులకు పౌర సన్మానం

—గుంటూరులో

(విశాలాంధ్ర విలేకరి)

గుంటూరు, నవంబరు 13

సోవియట్ ప్రతినిధులు మేడం వొరొనినా, యరుషెవిచస్ ఆగస్టు 9న భారత్ - సోవియట్ ప్రభుత్వాల మధ్య జరిగిన శాంతి, స్నేహ, సహకార ఒడంబడిక ప్రాధాన్యతను వివరించుటకు ఈనెల 13వ తేదీన గుంటూరు వచ్చిన సందర్భంగా ప్రజలు ఘనస్వాగత మిచ్చారు. గుంటూరు మునిసిపల్ కౌన్సిల్ సోవియట్ ప్రతినిధుల గౌరవార్థం పౌర సన్మానం జరిపింది.

సోవియట్ ప్రతినిధులు మాస్కో డిప్యూటీ మేయరు వొరొనినా, సుప్రీం సోవియట్ సభ్యులు శ్రీ యస్. యరుషెవిచస్ గౌరవార్థం 13వ తేదీ సాయంత్రం 6½ గంటలకు గుంటూరు మునిసిపల్ కౌన్సిల్ హాలులో పౌర సన్మానం జరిగింది.

మునిసిపల్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ శ్రీ బండా కోటేశ్వరరావు సోవియట్ ప్రతినిధులకు పూల మాలలు వేసి వేదిక పైకి ఆహ్వానించారు.

బండా కోటేశ్వరరావు గుంటూరు మునిసిపల్ కౌన్సిల్ సభ్యుల తరపున సన్మాన పత్రం చదువుతూ పన్నుల నిరాకరణోద్యమం, సామూహిక సత్యాగ్రహాలు, కార్మిక కర్షక పోరాటాలకు నిలయమైన గుంటూరు నగరం సోవియట్ ప్రతినిధులను సన్మానం చేయడం గౌరవంగా భావిస్తున్నదని, సామ్యవాద వ్యవస్థా నిర్మాణంలో సోవియట్ ప్రజల అనుభవాలు భారతదేశానికి గుణపాఠాలుగా, ఆదర్శాలుగా నిలుస్తాయని అన్నారు.

వొరొనినా ప్రసంగం

సోవియట్ ప్రతినిధివర్గ నాయకురాలు వొరొనినా కృతజ్ఞతలు తెలియచేస్తూ భారత్ - సోవియట్ ప్రభుత్వాల మధ్య జరిగిన శాంతి, స్నేహ, సహకార ఒడంబడిక ఉభయ దేశాల చరిత్రలో మహత్తర సంఘటన అని, ఈ ఒడంబడిక ప్రపంచ శాంతి స్థాపనకు జరిగిన ఒడంబడికే కాని, ఏ దేశానికీ వ్యతిరేకంగా జరిగినదికాదని ఉద్ఘాటించారు.

జాతీయోద్యమ పోరాట చరిత్రలో పేరెన్నికగన్న గుంటూరునగరం తమను సన్మానించడం మహత్తర గౌరవంగా భావిస్తున్నామని కృతజ్ఞత తెలిపారు.

భారత జాతీయోద్యమంలో మహత్తర త్యాగాలు చేసి పోరాడిన భారత ప్రజలపట్ల సోవియట్ ప్రజలకు, ప్రభుత్వానికి అపారమైన గౌరవం వున్నదని అన్నారు.

రెండు దేశాల మధ్య జరిగిన ఒప్పందం భారత్-సోవియట్ దేశాల మైత్రిని మరింత దృఢతర మొనర్చుతుందని, పారిశ్రామిక, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో మరింత సహాయ సహకారాలు పెంపొందుతాయని తెలియజేసి, గౌరవ సూచకంగా మాస్కో మహా నగర చరిత్రను బహూకరించారు.

వొరొనినా ప్రసంగాన్ని ఢిల్లీలోని సోవియట్ దౌత్య కార్యాలయ సాంస్కృతిక విభాగ ఉద్యోగిని యుర్కోవా ఇంగ్లీషులోనికి అనువదించారు.

మద్రాసులోని సోవియట్ దౌత్య కార్యాలయంలో సాంస్కృతిక విభాగప్రధానాధికారి యద్దినోవస్కీ కూడ సమావేశానికి విచ్చేశారు.

కౌన్సిల్ సభ్యులు శ్రీ కనక్తాయల అంకమ్మ నాయుడు వందన సమర్పణ చేశారు.

స్త్రీల పాలిటెక్నిక్ సందర్శన

అంతకుముందు సోవియట్ ప్రతినిధివర్గ నాయకురాలు వొరొనినా, యుర్కోవా, యార్దినోవస్కీ ప్రభుత్వ స్త్రీల పాలిటెక్నిక్‌ను సందర్శించారు.

సోవియట్ ప్రతినిధుల గౌరవార్థం కళాశాల నిర్వాహకులు, విద్యార్థులు సంయుక్తంగా జరిపిన సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి వి. కమలాదేవి అధ్యక్షత వహించారు.

కళాశాల విద్యార్థినుల వందేమాతరం, మహామైత్రి, మహామైత్రి అను గేయాలతో కార్యక్రమం ప్రారంభమయింది.

కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి కమలాదేవి, శ్రీ కృష్ణారెడ్డి భారతదేశానికి సోవియట్ ప్రభుత్వం అందించిన సహాయ సహకారాలను వివరించారు.

వొరొనినా ప్రసంగిస్తూ 1917 విప్లవానంతరం సోవియట్ యూనియన్ ప్రభుత్వం పురుషులతో పాటు స్త్రీలకు సమాన హక్కు [illegible], సోవియట్ ప్రభుత్వంలో పురుషులతో పాటు స్త్రీలు కూడా అన్ని రంగాలలో సమానంగా వున్నారని తెలియ చేశారు. భారత స్త్రీలు కూడా ఆ విధంగానే అభివృద్ధి చెందాలని తెలిపారు.

తర్వాత యుర్కోవా ప్రసంగించారు.

ఆర్. టి. సి. డ్రైవర్-కండక్టర్‌పై మైలారం వద్ద గూండాల దాడి

వరంగల్, నవంబరు 16

భద్రాచలం నుండి హనుమకొండకు వచ్చే ఏ.పి.జెడ్. 1089 బస్సును గతనెల 19వ తేదీ మైలారం స్టేజివద్ద కొందరు గూండాలు ఆపి కండక్టరును, డ్రైవర్ను తీవ్రంగా కొట్టారు. అంతకుముందు రాత్రి ఒక ఎద్దుకు ప్రమాదం జరిగిందనే నెపంతో యీ దుర్మార్గానికి పాల్పడ్డారు.

వీరిని కొట్టడమేకాక రు. 200 వసూలు చేయడానికి ప్రయత్నించి వారి చేతులకు వున్న గడియారాలను తీసుకొని ఒక చీకటి గదిలో బంధించారు.

ఈ విషయం ఎరిగిన హనుమకొండ డిపో యస్. టి. బి. స్థానిక కార్మిక నాయకులతో కలసి మైలారంవెళ్ళి విచారించగా అసలు అక్కడ ప్రమాదమే జరుగలేదని తేలింది. ఎద్దు సురక్షితంగానే వుంది. ఈ విషయం వర్ధన్నపేట పోలీసుస్టేషన్‌కు రిపోర్టు చేయబడింది.

కాని ఆ గూండాలపై పోలీసులు చర్య తీసుకొనేందుకు సుముఖంగా కన్పించలేదు.

దుర్మార్గానికి పాల్పడిన గూండాల పేర్లు తెలిసినా స్థానిక కాంగ్రెసు నాయకులతో చేతులు కలిపి కేసు లేకుండా గడియారాలు తీసుకొమ్మని కార్మికనాయకులను పోలీసులు కోరారు.

ఈ విషయంలో జిల్లాపోలీసు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆర్. టి. సి. కార్మికులు కోరుతున్నారు.

తిరుపతి శానిటరీ సిబ్బందికి సబ్బులు నూనె యివ్వనిస్థితి

తిరుపతి, నవంబరు 16

శానిటరీ సిబ్బందికి గత ఆరు నెలలుగా సబ్బులు, కొబ్బరినూనె యివ్వడంలేదు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని తిరుపతి మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు విమర్శించారు. ఆరు నెలలకు ఒక్కసారిగా యిచ్చేటట్లు రు.48,000 మంజూరుచేస్తూ కౌన్సిలు తీర్మానించింది.

ఈ సమావేశం యిటీవల వైస్ ఛైర్మన్ శ్రీ కె. వెంకట సుబ్బశెట్టి అధ్యక్షతన జరిగింది.

శానిటరీ సిబ్బందికి సబ్బులు, నూనె ఇవ్వడంలో ఆలస్యం జరిగినందుకు ఆఫీసు ఉద్యోగుల మతిమరుపు కారణమని పురపాలక సంఘ కార్యదర్శి జవాబు చెప్పారు.

నల్గొండ జైలులో దుర్భర పరిస్థితి

నల్లగొండ, నవంబరు 14

నల్లగొండలో 200 మంది ఖైదీలకు వీలుగా హెడ్‌క్వార్టర్సు జైలు వుంది. 3 మాసాల క్రితం యీ జైలుకు క్రొత్తగా సూపరింటెండెంటు వచ్చారు. ఆయన రాగానే నిబంధనలు మార్చివేసి అనేకమైన నూతన పద్ధతులు ప్రవేశపెట్టి ఖైదీలను రకరకాలుగా బాధిస్తున్నారు.

ఉదయం లేవగానే తోటలో గల మోట బావి నుండి నీరు తోడటకు పశువులకు బదులు, ఖైదీలను వినియోగిస్తున్నారు. ఆ బావికి ఆయిల్ ఇంజన్‌వుంది, కాని ఆయిల్ లేదనో, లేదా కండీషన్లో లేదనో చెప్పి ఖైదీలచేత మోటలాగిస్తున్నారు.

తోటలో పశువులను ఉపయోగించి చేయించే పనులన్నీ ఖైదీలచేత చేయిస్తున్నారు. ఆరోగ్యం బాగ లేకున్నా పని తప్పడంలేదు. జైలులో వైద్య సదుపాయాలు బొత్తిగా లేవు. నామమాత్రంగా ఒక కాంపౌండరు వున్నా మందులు ఏవీలేవు.

ఆరోగ్యం బాగలేని ఖైదీలకు పాలు, రొట్టె యివ్వకుండా అక్కడ పురుగులతోవున్న పనికిమాలిన బియ్యంతో వండిన అన్నం పెడుతున్నారు.

200 మంది ఖైదీలకు ఒకే నీళ్ళ పంపు వుంది. ఈ జైలులోని ఖైదీల పరిస్థితి దారుణంగా వుంది. కనుక పై అధికారులు వెంటనే కలుగజేసుకొని తమ పరిస్థితులు మెరుగుపర్చాలని ఖైదీలు కోరుతున్నారు.

పొన్నూరువద్ద లారీ ప్రమాదంలో ఒకరి మృతి

నిడుబ్రోలు, నవంబరు 16

గుంటూరు జిల్లా పొన్నూరుకు మూడు మైళ్ళదూరంలో ఒక లారీప్రమాదంజరిగింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. మరొక వ్యక్తి గాయపడ్డాడు. గాయపడ్డ వ్యక్తిని గుంటూరు ఆసుపత్రికి తరలించారు.

భువనగిరిలో పేద విద్యార్థుల ఇక్కట్లు

భువనగిరి, నవంబరు 16

భువనగిరి జూనియర్ కాలేజిలో ప్రతి విద్యార్థి నుండి రు. 60 వసూలు చేస్తున్నారు. రు. 60 చెల్లించ గలిగిన వారికే కాలేజీలో ప్రవేశం లభిస్తూ వుంది.

ఈ విధంగా దాదాపు రు. 12,000 వసూలు చేశారు. డబ్బు కట్టలేని విద్యార్థులు కాలేజీలో చేరలేకున్నారు. కాన ప్రభుత్వం వెంటనే యీ విషయంలో తగు చర్య తీసుకొని పేద విద్యార్థులకు కాలేజీలో ప్రవేశం లభించే లాగు చూడాల్సి వుంది.

ముఖ్యమంత్రికి చెరకు ఉత్పత్తిదార్ల విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబరు 15

1970-72 సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరకు చెరకు సరఫరా చేయడంవల్ల తమకు గిట్టుబాటు కాదని నేడిక్కడ ముఖ్యమంత్రి శ్రీ నరసింహారావును కలుసుకున్న రాష్ట్ర చెరకు ఉత్పత్తిదార్ల ప్రతినిధి వర్గం తెలిపింది.

చెరకు ధర టన్నుకు రు. 100 నిర్ణయిస్తూ ఉత్తర్వు చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై వారొక మెమోరాండం సమర్పించారు. తణుకులోని సహకార చక్కెర ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకోవాలని వారు కోరారు. యాజమాన్యంలో అవకతవకల వల్ల రెండు సంవత్సరాల క్రితం ఆ ఫ్యాక్టరీ మూత పడింది.

వివిధ ఫాక్టరీల మేనేజిమెంట్లు రైతులకు బకాయిలు చెల్లించే విధంగా చూడాలని వారు అన్నారు.

టన్నుకు రు. 90కి తక్కువకాకుండా రేటు నిర్ణయించ గలనని ఆ ప్రతినిధి వర్గానికి ముఖ్యమంత్రి చెప్పారు. ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన వెంటనే ఈ విషయమై ఫ్యాక్టరీ మేనేజిమెంట్లతో సంప్రదింపులు జరుపుతానని అన్నారు.

ముఖాముఖి...

నిజాన్ని నిర్భయంగా చెబితే మంత్రివర్యులు అంగీకరిస్తారా?

నిజాన్ని నిర్భయంగా చెప్పడమే త్యాగమని, సమాజంలో ఉన్న చెడుగును తొలగించి, నిజాన్ని ధైర్యంగా చెప్పగల్గి సమాజ వికాసానికి తోడ్పడాలని ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ పౌర సంబంధాల మంత్రి శ్రీ అక్కిరాజు వాసుదేవరావుగారు ఇటీవల రాజమండ్రిలో ఆంధ్రకేసరి జయంత్యుత్సవ సభలో అన్నారు.

యువకులు సేవా కార్యక్రమాలతోబాటు నిజాన్ని ధైర్యంగా చెప్పగల్గే సంస్కృతి అలవర్చుకోవాలని. పత్రికలు నిర్భయంగా, నిష్పక్షపాతంగా నిజాన్ని బైటపెట్టే బాధ్యతాయుతంగా తమ విధి నిర్వహిస్తూ ప్రజాసేవ చేయాలనీ శ్రీ వాసుదేవరావు హితవు చెప్పారు.

నిజాన్ని నిర్భయంగా బైట పెట్టడంలో ముందడుగు వేయమని యువకులకు, పత్రికలకు ప్రోత్సాహం, ప్రోద్బలం, భరోసా యిచ్చి దానిని ఒక "త్యాగం"గా పేర్కొన్న, అభివర్ణించిన శ్రీ వాసుదేవరావుగారిని అభినందిస్తూనే వారిని ముఖాముఖిగా ఒక విషయం అడుగదలచుకున్నాం.

నిజాన్ని నిర్భయంగా చెప్పడం మాత్రమే త్యాగమా? నిజాన్ని నిర్భయంగా ఆమోదించడం స్వీకరించడం కూడా త్యాగం కాదా?

అందులోనూ, ప్రజలు, పత్రికలు నిజాన్ని నిర్భయంగా చెప్పడానికి ఎన్నో త్యాగాలు చేస్తుంటే - ఆ నిజాన్ని అంగీకరించడానికి మంత్రివర్యులు త్యాగం చేయవద్దా? వారు ఏవిధంగా ఎంత త్యాగం చేస్తున్నారు?

ఎప్పటిమాటో, ఎక్కడి మాటో ఎందుకు? ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ఆహార పరిస్థితిగురించిన "నిజాన్ని" నిర్భీతిగా శ్రీ వాసుదేవరావుగారు వారి మంత్రివర్గ సహచరులు నిర్భీతిగా, నిష్పక్షపాతంగా అంగీకరిస్తారా?

మిగులు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఆహారధాన్యాలకు నేడింత హాహాకారాలు చెలరేగవలసిన అవసరం ఏమిటి? ఎందుకు ఈ పరిస్థితి ఎలా ఏర్పడింది?

రాష్ట్రంలో ఆహారధాన్యాలకు ఇప్పుడేర్పడిన కొరత నిజమైన కొరత అంటారా? కృత్రిమమైన కొరత అంటారా?

దాదాపు రెండు మూడు లక్షల టన్నుల ఆహారధాన్యాలు అక్రమంగా బైటిరాష్ట్రాలకు ఎగుమతి అయిపోయిన కుంభకోణంలో మీ ప్రస్తుత మంత్రివర్గ సహచరులలో కొందరికి, ఇప్పుడు మాజీ మంత్రులుగా వున్న మీ సహచరులకు పాత్రలేదని మీరు నిర్భీతిగా, నిష్పక్షపాతంగా చెబుతారా? శ్రీ వాసుదేవరావుగారూ?

కేంద్ర సి. బి. ఐ. ఆంధ్రప్రదేశ్ లోని సుమారు 90 రైసుమిల్లులపై అనేక రైల్వేస్టేషన్లపై దాడి చేసినప్పుడు ఈ అక్రమ రవాణాలో మంత్రివర్యులదగ్గర నుండి మిల్లుల వరకు, జిల్లా అధికారుల నుండి క్రింది స్థాయిలో ఉన్న గుమాస్తావరకు దాదాపు కలుపుకొని బహిరంగ ప్రపంచ కుంభకోణాల చరిత్రలోనే అపూర్వమూ, అతిశయ సాధ్యమూ అయిన "ఈ కుంభకోణానికి" సంబంధించిన అనేక రికార్డులు పట్టుబడినమాట నిజం కాదంటారా?

(విజయవాడలో ఒక రైల్వే ఉద్యోగి ఇంటిపై సి. బి. ఐ. వారు దాడి చేస్తే రు. 15 లక్షలు దొరికినట్లు 15 వ తేదీ "హిందూ" వార్త)

ఈ పట్టపగటి దోపిడీలో ఏ స్థాయిలో నైతేనేమి సుమారు కోటి రెండు కోట్ల వరకు అక్రమార్జన జరిగిందన్న నిజం ఎంత దాచేస్తేమాత్రం దాగుతుంది?

శ్రీ వాసుదేవరావుగారూ, దీని పర్యవసానం ఏమిటో నిర్భీతిగా అంగీకరిస్తారా? నేడు మీరు ఎక్కడికి వెళ్ళినా, ఏపట్టణానికి, ఏపల్లెటూరికి వెళ్ళినా ప్రజలు కిలో బియ్యం కొరకు ఎంతపడిగాపులుపడి క్యూలలో నుంచుంటున్నారో, విసిగివేసారి తిరిగి పోతున్నారో, చివరకు ఎన్నెన్ని దారుణ పరిస్థితులకు గురిఅయిపోతున్నారో మీకు తెలియదా? పత్రికల్లో చదవడంలేదా? పేద ప్రజలు గత పదిహేనురోజులుగా వందలు వేలుగా ప్రదర్శనలు పికెటింగులు, నిరాహారదీక్షలు జరుపుతూంటే ఈ ప్రత్యక్ష "నిజం" మీ కంటపడలేదా? మీ చెవులకు వినపడటంలేదా?

మీరు విన్నారా? గుంటూరు పట్టణంలో ఒక స్త్రీ కిలో బియ్యం దొరక్క - రోజుల తరబడి అన్నం పెట్టలేక తన పిల్లలకు విషం యిచ్చి తాను విషం మింగటానికి పోబోతుంటే తొట్రుపడి అడ్డుపడి ఆమెకు ఆ పూట బియ్యం యిచ్చింది ఆ భయంకర సంఘటనను ఆపుచేసిన సంగతి మీరు పత్రికల్లో చదివారా?

నెల్లూరులో ఒక బి. ఇ. డి. ఉపాధ్యాయుడు - శ్రీ వి. వి. ఎస్. మూర్తి 11 నెలలనుండి జీతాలు లేక, ఆరుగురు పిల్లలు, భార్యా తండ్రితో నానా దారులు పడి పస్తులు గడిపి గడిపి - చివరకు ఆకలి బాధతో శ్రీ మూర్తి ఈ నెల 4 వ తేదీన మరణించిన ఘోర విషాదసంఘటన గురించిన భయంకరమైన "నిజం" మీకు ఇంకా తెలియదా? తెలియదా?

ఇది జరిగింది మారు మూల గ్రామంలో కాదు. దిక్కూ మొక్కూ లేని ఏ ఏజన్సీ ప్రాంతాల్లోనూ కాదు ఒకజిల్లాముఖ్యపట్టణంలో. రాష్ట్రంలోని ఒక ప్రధాన కేంద్రంలో నాగరిక ప్రపంచంలో చెలామణి అయ్యే ఒక బి. ఎ. బి. ఇడి ఉపాధ్యాయుడు "అన్నం లేక-అలమటించి" మరణించిన ఈ దారుణ విషయం ఒక్కటి చాలు - మీ మంత్రివర్గం సిగ్గుతో తలవంచుకోడానికి - ఈ అపరాధానికి తలవంచి వినమ్రతతో రాజీనామా యిచ్చి పైకొలగి పోవడానికి; ఈ నిజాన్ని నిర్భీతిగా అంగీకరించే ధైర్యం మీరు ప్రదర్శించారా? లేదు.

ఇంతవరకు ఆ ఉపాధ్యాయుని కుటుంబానికి మీ మంత్రివర్యు లెవరైనా సంతాపం తెలుపలేదే ఒక్క సానుభూతి వాక్యం పలికారా? ఆ కుటుంబానికి పది రూపాయలు ప్రభుత్వం తరపున పంపారా?

చివరకు ఆ ఉపాధ్యాయుని మృతదేహానికి అంత్యక్రియలు జరిపించడానికి ఒక్కపైసా కూడా లేకపోతే తోటి ఉపాధ్యాయులు చందాలు వేసుకొని దహన సంస్కారాలు జరిపించవలసివచ్చిందే! ఇది ఏ ప్రభుత్వం? ఏ పాలన అనుకుంటారు?

నిజాన్ని నిర్భయంగా బైటపెడుతున్నాము!

(మిగతా 3వ పేజీలో)

హుజూరాబాద్‌లో వెయ్యి, బోథ్‌లో 400 మంది పికెటింగ్

కరువు పరిస్థితిపై, ఊరేగింపులు

హుజూరాబాద్, నవంబరు 16

కమ్యూనిస్టు పార్టీ పిలుపునందుకొని ఈ నెల 10వ తేదీన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో వెయ్యిమందితోను, అదిలాబాద్ జిల్లా బోథ్‌లో 400 మందితో తహసీల్ కార్యాలయాల ముందు పికెటింగ్‌లు జరిగాయి. పికెటింగ్‌కు ముందుగా కమ్యూనిస్టుపార్టీ, రైతు వ్యవసాయ యువజనసంఘాల నాయకత్వాన పట్టణ వీధులలో ఊరేగింపులు జరిపారు.

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో 30 గ్రామాల ప్రజలు వెయ్యి మంది ఊరేగింపులో పాల్గొన్నారు. తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎం. లక్ష్మీనారాయణ సహాయ కార్యదర్శి శ్రీ వి. [illegible], రైతు సంఘ నాయకులు శ్రీ ఎస్. [illegible], వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు శ్రీ కె. మల్లయ్య యీ కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

ఎర్రజెండాలు చేబూని, భుజాలపై గొంగళ్ళు ధరించిన పేద రైతులు, వ్యవసాయ కార్మికులు ఆహారసమస్య, కరువు పరిస్థితిపై నినాదాలిస్తూ డాక్ బంగ్లా నుండి ఊరేగింపుగా బయల్దేరి తహసీల్ కార్యాలయం ముందుకు చేర్చారు.

ఊరేగింపు తహశీల్ కార్యాలయానికి చేరగానే ప్రదర్శకుల నుద్దేశించి శ్రీ లక్ష్మీనారాయణ ఆహార సమస్య, కరువు పరిస్థితిపై ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ మాట్లాడారు. గ్రామానికొక చౌకడిపో పెట్టాలని, కిలో బియ్యం 85 పైసలకు అమ్మించాలని, బియ్యంమీద వేసే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పన్నులు రద్దుచేయాలని డిమాండ్ చేశారు, వ్యవసాయదారులకు పేద రైతాంగానికి [illegible] ఆర్థికసహాయం చేయాలని, అప్పుల వసూళ్ళను ఆపివేయాలని విజ్ఞప్తి చేశారు. అప్పు వసూలు సందర్భంలో గ్రామాధికార్లు, రెవెన్యూ గిర్దావర్లు రైతాంగాన్ని పీడించి లంచాలు పుచ్చుకునే నీచమైన పద్ధతిని అదుపులో పెట్టాలని తహశీల్దారును కోరారు. తాలూకాలోని ప్రజల కోర్కెలను వివరిస్తూ తహశీల్దారుకు మెమొరాండం యిచ్చారు.

ప్రజల కోర్కెలను తగిన శ్రద్ధతో పరిష్కరిస్తామని తహశీల్దారు ప్రదర్శకులకు హామీ యిచ్చారు.

బోథ్‌లో

ఆదిలాబాద్ జిల్లా బోథ్ తాలూకా కమ్యూనిస్టు సమితి పిలుపు నందుకొని వివిధ గ్రామాలనుండి 300 మంది పురుషులు, 100 మంది స్త్రీలు బోథ్ పట్టణంలో ఊరేగింపు జరిపి తహశీల్ కార్యాలయం ముందు పికెటింగ్ చేశారు.

ఊరేగింపుకు శ్రీయుతులు యం. యస్. లింగం, కె. ఎస్. లింగం నాయకత్వం వహించారు. ప్రతి గ్రామానికి ఒక చౌకడిపో పెట్టాలని, కిలో బియ్యం 85 పైసలకే అమ్మించాలని ప్రదర్శకులు నినాదాలిచ్చారు.

పికెటింగ్ సందర్భంగా పోలీసుల అభ్యంతరాలతో కొద్దిపాటి ఘర్షణ జరిగినా కార్యక్రమం విజయవంతంగా సాగింది.

అనంతరం పంచాయతీ సమితి కార్యాలయం ఎదుట తాలూకా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి శ్రీ ఎన్. రామరెడ్డి అధ్యక్షతన సభ జరిగింది.

సభలో తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎస్. [illegible] ప్రసంగిస్తూ ప్రభుత్వం ఉదాసీన వైఖరిని విడనాడి ఈ తాలూకాను వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించేవరకు ప్రజలు పోరాడాలన్నారు. శ్రీ రామిరెడ్డి మాట్లాడుతూ అధిక ధరలకు వ్యతిరేకంగా [illegible] ఉద్యమం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి గ్రామానికి చౌక డిపోలు పెట్టించి కిలో బియ్యం 85 పైసలకే అమ్మించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా రైతుసంఘ కార్యదర్శి శ్రీ ప. [illegible]రెడ్డి ప్రసంగిస్తూ ఆహార ధాన్యాల టోకు వ్యాపారాన్ని తక్షణమే ప్రభుత్వం చేపట్టాలని, యీ తాలూకాలో ప్రతినెలా యిచ్చే బియ్యం కోటా సరిపోనందున కోటాను 300 బస్తాలకు పెంచాలని డిమాండ్ చేశారు.

ఇరిగేషన్ ప్రాజెక్టుల జలాల వినియోగం

లోక్‌సభలో మంత్రి వివరణ

న్యూఢిల్లీ, నవంబరు 16

ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా సరఫరా చేసే జలాలను నిర్బంధంగా వినియోగించుకునే విధంగా వున్న ప్రస్తుత విధానాన్ని మార్చాల్సిందిగా బీహార్ ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం కోరిందని, నేడు లోక్‌సభలో కేంద్రమంత్రి శ్రీ కె. ఎల్. రావు చెప్పారు.

1951 నుండి మార్చి 1970 వరకు 94 లక్షల 60 వేల హెక్టార్ల భూమికి సరిపోయేంత జలాలు సమకూర్చబడ్డాయని, అయితే 82 లక్షల హెక్టార్ల భూమిలో మాత్రమే జలాలు వినియోగించబడ్డాయని కొన్ని రాష్ట్రాలలో ఉన్న కొన్ని విధానాలవల్ల ఆ జలాలను వినియోగించుకోకుండా ఉండటానికి మినహాయింపు లభించిందని మంత్రి చెప్పారు.

జలాలను తమ భూముల్లో వినియోగించుకోదలిస్తే వారి ఇష్టప్రకారం వ్యవహరించడానికి వీలు కల్పించే చట్టాన్ని మార్చి నిర్బంధంగా ఆ జలాలను వాడేవిధంగా చేయాలని బీహారును కేంద్రం కోరింది.

జౌళి ఎగుమతి వ్యాపారం

స్వాధీనానికి సూత్రప్రాయంగా నిర్ణయం

న్యూఢిల్లీ, నవంబరు 15

జౌళి ఎగుమతి వ్యాపారాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించిందని విదేశ వాణిజ్య మంత్రి శ్రీ మిశ్రా యీరోజు రాజ్యసభలో చెప్పారు.

ఎగుమతి వ్యాపారాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా కొంతకాలంపాటు ఎగుమతి వ్యాపారులను రంగంనుంచి తొలగించడం జరగదని ఆ తర్వాత ఎగుమతి వ్యాపారాన్ని ప్రభుత్వ సంస్థద్వారా నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు.

అయితే ఎప్పటిలోగా స్వాధీనం చేసుకునేది ఆయన తెలుపలేదు.

మొత్తం జౌళి పరిశ్రమను ప్రభుత్వం జాతీయం చేయాలని శ్రీయుతులు చిత్తబాసు, వి. కె. ముఖర్జీ డిమాండ్ చేశారు.

జౌళి పరిశ్రమను జాతీయం చేసే ప్రతిపాదన యేదీ లేదని, దేశంలో 300 మిలులున్నాయని వాటిని జాతీయం చేయడం అంత సులభమైన పనేమీ కాదని మంత్రి చెప్పుకున్నారు.

జౌళి పరిశ్రమ ఎలాంటి యిబ్బందులను ఎదుర్కొనడం లేదని, అనేక జౌళిమిల్లుల యజమానులు తమ లాభాలను యితర పరిశ్రమలకు తరలిస్తున్నారని శ్రీ అర్జున్ అరోరా, శ్రీ కృష్ణకాంత్‌లు వాదించారు.

మిలులు లాభాలు చేసుకుంటున్నమాట నిజమే అయినా, జౌళిమిల్లులు యిబ్బందులు ఎదుర్కొంటున్నాయని మంత్రి చెప్పారు.

టకూ కమిషన్ పదవీకాలం పొడిగింపు

న్యూఢిల్లీ, నవంబరు 16

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌పై నియమించిన టకూ కమిషన్ పదవీకాలాన్ని వచ్చే ఫిబ్రవరి నాటికి పొడిగించినట్లు పెట్రోలియం, రసాయనాల శాఖ మంత్రి శ్రీ పి. సి. సేథీ నేడు రాజ్యసభలో తెలియజేశారు.

కమిషన్ ప్రభుత్వానికి అన్నివిధాలుగా సహకరిస్తున్నదని, తగిన సమాచారం అందజేయటం లేదన్న విషయం నిజంగాదని అన్నారు.

రైల్వే అధికార్లకు ప్రత్యేక బోగీలు

మంత్రి వివరణ

న్యూఢిల్లీ, నవంబరు 16

రైల్వే అధికారులు ప్రత్యేక రైల్వే బోగీలను (సెలూను) రైల్వే కార్లను వాడటాన్ని నిరోధించేందుకు చర్యలు చేపట్టామని రైల్వేమంత్రి శ్రీ హనుమంతయ్య నేడు లోక్‌సభలో సభ్యులకు హామీయిచ్చారు.

రైల్వే అధికార్లు పర్యటనలో ఉండగా వారి కుటుంబ సభ్యులు కూడా వారితోబాటు ఈ ప్రత్యేక బోగీలలో ప్రయాణించడం పట్ల సభ్యులు నిరసించారు. అయితే ఆ విషయంలో మాత్రం అంత కఠినంగా ఉండక్కర్లేదని మంత్రి వాదించారు.

రైల్వే అధికార్లు తనిఖీ, తదితర బాధ్యతలు నిర్వహిస్తున్నపుడు వారి వినియోగానికి వివిధ సౌకర్యాలతో సహా ఉన్న రైల్వేబోగీలు దాదాపు వెయ్యివరకు ఉంటాయని ఆ అధికార్లకు ఆ సౌకర్యాలు కల్గచేయ్యవలసివున్నా ఆ బోగీల నిర్వహణకయ్యే ఖర్చు తక్కువేనని ఆయన చెప్పారు.

అమెరికా విదేశీ సాయం కొనసాగింపు

సెనేట్ నాయకుల అంగీకారం

వాషింగ్టన్, నవంబరు 16

డిసెంబరు వరకు ఇతర దేశాలకు అమెరికా సహాయాన్ని కొనసాగించడానికి అమెరికా సెనేట్ నాయకులు నిన్న రాత్రి అంగీకరించారు.

అమెరికా ప్రభుత్వం ఇతర దేశాలకు చేసే వివిధ సహాయాల విషయమై కాంగ్రెసు ఒక చట్టాన్ని రూపొందిస్తున్నది సహాయం కొనసాగింపు విషయం [illegible] అన్నది.

నిన్న అర్ధరాత్రితో సెనేట్ ఈ విషయమై పట్టిన గడువు ముగుస్తున్నది. ఈ నెలాఖరు వరకు సహాయాన్ని కొనసాగించడానికి ఈ నిర్ణయం వల్ల వీలు ఏర్పడింది.

సంవత్సరానికి 160 కోట్ల డాలర్ల సహాయంగా ఇవ్వడానికి అమెరికాకు తాత్కాలికంగా అవకాశం లభించింది. నిన్న వైట్‌హౌస్‌లో నిక్సన్ రెండు పార్టీల నాయకుల్ని, సెనేట్ నాయకుల్ని వివిధ కమిటీల సభ్యుల్ని కలుసుకొని చర్చించిన అనంతరం ఈ అంగీకారం లభించింది.

ఆహారోత్పత్తిపై బంగ్లాదేశ్ శరణార్థుల ప్రభావం

న్యూఢిల్లీ, నవంబరు 15

"ఆహారోత్పత్తిలో స్వయం సమృద్ధి సాధనపైన బంగ్లాదేశ్ శరణార్థులకు సహాయం కొనసాగింపు ప్రభావం ఉంటుందా లేదా అన్న విషయం చెప్పడం కష్టసాధ్యం" అని వ్యవసాయ శాఖ స్టేట్ మంత్రి శ్రీ షిండే సమర్ గుహ ప్రశ్నకు సమాధానంగా పార్లమెంటులో చెప్పారు.

శరణార్థులు సమీప భవిష్యత్తులో స్వదేశానికి తిరిగి వెళ్ళకపోతే మన ఆహార నిల్వలపై భారం కాగలదని మంత్రి ఒక సమాధానం కొనసాగిస్తూ అన్నారు.

ప్రపంచ శాంతికి చైనా కృషి : ఐరాసలో చైనా ప్రతినిధి వెల్లడి

ఐక్యరాజ్యసమితి, నవంబరు 16

అంతర్జాతీయ శాంతి ప్రతిష్ఠాపనలో ఐ రా. స. సక్రమమైన పాత్ర వహించాలని, వివిధ దేశాల మధ్య స్నేహ సహకారాలు అభివృద్ధి కావాలని చైనా ఆకాంక్షిస్తున్నదని ఐ. రా. స. లో ప్రసంగిస్తూ చైనా ప్రతినిధివర్గ నాయకులు చియావో కువాన్ హువా వెల్లడించారు.

ఐ. రా. సలో చైనా స్థానాన్ని స్వీకరించిన సందర్భంగా చైనా ప్రతినిధి వర్గాన్ని ఆహ్వానిస్తూ [illegible] సహా 55 దేశాల ప్రతినిధులు స్వాగతం చెప్పిన అనంతరం ఐ రా. స. సర్వసభ్య సమావేశంలో సమాధానం చెప్తూ ఆయన పైవిధంగా తెలిపారు.

చియావో కువాన్ హువా చైనా ప్రతినిధివర్గ నాయకులు, చైనా విదేశాంగ ఉపమంత్రి కూడాను. ఆయన పాలస్తీనా పోరాటం, నిరాయుధీకరణ, అణ్వస్త్రనిషేధం, తైవాన్‌ను విముక్తి చేయడం మొదలయిన విషయాలను ప్రస్తావించారు.

ఐరాసలో చైనా తరఫున మొట్టమొదటి సారిగా ప్రసంగిస్తూ, చైనా విధానాలను ఆయన వివరించారు.

ఇండోచైనా సమస్యలు, కొరియా, పశ్చిమాసియాలపై ఆయన ప్రధానంగా ప్రసంగించారు.

అయితే భారత ఉపఖండంలో పరిస్థితి ఆయన ప్రస్తావించలేదు.

చైనాకు స్థానం కల్పించేందుకు అనుకూలంగా ఓటుచేసిన దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐ. రా. స ను ఒకటి లేక రెండు అగ్రరాజ్యాలు తమ స్వార్థంకోసం ఇన్నాళ్ళు ఉపయోగించుకున్నాయని, ఆ పరిస్థితి కొనసాగరాదని ఆయన అన్నారు.

పెద్ద దేశాల పెత్తనాన్ని తాము వ్యతిరేకిస్తామన్నారు.

దురాక్రమణ అనవసర జోక్యం [illegible] విధానాలు గల అగ్రరాజ్యంగా చైనా ఎన్నడూ ప్రవర్తించబోదని, ఈ నాడుకూడా అలా ప్రవర్తించడం లేదని ఆయన చెప్పారు.

సమర్ సేన్ విజ్ఞప్తి

భారత ప్రతినిధి శ్రీ సమర్ సేన్ ప్రసంగిస్తూ, భారత - చైనాల మధ్య సాధారణ సంబంధాల పునరుద్ధరణ జరగాలని విజ్ఞప్తి చేశారు.

చైనా ఆర్థికంగా ఇంకా వెనుకబడివున్న దేశమని, అదే సమయంలో వర్ధమాన దేశమనీ ఆసియా, ఆఫ్రికా లాటిన్ అమెరికా దేశాలలో అత్యధిక దేశాల వలె చైనా కూడా మూడవ ప్రపంచానికి చెందినదని ఆయన చెప్పారు.

అమెరికా స్వాగతం

రిపబ్లిక్ చైనా ప్రతినిధులు ఐ రా స లో తమ స్థానాన్ని స్వీకరించిన సందర్భంగా అమెరికా నాయకుడు బుష్ స్వాగతం చెబుతూ దీనివల్ల ఐ రా స మరింత సమర్థవంతంగా పనిచేయగలదన్నారు.

ఐరాసలో చైనా స్థానాన్ని సాధించుకున్న [illegible] అమెరికా కూడా అంగీకరించిందన్నారు.

అమెరికా చైనాల మధ్య చిరకాలంగా ఉన్న సంబంధాలను ఆయన ప్రస్తావించారు.

చైనా ప్రతినిధివర్గానికి స్వాగతం చెప్పేందుకుగాను వివిధ దేశాల ప్రతినిధులు ఒకరి తరువాత ఒకరు వేదికవద్దకు వెళ్ళారు.

ఫ్రాన్స్ ప్రతినిధితోసహా మొత్తం [illegible] మంది ప్రతినిధులు ఈ స్వాగతోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తరువాత చైనా ప్రతినిధి చియావో సమాధాన మిచ్చారు.

సోషలిస్టు దేశాలు - భారత్

(1వ పేజీ తరువాయి)

పెంపొందించడానికి ప్రాతిపదిక ఏర్పడిందని డాక్టర్ వి. కె. ఆర్. వి. రావు అన్నారు.

ఒకేదేశం రాజకీయ, ఆర్థిక రంగాలలో విభిన్న దృక్పథాలను అనుసరించలేదని చెప్పారు. భారత - సోషలిస్టు దేశాల మధ్య మరింత సహకారం పెంపొందించుకోవటానికిగల అవకాశాలను పరిశీలించాలని అన్నారు.

విదేశాంగ శాఖ మంత్రి శ్రీ స్వరణ్ సింగ్ మాట్లాడుతూ సోషలిజం ద్వారానే భారతదేశంలోని ఆర్థిక వ్యవస్థ వర్ధిల్లగలదని పండిట్ నెహ్రూ ముందుగానే వూహించారని అన్నారు.

కామికాన్ ద్వారా సోషలిస్టు దేశాలతో భారతదేశం మరింత పటిష్టమైన సంబంధాలను ఏర్పరచుకోవాలని శ్రీ మోహన్ కుమారమంగళం ఉద్ఘాటించారు. వీటివల్ల భారత్ వుత్పత్తులకు మార్కెట్లు లభించగలవని ఆయన పేర్కొన్నారు. సోషలిస్టు దేశాలతో బహుముఖ ఆర్థిక సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్ర న్యాయ శాఖా మంత్రి శ్రీ హెచ్. ఆర్. గోఖలే మాట్లాడుతూ భారతదేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందటానికి సోషలిస్టు దేశాలు ఉదారంగా సహాయం చేశాయని అన్నారు.

కేంద్ర పారిశ్రామిక అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ మొయినుల్ హక్ చౌదరి మాట్లాడుతూ దేశం ప్రత్యేకమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నదని అన్నారు.

ఇలాంటి సమయంలో అభివృద్ధి వేగాన్ని త్వరితం చేయటానికి పటిష్టమైన ప్రభుత్వరంగం, సోషలిస్టు దేశాలతో సన్నిహిత ఆర్థిక సంబంధాలు కలిగివుండటం అవసరమని అన్నారు.

కంపెనీ వ్యవహారాల మంత్రి శ్రీ కె. వి. రఘునాథరెడ్డి మాటాడుతూ సోషలిస్టు దేశాలు యితర దేశాల ఆర్థిక సహకారానికిగల అవకాశాలను గురించి మహాశయులు లెనిన్ వూహించారని, భారతదేశానికి సంబంధించినంత వరకు పండిట్ నెహ్రూ ఈ విషయానికి విశిష్ట [illegible] చెప్పారు.

కేంద్రమంత్రి శ్రీ పి. సి. సేథీ మాట్లాడుతూ నూనె అన్వేషణ కార్యక్రమాలు, నూనె శుద్ధి కర్మాగారాలను ఏర్పాటు, కర్మాగారాలను నెలకొల్పటంలో భారతదేశం సోషలిస్టుదేశాలనుండి విలువైన సహాయాన్ని పొందిందని తెలియజేశారు.

హంగరీకి చెందిన ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త [illegible] మాట్లాడుతూ భారతం, సోషలిస్టు దేశాల మధ్య [illegible] సంబంధాలు వుండటం అవసరమని పేర్కొన్నారు.

తూర్పు జర్మనీకి చెందిన ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త [illegible] మాటాడుతూ ఆర్థిక వాణిజ్య రంగాలలో యిరు దేశాల మధ్య మరింత సహకారానికి అవకాశాలు వున్నాయని చెప్పారు.

ఆర్డినెన్సులపై ధిల్లాన్ అసంతృప్తి

న్యూఢిల్లీ, నవంబరు 16

పార్లమెంటు సమావేశాలు జరగని రెండు నెలల కాలంలో కేంద్ర ప్రభుత్వం పెక్కు ఆర్డినెన్సులను జారీ చేసినందుకు లోక్‌సభ స్పీకర్ శ్రీ జి. యస్. ధిల్లాన్ నేడు లోక్‌సభలో అసంతృప్తిని వెల్లడించారు.

ఎలాంటి అత్యవసర పరిస్థితులలో ఈ ఆర్డినెన్సులను జారీ చేసారో, ఎలా జారీ చేయటానికి గల అవసరమేమిటో తెలియజేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరగలనని అన్నారు.

ఆర్డినెన్సులపై చర్చ జరగాలని జనసంఘ నాయకులు చేసిన డిమాండ్‌పై శ్రీ ధిల్లాన్ పై విషయాన్ని తెలియజేశారు.

ఈ విషయంపై ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీతో వ్యక్తిగతంగా [illegible] చర్చలు జరుపగలనని సభకు ఆయన హామీ యిచ్చారు.

ప్రిసైడింగ్ ఆఫీసర్ల సమావేశంలో ఆర్డినెన్సులను జారీ చేసే విధానాన్ని గురించి చర్చించటం జరిగిందని తెలిపారు.

హడావుడి ఆర్డినెన్సులు జారీ చేయవలసిన అవసరంలేదని తాను భావిస్తున్నానని చెప్పారు.

మంత్రి మూర్తిరాజుపై ఆరోపణల పరిశీలన

హైదరాబాద్, నవంబరు 15

మార్కెటింగ్ శాఖ మంత్రి శ్రీ మూర్తిరాజుపై కొంతమంది కాంగ్రెసు నాయకులు చేసిన ఆరోపణలపై పరిశీలన జరుపుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు నేడిక్కడ పత్రికా విలేకరుల సమావేశంలో తెలియజేశారు.

పశ్చిమ గోదావరిజిల్లా కాంగ్రెస్ నాయకులు శ్రీయుతులు అల్లూరి బాపినీడు, కొమ్మారెడ్డి సూర్యనారాయణ, [illegible], చిట్టూరి సుబ్బారావు చౌదరిలు మంత్రి శ్రీ మూర్తిరాజుపై అవినీతి ఆరోపణలు చేయటం పాఠకులకు తెలిసిందే.

ఈ ఆరోపణలను మంత్రి శ్రీ మూర్తిరాజు ఖండించారు.

గంగూలీ పదవీ విరమణ

శ్రీ హనుమంతయ్య వివరణ

న్యూఢిల్లీ, నవంబరు 15

క్రమ శిక్షణను నెలకొల్పేందుకుగాను రైల్వే బోర్డ్ మాజీ అధ్యక్షులు శ్రీ బి. సి. గంగూలిచే పదవీ విరమణ చేయించటం అవసరమైందని రైల్వే మంత్రి శ్రీ కె. హనుమంతయ్య నేడు లోక్‌సభలో చెప్పారు.

పార్లమెంటు ఉభయ సభలలో శ్రీ హనుమంతయ్య నేడొక ప్రకటన చేస్తూ, ప్రభుత్వ సర్వీసులలో గతంలో ఎన్నడూలేని పద్ధతులను శ్రీ గంగూలీ అవలంబించాడని ఇది నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించటమేనని అన్నారు.

శ్రీ గంగూలీని పదవీవిరమణ చేయించటం రైల్వేబోర్డు సభ్యులతో ఆయనకున్న విభేదాల పర్యవసానమేనని, విభేదాల ఫలితంగా రైల్వేబోర్డు పని నిర్వహణ తీవ్ర ఆటంకంగా తయారైందన్నారు.

రైల్వేబోర్డులోని ఇతర సభ్యులందరి పట్ల శ్రీ గంగూలి అమర్యాదగా ప్రవర్తించారనీ, తీవ్రమైన పదజాలాన్ని వినియోగించటం జరిగిందని రైల్వే మంత్రి తెలిపారు.

విషయం ఒక మంత్రికి, ప్రభుత్వ ఉద్యోగికి సంబంధించింది కాదని నిబంధనలను, సాంప్రదాయాలను వ్యతిరేకించటమేనని శ్రీ హనుమంతయ్య అన్నారు.

సెలూన్లు - రైల్వే మంత్రులు

న్యూఢిల్లీ, నవంబరు 16

రైల్వే అధికారులు, యితర ముఖ్య అధికారులకు ఎయిర్ కండిషన్ సెలూన్లు ఏర్పాటు చేయటంపై చర్చ జరుగుతుండగా స్పీకర్ చేసిన వ్యాఖ్యలు విని సభ్యులు గొల్లున నవ్వారు.

కొన్ని సాంప్రదాయాల ననుసరించి రైల్వే మంత్రికి ఎయిర్ కండిషన్ సెలూన్ సౌకర్యాలు ఏర్పాటుచేసినా తాను వినియోగించుకోలేదని రైల్వే మంత్రి శ్రీ హనుమంతయ్య వివరిస్తూవుండగా "లేకపోతే వారు వాటిలో నుండి బయటపడరా" అని స్పీకర్ అన్నారు.

సినిమా టిక్కెట్టుపై 10 పైసల సర్‌ఛార్జి

కరైకాల్, నవంబరు 15

బంగ్లాదేశ్ శరణార్థుల సహాయ కార్యక్రమాలకు అదనపు వనరుల సమీకరణకు పుదుచ్చేరిలో సినిమా టిక్కెట్లపై 10 పైసలు సర్‌ఛార్జి విధించబడుతుంది.

ముల్కీ నిబంధనలపై అప్పీలు ఉపసంహరణ

రాష్ట్ర ప్రభుత్వంచే

న్యూఢిల్లీ, నవంబరు 15

ముల్కీ నిబంధనలపై సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకోవడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ ఉపసంహరణను సుప్రీంకోర్టు నేడు అనుమతించింది.

ముల్కీ నిబంధనలు చెల్లనేరవని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఫుల్ బెంచి తీర్పుఇచ్చిన విషయం పాఠకులకు విదితమే.

హైకోర్టు తీర్పుపై అప్పీలు చేసుకునేందుకు అనుమతివ్వనందున ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకున్నది.

రాష్ట్ర శాసనమండలి సమావేశం

నవంబరు 27నుండి

హైదరాబాద్, నవంబరు 16

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి నవంబరు 27 నుండి సమావేశం కానున్నది.

అధికారయుతంగా నేడీ విషయం ప్రకటించబడింది.



బి-టెక్స్
తామర, దురద, కురుపులకు
బి-టెక్స్

శరణార్థుల సహాయార్థం
తపాలా ఖర్చుమీద పన్ను
1971, నవంబర్ 15 నుంచి

ఈ క్రింద పేర్కొన్న ప్రతిదానికి మరో అయిదు పైసలు పన్ను చెల్లించవలసివుంటుంది.

★ ప్రభుత్వ సేవార్థం పంపునవి కూడా ★ ఇన్‌లాండ్ లెటర్‌లు ★ పార్సెళ్లు ★ మనియార్డర్లు ★ టెలిగ్రాఫిక్ మనియార్డరులు ★ టెలిగ్రాములు ★ ఫోనోగ్రాములు ★ పస్టు దే కవర్లు ★ మినహాయింపు ఇస్తున్నట్టు నిర్దిష్టంగా పేర్కొనని ఇతర పోస్టల్ ఖర్చులు.

పోస్టులో విదేశాలకు పంపే వస్తువులు, బంగీలు, ఉత్తరాలు మొదలయినవాటి మీద ఈ పన్ను చెల్లించవలసివుంటుంది. తగినన్ని తపాలాబిళ్ళలు అంటించని వాటిని పంపిన వారికే తిరిగి పంపించివేస్తారు.

మినహాయింపు :

ఈ దిగువ పేర్కొన్న వాటిని ఈ పన్ను నుంచి మినహాయిస్తారు.

★ పోస్టు కార్డులు ★ రిజిస్టరు వార్తాపత్రికలు ★ అంధులకోసం పంపే సాహిత్యంగల బంగీలు ★ జమ్మూ-కాశ్మీరునుంచి పంపే తపా, బంగీలు మొదలయినవి.

చెల్లించే విధానము :

"శరణార్థుల సహాయార్థం" అని వున్న అయిదు పైసల తపాలాబిళ్ళను పన్ను చెల్లించవలసిన ప్రతిసారీ అంటించండి ఈ తపాలాబిళ్ళలు తపాలాఫీసుల్లో లభిస్తాయి. 'ముందుగా తపాలా ఖర్చును నగదులో చెల్లించ' వలసిన వాటిమీద పన్నును నగదురూపంలో చెల్లించవచ్చు. మనియార్డరులమీద పన్నును నగదు రూపంలో వసూలుచేస్తారు.

ఫ్రాంకింగ్ యంత్రాలను వుపయోగిస్తున్నవారు, పన్నును 'శరణార్థుల సహాయార్థం' గల తపాలాబిళ్ళల రూపంలోగాని, నగదు రూపంలోగాని ఎన్నికచేసిన తపాలాఫీసులో చెల్లించాలి.
తపాలా వస్తువులు, ఉత్తరాలు మొ॥నవి పంపేటప్పుడే పన్నును చెల్లించండి. లేకపోతే ఆ తర్వాత రెండింతలు చెల్లించవలసి వస్తుంది.

భారత తంతి-తపాలా శాఖ

davp 71/368

MOSCOW NEWS
Weekly News-magazine
1-Year 4 50 2-Year 7 00 3-Year 9 00

SOVIET UNION
Illustrated Monthly
1-Year 7 00 2-Year 11 00 3-Year 14 00

SOVIET WOMAN
Monthly Magazine
1-Year 5 00 2-Year 7 00 3-Year 10 00

Sputnik
Monthly Digest
1-Year 30 00 2-Year 45 00 3-Year 60 00

Culture and LIFE
Cultural Monthly
1-Year 7 00 2-Year 11 00 3-Year 14 00

New TIMES
Political Weekly
1-Year 6 00 2-Year 9.00 3-Year 12 00

Soviet Film
Screen Monthly
1-Year 8 00 2-Year 12 00 3-Year 16 00

SOVIET LITERATURE
Literary Monthly
1-Year 7 00 2-Year 11 00 3-Year 14 00

FOREIGN TRADE
Monthly Trade Journal
1-Year 90 00 2-Year 163 00 3-Year 225 00

INTERNATIONAL AFFAIRS
Foreign Affairs Monthly
1-Year 7 00 2-Year 11 00 3-Year 14 00

TRAVEL TO THE USSR
Tourism Bi-monthly
1-Year 12 00 2-Year 18 00 3-Year 24 00

SPORT in the USSR
Sports Monthly
1-Year 4 00 2-Year 6 00 3-Year 8 00

SOCIAL SCIENCES
QUARTERLY JOURNAL
ANNUAL Rs. 36 00
SINGLE COPY Rs 10.00

A WINDOW ON THE SOVIET UNION

FOR NON-RECEIPT OF MAGAZINES OR ANY DISCREPANCY OR CHANGE OF ADDRESS WRITE TO THE AGENT CONCERNED.

SOVIET MILITARY REVIEW
Illustrated Monthly
1-Year 15 00 2-Year 22 00 3-Year 30 00

SUBSCRIBE WITH AUTHORISED AGENT

Visalaandhra Publishing House
Eluru Road Centre : VIJAYAWADA-2
Visalaandhra Book House
Sultanbazar : HYDERABAD

మార్క్సిస్టుపార్టీకార్యకర్తల్లో పునరాలోచన: కేరళ ఐక్యసంఘటన ప్రభుత్వం పటి

(ఐ. పి. ఏ విలేకరి)

న్యూఢిల్లీ, నవంబరు 15

కేరళలో కమ్యూనిస్టుపార్టీవల్ల, కమ్యూనిస్టుపార్టీ నాయకత్వానగల ఐక్యసంఘటన ప్రభుత్వం పట్ల అవలంబించవలసిన వైఖరిపై మార్క్సిస్టుపార్టీ కార్యకర్తల్లో పునరాలోచన జరుగుతున్నది.

కేరళ కమ్యూనిస్టు మంత్రి శ్రీ ఎం. ఎన్ గోవిందన్ నాయర్ ఐ. పి. ఏ. విలేకరికి ఇచ్చిన ఇంటర్వ్యూలో యీ విషయాన్ని చెప్పినారు.

కమ్యూనిస్టుపార్టీ 9 వ మహాసభ అనంతరం ఐక్యసంఘటన ప్రభుత్వంలో కాంగ్రెస్ చేరిన తర్వాత కేరళ రాష్ట్రంలో గల రాజకీయ పరిస్థితిని ఆయన తెలియజేశారు

పెక్కు సమస్యలను ఎదుర్కొంటున్న రాష్ట్రంలో రాజకీయ సుస్థిరత ఏర్పడటం అత్యవసరమైన సమస్యని సామాన్య ప్రజలు [illegible] భావిస్తున్నారన్నారు. ప్రస్తుత మంత్రివర్గం ఐదు సంవత్సరాల పదవీ కాలాన్ని పూర్తిచేస్తే ఎన్నో మంచి పనులు చేయగలదని భావిస్తున్నారు.

సామాన్య ప్రజల యీ ఆలోచనా ధోరణి ప్రభావం మార్క్సిస్టు పార్టీ కార్యకర్తలపై కూడా పడుతున్నది దీనివలన కమ్యూనిస్టు పార్టీ పట్ల వారికిగల వైముఖ్యం తగ్గిపోతున్నది

ఐక్య సంఘటన ప్రభుత్వానికి వ్యతిరేకంగా [illegible] యిచ్చినప్పటికీ తమ బలాన్ని నిలుపుకోలేని అనుభవాల ద్వారా వారు గుర్తిస్తున్నారని శ్రీ నాయర్ తెలియజేశారు.

మంత్రివర్గంలో కాంగ్రెస్ చేరటంద్వారా అధికార పార్టీల మధ్య మంచి అవగాహన ఏర్పడింది. ప్రభుత్వ సుస్థిరతపట్ల ప్రజలకు మరింతగా విశ్వాసం పెరిగింది.

భూసంస్కరణల చట్టాన్ని పకడ్బందీగా అమలు జరపటంతో పాటు కాలపరిమితి గల కార్యక్రమాన్ని అమలు జరిపే విషయాన్ని ఐక్యసంఘటన పార్టీలు తీవ్రంగా యోచిస్తున్నాయి. సాధ్యమైన మేరకు నిరుద్యోగ సమస్యను పరిష్కరించే విషయానికి అధికార పార్టీలు అత్యంత ప్రాధాన్యత యిస్తున్నాయి పారిశ్రామికీకరణకు ప్రాముఖ్యత ఇస్తున్నాయి.

మత్స్య పరిశ్రమ, ఎలక్ట్రానిక్స్, పెట్రో కెమికల్స్ అంశాలపై ఐక్యసంఘటన ప్రభుత్వం తన దృష్టిని కేంద్రీకరించింది

కేరళ పారిశ్రామిక అభివృద్ధిని గూర్చి శ్రీ నాయర్ ప్రస్తావిస్తూ గ్రామీణ ప్రాంతాలలో నెలకొల్పే పరిశ్రమలకు ఆయన ప్రాముఖ్యతనిచ్చారు. ఇందుకై కేరళ ప్రభుత్వం ఇంజనీర్లకు, యితర సాంకేతిక నిపుణులకు ఆర్థిక సహకారమిచ్చి ప్రోత్సహిస్తున్నది. సహకార ప్రాతిపదికపై వీరు చిన్న చిన్న పరిశ్రమలను స్థాపిస్తారు.

భూమిలేని నిరుపేదలకు ఉచితంగా గృహాలను నిర్మించే కార్యక్రమాన్ని, వ్యవసాయ వృత్తులకు గృహ సౌకర్యం, గ్రామీణ విద్యుదీకరణను కేరళ ప్రభుత్వం ప్రస్తుతం అమలుపరుస్తున్నది.

ప్రభుత్వ ఆస్తి ధ్వంసం చేయడాన్ని నిరోధిస్తూ కేరళలో చట్టం

కొచ్చిన్ నవంబర్ 15

ఆందోళనల సందర్భంగా ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడాన్ని నిరోధిస్తూ వచ్చే శాసనసభ సమావేశంలో ఒక బిల్లు ప్రవేశపెట్టాలని కేరళ ప్రభుత్వం ప్రతిపాదించింది

హోం మంత్రి శ్రీ కరుణాకరన్ నేడిక్కడ ఈ విషయం తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతల రక్షణకు తగు చర్యలు తీసుకోవలసిందిగా పోలీసు అధికార్లకు ఉత్తర్వు చేస్తున్నారు.

సోవియట్‌లాండ్ నెహ్రూ అవార్డుల ప్రదానం

రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరిచే

న్యూఢిల్లీ, నవంబరు 15

భిన్న సామాజిక వ్యవస్థలు, సాంప్రదాయాలుగల భారత సోవియట్ దేశాల మధ్య గల సన్నిహిత మైత్రిని ఇతర దేశాలు ఆదర్శవంతంగా తీసుకోవాలని రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి నేడిక్కడ అన్నారు.

సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డుల ప్రదాన ఉత్సవంలో ప్రసంగిస్తూ ఆయన పై విధంగా అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు, ఆర్థిక, సామాజిక ప్రగతికోసం అన్ని రంగాలలో సహకరించుకునేందుకు భారత సోవియట్ మైత్రి ఒప్పందం [illegible], రాజకీయ ప్రాతిపదికలు ఏర్పరచిందన్నారు.

అంతర్జాతీయ అవగాహన, సాంస్కృతిక సహకారం ద్వారా మానవాళి ప్రపంచశాంతిని పరిరక్షించాలని ఆయన అన్నారు.

24 మంది భారతీయులకు, 6 గురు సోవియట్ పౌరులకు రాష్ట్రపతి అవార్డులను బహూకరించారు. 13 భారతీయ భాషలలోని రచనలకు ఈ సంవత్సరం అవార్డులు ఇవ్వబడ్డాయి

1965 నుంచి ఇవ్వబడుతున్న సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డులు, ఉభయ దేశాల మైత్రిని పటిష్ఠం చేసేందుకు దోహదం చేశాయన్నారు.

'చైతన్య భారతి' వార్షికోత్సవాలు

రెండురోజులపాటు సాహితీ సభలు

విజయవాడ, నవంబరు 15

సామాజిక శ్రేయస్సే ధ్యేయంగా ప్రగతిశీలంగా రచనలు నెరపవలెనని ఇక్కడ చైతన్య భారతి ప్రథమ వార్షికోత్సవాల సందర్భంగా జరిగిన రచయితల సభలో పలువురు ప్రముఖ రచయితలు పిలుపు నిచ్చారు.

ఈనెల 13, 14 తేదీలలో విజయవాడ రోటరీక్లబ్ ఆడిటోరియంలో జరిగిన ఈ సభలలో ప్రముఖ రచయితల నుండి కొత్త రచయితల వరకూ, వృద్ధుల నుండి యువకుల వరకు రచయితలు పాల్గొన్నారు.

13 వ తేదీ సభకు ఆంధ్ర సర్కిల్ పోస్టుమాస్టర్ జనరల్ శ్రీ ఎస్. టి. కె. రెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీయుతులు అవసరాల, రాంభట్ల కృష్ణమూర్తి, శ్రీమతి సరోజిని ప్రసంగిస్తూ ప్రగతిశీల రచనలు వెలువరించాలని యువతరానికి ఉద్బోధించారు.

రెండవరోజున వివిధ అంశాలపై రచయితల సదస్సులు జరిగాయి. సదస్సు శ్రీ మద్దూరి చంద్రశేఖరరావు ప్రారంభించగా శ్రీ రావూరి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. కొత్తగా వస్తున్న రచనలలో సాహిత్య దృక్పథాన్ని గురించి శ్రీ [illegible] నారాయణమూర్తి, సాహిత్యంలో విమర్శపై శ్రీ తుమ్మల వెంకట్రామయ్య, వచనంలో కవిత్వం పై శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, [illegible] పై శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ, [illegible] సాహిత్య కార్యక్రమాలపై శ్రీ జి. కృష్ణ, రచన స్వరూపం పై శ్రీ ఎస్.ఏ. [illegible] సాహిత్యం పై శ్రీ వీరాజీ ప్రసంగించారు. హిందీలో అనువాదాల పై శ్రీ సుమన్ వ్యాసాన్ని శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య చదివారు.

మధ్యాహ్నం నాటకంపై సదస్సులో శ్రీయుతులు కవులూరి వెంకటేశ్వరరావు, కంకంపాటి సత్యం, [illegible] రామన్న పంతులు, [illegible] పాల్గొన్నారు. నవలపై సదస్సులో శ్రీయుతులు రెంటాల, కొమ్మూరి వేణుగోపాలరావు, [illegible] డాక్టర్ దక్షిణామూర్తి పాల్గొన్నారు.

అనంతరం సాహిత్యంలో యువతరంపై సదస్సులో శ్రీయుతులు కౌముది, [illegible] కె రాజేశ్వరరావు, రామచంద్ర శర్మ, కుమారి టి. లలిత పాల్గొన్నారు.

ఆ తర్వాత ముగింపు సభకు డాక్టర్ జి. వి. కృష్ణారావు అధ్యక్షత వహించారు. "వచనకవిత్వం ఆధునిక నాటకీయ ధర్మమేనా" శ్రీమతి హేమలతాలవణం, సమాజంపై సాహిత్యం ప్రభావం అన్న విషయంపై శ్రీమతి వాసిరెడ్డి [illegible] ప్రసంగించారు. సాహిత్యం పై [illegible] అభిప్రాయాన్ని గురించి శ్రీ [illegible] రామమోహనరావు ప్రసంగించారు. శ్రీ వి. వి ఎస్. మూర్తి వందన సమర్పణ చేశారు. అనంతరం శ్రీ వి. వి. డి. వి. ప్రసాదరావు రచించి, తమ బృందంతో సమర్పించిన 'ప్రగతి [illegible]' నాటిక ప్రదర్శింపబడింది.

కొత్త కార్యవర్గం

చైతన్యభారతి అధ్యక్షులుగా శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య, ఉపాధ్యక్షులుగా శ్రీయుతులు మల్లిక్, వి. వి. డి. వి. ప్రసాదరావు, కార్యదర్శిగా శ్రీ గుమ్మడి దివాకరరావు, సంయుక్త కార్యదర్శిగా శ్రీ వి. వి. యస్. మూర్తి, కోశాధికారిగా శ్రీ శర్మ ఎన్ని [illegible] కార్యవర్గ సభ్యులుగా శ్రీయుతులు నిడమర్తి ఉమారాజేశ్వరరావు, [illegible], ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, కె వెంకటేశ్వరరావు, కె [illegible] రావు, ఎస్ రవీంద్రనాథ్, కె ఉమాపతి ఎన్నికయ్యారు

మార్క్సిస్టుపార్టీ రాజకీయ పంథాలో మార్పుకు విజ్ఞప్తి

తిరువనంతపురం, నవంబరు 14

కాలానుగుణంగా తమ పార్టీ రాజకీయ పంథాలో మార్పులు రావాలని మార్క్సిస్టు పార్టీలో కొంత మంది కోరుకుంటున్నారని అయితే వారి కోర్కెను అగ్రనాయకులు అణచి పెడుతున్నారని కేరళ కమ్యూనిస్టు నాయకులు, రెవెన్యూ మంత్రి అయిన శ్రీ గోవిందన్ నాయర్ నేడిక్కడ పత్రికా సమావేశంలో అన్నారు

శ్రీయుతులు నంబూద్రిపాద్, రణదివేలు మార్పును వ్యతిరేకిస్తున్నారని, దేశంలో [illegible] రాజకీయ సంక్షోభాన్ని సృష్టించే ఉద్దేశంతో [illegible] ప్రస్తుతం నంబూద్రిపాద్ ఆందోళనలకు పిలుపు నిచ్చారని, పార్టీ రాజకీయ పంథాను పునఃపరిశీలించేందుకు అవకాశం లేకుండా చేయటానికి ఆందోళనలను చేపట్టవలసిందిగా పిలుపు నిచ్చారని శ్రీ గోవిందన్ నాయర్ వివరించారు.

తమిళనాడు ప్రతిపాదన తిరస్కృతి

మద్రాసు, నవంబరు 14

కేంద్రం అధీనంలోని [illegible] విమానాల్లో [illegible] మద్రాసుకూ పొడిగించాలని తమిళనాడు ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను కేంద్రం తిరస్కరించింది.

'అన్నపూర్ణ' ఆంధ్రప్రదేశ్‌లో ఆకలిమంటలు

విశాఖపట్టణం, నవంబరు 15

'అన్నపూర్ణ' అనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 70 శాతం మంది రోజుకు 65 పైసలు మాత్రమే ఆహారం నిమిత్తం ఖర్చు పెట్టగలుగుతున్నట్లు తెలుస్తోంది. ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ స్టేట్ బ్యూరో జరిపిన సర్వేలో ఈ విషయం బయటపడింది

స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ [illegible] బ్యూరో ప్రకటించిన సర్వే ఫలితాలు పై విషయం వెల్లడించాయి.

గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మొత్తం 10 శాతం తమ ఆహారం నిమిత్తం నెలకు కూడా రు. 10 లు కంటె ఖర్చుపెట్టలేరని తెలుస్తోంది.

గ్రామీణ ప్రాంతాలలో 61 శాతం మంది ఆహారేతర అవసరాల నిమిత్తం కూడా, గుడ్డ [illegible]. ఇతర అనేక అవసరాల నిమిత్తం రోజుకు మనిషికి 65 పైసలకంటే ఖర్చుపెట్టలేకపోతున్నారని ఆ ఫలితాలు తెలియజేశాయి

ఇంత తక్కువ ఖర్చు పెట్టే [illegible] పట్టణాల్లో 30 శాతం ఉంటారని తెలుస్తోంది.

తమ కూడూ, గూడు, గుడ్డ నిమిత్తం రోజుకు రు. 2 లు ఖర్చు పెట్టగలిగిన అదృష్టవంతులు పట్టణాలలో 10 శాతమూ ఇటు పల్లెటూళ్లలో 5 శాతం కంటే లేరని ఆ ఫలితాలు తెలియజేశాయి.

[illegible] 70 శాతం ప్రజల ఆదాయంలో 70 శాతం ఆహార ధాన్యాలు కొనడానికే ఖర్చవుతుంది. పట్టణ ప్రజలు తమ ఆదాయం 50 శాతం తిండి తిప్పల నిమిత్తం ఖర్చుపెట్టగలుగుతున్నారు.

లారీ ఢీ: ముఠా కార్మికుని మృతి

గుంటూరు, నవంబరు 15

ఈరోజు ఉదయం 6½ గంటలకు ఎ పి ఎస్. ఆర్. టి సి క్వార్టర్సు సమీపంలో ముఠా వర్కరు శ్రీ వీరయ్యను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు.

లారీ కొరకు పోలీసులు అన్వేషణ సాగిస్తున్నారు

శ్రీ వీరయ్య ఏటుకూరు రోడ్డులోగల పుగాకు కంపెనీలో ముఠా కార్మికుడు, ముఠా కార్మిక సంఘ కార్యకర్త కూడా.

దేశంలో రు. 1298 కోట్ల విదేశీ ప్రైవేటు పెట్టుబడులు

న్యూఢిల్లీ, నవంబరు 16

దేశంలో 1970 మార్చినాటికి విదేశీ ప్రైవేటు పెట్టుబడులు మొత్తం రు. 1,298 కోట్ల మేరకు వున్నాయి 1961 నాటికి విదేశీ పెట్టుబడులు రు. 634 కోట్లు.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీ వై. బి. చవాన్ నేడు రాజ్యసభలో పై విషయాన్ని తెలియజేశారు.

మరిన్ని విదేశీ ప్రైవేటు పెట్టుబడులను ప్రభుత్వం తప్పక ఆహ్వానిస్తుందని, అయితే ప్రభుత్వ విధానాల ననుసరించి ఎన్నిక చేసిన రంగాలలో మాత్రమే విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించగలదని తెలియజేశారు.

పెట్టుబడుల తరలింపు మూలధనంగా విదేశీ ద్రావ్యం, విదేశీ పెట్టుబడుల [illegible] గణనీయంగా తగ్గిపోయాయని చెప్పారు. అన్నిరంగాలలోనూ కాక, ఎన్నిక చేసిన రంగాలలో మాత్రం విదేశీ [illegible] కావలసిన విదేశీ పెట్టుబడులను మాత్రమే ఆహ్వానించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా ఈ మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానంలో మార్పు లేదన్నారు

లాభాలు, డివిడెండ తరలింపు పై ప్రభుత్వం ఏమైనా ఆంక్షలు విధించదలచిందా అని శ్రీయుతులు భూపేష్‌గుప్తా, చిత్త బసు అడిగిన ప్రశ్నకు శ్రీ చవాన్ సమాధానం చెపుతూ లాభాలు, డివిడెండ తరలింపు పెరగలేదని ఆయన అన్నారు.

1967-68 కంటె, 1969-70 లో లాభాల తరలింపు రు. 15.9 కోట్లనుండి రు. 12 కోట్ల వరకు తగ్గిపోయాయని డివిడెండ తరలింపు రు. 34.7 కోట్లనుండి రు. 31.4 కోట్లకు తగ్గిపోయాయని అన్నారు.

ఎప్పటికప్పుడు లాభాలు, డివిడెండ తరలింపుపై ఆంక్షలు విధించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించదలచలేదని ఆయన తెలియజేశారు.

15 రాష్ట్రాల్లో సోషలిస్టుపార్టీ పోటీ

న్యూఢిల్లీ, నవంబరు 15

రాష్ట్ర శాసనసభలకు వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో జరుగనున్న ఎన్నికలలో నూతనంగా ఏర్పడిన సోషలిస్టుపార్టీ కేంద్రపాలిత ప్రాంతాలతోసహా 15 రాష్ట్రాలలో పోటీ చేస్తుంది. వృక్షాన్ని ఎన్నికల చిహ్నంగా పార్టీ ఎన్నుకున్నది.


పూర్ణ ఆర్ట్ పిక్చర్స్
కూతురు-కోడలు
వినోదభరితమైన చక్కని కుటుంబ చిత్రం!
గంటగంటకు వేషాలు మార్చి మోసాలు చేసే విజయలలిత ఎవరు? చూడండి!
DEVI


నేడే చూడండి!
సృష్టికి మూలమయిన ఆదిశక్తి కలియుగలీలలు చూడండి!
ఆదిపరాశక్తి
పూర్తి పంచరంగుల చిత్రం
MOULIS

విజ్ఞుల ప్రశంసలతో, పత్రికా లోకం నీరాజనాలతో క్రిక్కిరిసిన ప్రేక్షకులతో తెలుగుదేశాన్ని ఆనంద డోలికల్లో ముంచెత్తుతున్న చిత్రం!
7 వ వారం
శ్రీ డి.వి.యస్ ప్రొడక్షన్స్
చిన్ననాటి స్నేహితులు
నిర్మాత డి.వి.యస్.రాజు
దర్శకత్వం కె.విశ్వనాథ్ B.Sc
లీలా ఆంధ్ర విజయా. [illegible] జయలక్ష్మి
నైజాం ఉషా. మైసూర్ బాలాజి
నార్త్ ఇండియా విశ్వేశ్వర
STUDIO Keertha
VITAYA


పొగాకూ, పరిశోధనయొక్క ప్రాముఖ్యతా

అంతర్జాతీయ మార్కెట్లలో నిత్యమూ వచ్చే గిరాకీలో మార్పుల్ని దృష్టిలో వుంచుకుని, స్పర్థకు తట్టుకోవాలంటే, భారతీయ సిగరెట్టు పొగాకు ఉత్పత్తి, దానికి తగిన పద్ధతిలో ఉండితీరాలి. దీన్ని సాధించాలంటే, క్రొత్త తీరుతెన్నులు గలిగి భారతీయ స్థితికి అనువైన పొగాకును సృష్టించటం, ఇంకా క్రొత్త ప్రాంతాలలో పొగాకు పంటను సాగుచేసే విషయంలోనూ నిరంతరం పరిశోధన చెయ్యవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

40 ఏళ్ళ క్రితమే ఒక పరిపూర్ణమైన పరిశోధనా వికాస కేంద్రాన్ని స్థాపించిన పొగాకు కంపెనీ, ఒక్క ఇండియన్ లీఫ్ టొబాకో కంపెనీ వారు మాత్రమే. పొగాకు పంటను గూర్చిన సమగ్రమైన పరిశోధనను చేసే నిమిత్తం యీ ఏడు 16 లక్షల రూపాయలు ఖర్చు పెట్టబడుతోంది. ఎటువంటి సిగరెట్ల రకాల వైపు ప్రజలు మొగ్గుతున్నారో, ఆసక్తి చూపిస్తున్నారో, ప్యాకేజింగ్, యింకా యితర అంశాల్ని గూర్చిన పరిశోధన ఐ ఎల్ టి డి వారి అనుబంధ సంస్థ అయిన, ఇండియా టొబాకో కంపెనీ లిమిటెడ్ వారు చేస్తున్నారు.

నిపుణులైన శాస్త్రజ్ఞులూ, వ్యవసాయ శాస్త్రజ్ఞులతో వున్న ఐ ఎల్ టి డి వారి పరిశోధనా కేంద్రం సగర్వంగా చెప్పుకోగల అనేక విషయాల్ని సాధించింది. ఈ నాడు ఎగుమతిలో ప్రత్యేక స్థానం సంపాదించినవీ, ఆంధ్ర దేశంలో పండేవీ అయిన స్పెషల్ ఎఫ్.సి.వి., "6/03"—వీట్లని సృష్టించినది ఐ ఎల్ టి డి వారే. పొగాకును పండించటం వారు చేసే కార్యక్రమాల్లో ఒకటి మాత్రమే. ఈ పరిశోధనా కేంద్రం వ్యవసాయదారులకి, శాస్త్రీయంగా పొగాకు పండించటం కోసం, భూమి, నీటి పరీక్ష, ఎరువుల వాడుక, పీడల నివారణా, క్యూరింగు పద్ధతులూ—వీట్నిన్నిటిలోనూ సలహాలిస్తుంది. దీనివల్ల, రైతుకు కలిగే లాభాలు—పంటలో నాణ్యతా, అధిక ఉత్పత్తి, తద్వారా జీవన ప్రమాణంలో పెరుగుదల.

శాస్త్రీయ పద్ధతులలో పండించటమూ, క్రమబద్ధమైన పంట మార్పిడీ—వీటివల్ల యితర ధాన్యాలు కూడా అధికంగా పండుతున్నాయి.

ఐ ఎల్ టి డి వారి దృష్టిలో, పరిశోధన అంటే, పొగాకు యొక్క సంపూర్ణ వికాసం అన్నమాట

ఇండియన్ లీఫ్ టొబాకో డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్
ULCZ TEL

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ప్రింటర్ అండ్ పబ్లిషర్ : టి. వెంకటేశ్వరరావు, ఎడిటర్ : వేములపల్లి శ్రీకృష్ణ, ముద్రణ : స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ-4, R. No. 1138/57